

వైసీపీలో ఉండలేం..!

ఒంగోలు వచ్చిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డిని సోమవారం నలుగురు వైసీపీ కార్పొరేటర్లు కలవలేదు. కలిసిన మరో ముగ్గురు, నలుగురు అసంతృప్తి, అసమ్మతి రాగాలు వినిపించారు. బాలినేని మాత్రం 'మరో రెండు నెలలు ఆగండి. తిరిగి నేను ఒంగోలు వస్తా. అధికారపార్టీ స్థానిక నేతల బాగోతాలు బయటపెడతా' అని హెచ్చరికలు, హామీలు ఇచ్చారు. మరోవైపు వెంటనే స్పందించిన ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మేము అధికారంలోకి వచ్చి 20 రోజులే.. ముందు మీ బాగోతాలు చాలా బయటకు తీస్తామని హెచ్చరించారు. మరో మూడు రోజుల్లో కార్పొరేషన్ లెక్క సెటిల్ చేస్తామని స్పష్టం చేశారు. దీంతో ఒంగోలు కార్పొరేషన్ రాజకీయం మరింత వేడెక్కింది.

- బాలినేని కార్యక్రమానికి నలుగురు కార్పొరేటర్లు డుమ్మా
- మరో నలుగురు అసమ్మతిరాగం
- రెండు నెలలు ఆగి వస్తా.. అన్నీ తేలుస్తా : మాజీ మంత్రి
- మూడు రోజుల్లో లెక్క అంతా సెటిల్ : ఎమ్మెల్యే దామచర్ల
- వేడెక్కిన కార్పొరేషన్ రాజకీయం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఒంగోలు కార్పొరేషన్‌లోని వైసీపీ కార్పొరేటర్లలో కొందరు టీడీపీలో చేరటం ప్రారంభించటంతో వైసీపీ పెద్దల్లో కలవరం మొదలైంది. పార్టీ మారే కార్పొరేటర్లను కాపాడుకునేందుకు వైసీపీ నేత, మాజీ మంత్రి బాలినేని ప్రయత్నాలు ప్రారంభించారు. అందులోభాగంగా ఓట్ల లెక్కింపు రోజు హైదరాబాద్ వెళ్లిన బాలినేని సోమవారం ఉదయం 11 గంటలకు ఒంగోలు చేరారు. స్థానిక రైల్వేస్టేషన్‌లో పార్టీశ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. ఆ తర్వాత ఆయన డివిజన్‌లోని పార్టీ నాయకులు, కార్పొరేటర్లతో మంతనాలు జరుపుతూనే ఉన్నారు. అందిన సమాచారం మేరకు.. నలుగురు కార్పొరేటర్లు బాలినేనిని కలవలేదనేది సమాచారం. అందులో 37, 50, 30, 23వ డివిజన్‌ల కార్పొరేటర్లు ఉన్నట్లు తెలిసింది. 11వ డివిజన్ కార్పొరేటర్ కూడా బాలినేనిని కలవనప్పటికీ ఆయన కుమారుడు హాజరైనట్లు తెలిసింది. బాలినేనిని కలిసిన వారిలో 24వ డివిజన్ కార్పొరేటర్ కుటుంబ సభ్యులు 'మాకు తప్పని పరిస్థితి. మేము వైసీపీలో ఉండలేము' అని చెప్పినట్లు సమాచారం. మరో కార్పొరేటన్ భర్త పసుపులేటి శ్రీనివాసరావు ఎన్నికల సమయంలో మమ్మల్ని పక్కనపెట్టి బయటివారిని ఇన్‌చార్జిగా నియమించి మమ్మల్ని అవమానించారంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. 2వ డివిజన్ కార్పొరేటర్ తమ డివిజన్‌లో పార్టీ కార్యకర్తలపై దాడులు చేస్తుంటే మన పార్టీ తరఫున ఆలకించిన నాథుడే లేకపోవడం తమ అసంతృప్తికి కారణమన్నట్లు తెలిసింది. ఇలా మరో ఇద్దరు, ముగ్గురు కార్పొరేటర్లు ఆయా అంశాలపై బాలినేని ఎదుట వారు అసంతృప్తి వెల్లగక్కినట్లు సమాచారం.

ఇలా వచ్చి అలా వెళ్లారు..

కొందరు కార్పొరేటర్లు ఇలా వచ్చి అలా వెళ్లిపోవడం ద్వారా వారి మనోగతం తేటతెల్లం చేశారు. మరికొందరు కార్పొరేటర్లు మాత్రం బాలినేని పక్కనే ఉండి పూర్తి మద్దతు ప్రకటించారు. ఈమొత్తం వ్యవహారాన్ని పరిశీలిస్తే రానున్న రోజుల్లో కొందరు వైసీపీ కార్పొరేటర్లు టీడీపీలో చేరడం ఖాయంగా కనిపిస్తోంది. కేవలం 10మంది కార్పొరేటర్లు చేరితే కార్పొరేషన్ పాలకమండలిలో టీడీపీకి ఆధిక్యత వచ్చేస్తుంది. సోమవారం నాటి పరిస్థితి గమనిస్తే భవిష్యత్తులో కార్పొరేషన్ టీడీపీ చేతిలోకి వెళ్లే అవకాశాలు ఎక్కువగా కనిపించాయి. కాగా బాలినేని శ్రీనివాసరెడ్డి మాత్రం తిరిగి రాజకీయంగా చురుకైన పాత్ర పోషిస్తానని ప్రకటించారు. అయితే రెండు నెలల అనంతరం ఒంగోలు వచ్చి అప్పటి నుంచి ఇక్కడే ఉంటానని సెలవిచ్చారు.

వేచిచూడండి.. అంతా మార్చేస్తాం

ఆ సందర్భంగా దామచర్ల పాలన తీరుపై తీవ్రస్థాయిలో బాలినేని ధ్వజమెత్తారు. ఆ తర్వాత ప్రతిస్పందించిన దామచర్ల... బాలినేని పాలనలో జరిగిన అవినీతి వ్యవహారాలు ఒక్కొక్కటి బయటకు వస్తాయి. వేచి ఉండండి అన్నారు. వైసీపీ కార్పొరేటర్ల పార్టీ మార్పుపై మూడు రోజుల్లో లెక్కలన్నీ తేలుతాయని, వెయిట్ చేయండి అంటూ ప్రకటించారు. ఈ ఇద్దరు నాయకుల స్పందన, ప్రతిస్పందన స్థానికంగా ఆపార్టీ రాజకీయ పరిస్థితులను పరిశీలిస్తే రానున్న రోజుల్లో ఒంగోలు రాజకీయాల్లో స్పష్టమైన మార్పులకు, కార్పొరేషన్ టీడీపీ పరమయ్యేందుకు అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి.

ధైర్యం ఉంటే విల్లాస్‌కు రా..!

- చొక్కా విప్పి బాలినేనికి సవాల్ విసిరిన గుప్తా



ఒంగోలు(క్రైం), జూలై 15: 'శ్రీకర విల్లాస్ దగ్గరకు మంగళవారం వస్తా.. నీకు దమ్ము, ధైర్యం ఉంటే రా.. తేల్చుకుందాం' అని ఒంగోలుకు చెందిన సుబ్బారావు గుప్తా మాజీ మంత్రి బాలినేనికి సవాల్ విసిరారు. సోమవారం స్థానిక ఓ షోరూంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బాలినేని అవినీతిపై సుబ్బారావు గుప్తా విరుచుకుపడ్డారు. శ్రీకర విల్లాస్‌లో జరిగిన అవినీతి, అక్రమాలను ఆధారాలతో మంగళవారం మధ్యాహ్నం తీసుకొస్తానని తెలిపారు. అక్కడకు వస్తే అన్నీ తేల్చుకుందామన్నారు. ఈ సందర్భంగా చొక్కా విప్పి మరీ బాలినేనికి గుప్తా సవాల్ విసిరారు. గత ఐదేళ్లలో ఒంగోలులో జరిగిన భూకుంభకోణాలకు కారణం బాలినేని కుమారుడేనని ఆరోపించారు.

సిట్ వేశావు.. ఎంతమందిని అరెస్టు చేయించావు : రియాజ్

జనసేనలో చేరుతానని తనతో దామచర్ల మాట్లాడించాడని బాలినేని శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించడం హాస్యాస్పదంగా ఉందని జనసేన అధ్యక్షుడు షేక్ రియాజ్ పేర్కొన్నారు. జనసేనలోకి వస్తానని బాలినేని సంప్రదింపులు జరపడం నిజం కాదా? వైసీపీ కార్యకర్తలను మోసం చేసి నట్లు ప్రజలను ఇంకా ఎన్నాళ్లు మోసం చేస్తారని ప్రశ్నించారు. భూఆక్రమణలపై సిట్ వేయించింది తానే అని చెప్పుకుంటూ అందరినీ నమ్మించే ప్రయత్నం చేస్తున్న బాలినేని ఆ కేసులో ఎంతమందిని అరెస్టు చేయించారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. భూ ఆక్రమణలో కూటమి ప్రభుత్వం ఎవరినీ వదిలే ప్రసక్తి లేదన్నారు. చట్టం తన పని తాను చేసుకుంటుందని అమాయకంగా మాట్లాడితే ప్రజలు నమ్మే రోజులు పోయాయని రియాజ్ తెలిపారు.

మానసికస్థితి చూసుకో!



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జనార్దన్, పక్కన రియాజ్

- టీడీపీలో చేరేందుకు బాబుతో సంప్రదింపులు అబద్ధమా?
- నేను అవినీతి చేస్తే అధికారంలో ఉన్నప్పుడు ఏమి చేశావు
- ప్రజలు బుద్ధిచెప్పినా మారని బాలినేని..!
- దాడుల సంస్కృతి మాది కాదు.. వైసీపీదే
- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే దామచర్ల ధ్వజం

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 15 : 'ఐదుసార్లు ఎమ్మెల్యే, రెండుసార్లు మంత్రి అన్నావు. కానీ ఒంగోలుకు చేసిందేమీ లేదు. ప్రజలు బుద్ధిచెప్పినా ఇంకా అబద్ధాలు చెప్పడం మానుకోలేదు. వయసులో పెద్దోడివి.. ఆరోగ్యం కాపాడుకో. మానసికస్థితి బాగాలేక ఏదేదో మాట్లాడుతున్నావు' అని మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డిపై ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ధ్వజమెత్తారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కౌంటింగ్ సమయంలో నాలుగో రౌండ్‌కే కార్యకర్తలను వదిలేసి ఊరు విడిచి వెళ్లిన బాలినేని ఇప్పుడు వచ్చి నెలకే ఏదో జరిగిపోయిందని నోరు పారేసుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 'ఊరొదిలి వెళ్లమని మేము చెప్పలేదు. తిరిగి రమ్మనలేదు. ఇవే చివరి ఎన్నికలు అని మేము అనలేదు. మరలా పోటీచేయాలని ఎవరూ చెప్పలేదు'.. కానీ అవన్నీ బాలినేని మాట్లాడటం చూస్తుంటే వయసురీత్యా మానసికస్థితి అదుపు తప్పినట్లు అర్థమవుతుందన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని టీడీపీ కార్యకర్తలపై చేసిన దాడులు అప్పుడే మర్చిపోయి అమాయకంగా మాట్లాడితే ఎవరూ నమ్మే పరిస్థితి లేదన్నారు. బాలినేని, ఆయన కుమారుడు చేసిన అరాచకాలు ప్రజలు చూశారు కాబట్టే ఒంగోలు నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూలేని విధంగా తనను అత్యధిక మెజారిటీతో గెలిపించారన్నారు. అది కూడా తెలుసుకోలేని బాలినేని అమాయకత్వం చూస్తే జాలి వేస్తుందన్నారు. తాను అవినీతి చేస్తే అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు నిరూపించలేకపోయావని దామచర్ల ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీలో చేరేందుకు చంద్రబాబునాయుడితో ఎన్నికలకు ముందు, రెండు రోజుల క్రితం కూడా వైసీపీ నేతలతో కలిసి జనసేనలో చేరేందుకు సంప్రదింపులు జరపడం నిజం కాదా? అని దామచర్ల ప్రశ్నించారు. గతంలో బాలినేని కొడుకు ప్రణీత్‌రెడ్డి గంజాయి బ్యాచ్‌తో చేయించిన దాడులపై చట్ట రీత్యా చర్యలు తప్పవన్నారు. ఎవరినీ వదిలే ప్రసక్తిలేదని దామచర్ల స్పష్టం చేశారు. వైసీపీ నాయకులు ఆక్రమించిన భూములను చట్ట పరంగా విచారించి ఎవరివి వారికే అందిస్తామన్నారు. రాజుపాలెంలో తమ ఆధ్వర్యంలో ఉన్న ఆక్వా చెరువులపై అధికారంలో ఉన్నప్పుడు ఏమీ చేయలేకపోయావని, ఇప్పుడు ఏమి చేస్తావని అన్నారు.

ఒంగోలులోనే ఉండు.. తప్పులు చేస్తే ప్రశ్నించు

బాలినేనిని ఎవరూ ఒంగోలు వదిలి వెళ్లమనలేదని దామచర్ల అన్నారు. 'ఒంగోలులోనే ఉండు.. హ్యాపీగా పేకాట ఆడుకో.. కార్యకర్తలకు అండగా ఉండు.. మేము తప్పు చేస్తే ప్రశ్నించు' అని దామచర్ల అన్నారు. కానీ అవగాహన లేకుండా నోరు ఉందని, పక్కనోళ్లు చెప్పే స్క్రిప్ట్ చదివితే జనం నవ్వుకుంటున్నారని పేర్కొన్నారు. రోజూ తాగునీరు ఇవ్వాలని బాలినేని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల సమయంలో ప్రతిసారీ రోజూ తాగునీరు ఇస్తామని అబద్ధాలు చెప్పి ప్రజలను మోసం చేయడం బాలినేనికే చెల్లుతుందన్నారు. అమృత్ పథకం కింద వచ్చిన నిధులను తానేదో ఢిల్లీకి వెళ్లి తెచ్చినట్టు జీవోలకే ర్యాలీలు చేసి గొప్పలు చెప్పుకోవడం జనానికి తెలిసిపోయిందన్నారు.

మామూళ్ల కోసం వేధింపులు

డ్వామా పీడీపై ఉద్యోగుల ధ్వజం

- ఒంగోలు యూటీఎఫ్ కార్యాలయంలో సమావేశం
- కలెక్టరేట్ వరకూ ర్యాలీ.. అక్కడ కొద్దిసేపు నిరసన



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న డ్వామా ఉద్యోగులు

ఒంగోలు (కలెక్టరేట్), జూలై 15: జిల్లా నీటి యాజమాన్య సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు రోడ్డెక్కారు. పీడీ బి.అర్జునరావు మామూళ్ల కోసం వేధింపులకు గురిచేస్తుండటంతో తట్టుకోలేక ఆ శాఖలోని అన్ని విభాగాల్లో పనిచేసేవారు ఆందోళనకు దిగారు. డ్వామాలో గత 18 ఏళ్ల నుంచి పనిచేస్తున్న ఉద్యోగులను పీడీ చులనకగా చూడటంతోపాటు అసభ్యకరంగా మాట్లాడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఒంగోలులోని యూటీఎఫ్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం డ్వామా ఉద్యోగులు సమావేశమై పీడీ అర్జునరావు విధానాలపై చర్చించారు. ఈ ఏడాది మార్చిలో పీడీగా ఆయన బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఉద్యోగుల పట్ల దురుసుగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. క్లస్టర్ పరిధిలో ప్రగతి పేరిట సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేసి ప్రతి మండలం నుంచి నెలకు రూ.లక్ష తనకు మామూళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. లేనిపక్షంలో ఆయా ఉద్యోగులను టార్గెట్ చేసి సమావేశాలు, టెలికాన్ఫరెన్స్‌ల్లో సస్పెండ్ లేదా ఉద్యోగం నుంచి తొలగిస్తానని హెచ్చరిస్తూ భయపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్క్ విజిట్ పేరుతో ప్రతి మండలానికి వెళ్లడం, బెదిరించడం పనిగా పెట్టుకున్నారని ఉద్యోగులు వాపోయారు.. క్షేత్రస్థాయి విజిట్‌కు వచ్చే ముందు పీడీ నేరుగా మండలస్థాయి సిబ్బందికి ఫోన్ లేదా వాట్సప్ కాల్ చేసి తన వ్యక్తిగత సిబ్బంది వస్తారని, డబ్బులు రెడీ చేసుకోవాలని ఆదేశాలు ఇస్తున్నారన్నారు. గత నాలుగు నెలల కాలంలో రూ.2కోట్లకుపైగానే డ్వామా పీడీ అర్జునరావు వెనకేసుకున్నారని వారు ఆరోపించారు. అంతేకాకుండా ఇంటికి కావాల్సిన వస్తువులను కూడా ఫోన్ చేసి తెప్పించుకుంటున్నారని, లేనిపక్షంలో తమను హీనంగా మాట్లాడుతున్నారని ఉద్యోగులు వాపోయారు. డ్వామా పీడీ అర్జునరావు నుంచి విముక్తి చేసి ఉపాధి పథకాన్ని బతికించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో ఏపీడీలు, ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లతోపాటు డ్వామా జిల్లా కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు పాల్గొన్నారు. కాగా సమావేశం తర్వాత యూటీఎఫ్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి పీడీ అర్జునరావు వేధింపుల నుంచి కాపాడాలని వేడుకున్నారు. ఆయన అక్రమాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.


విద్యాశాఖలో ఏడుగురికి ఎఫ్‌ఏసీ ఉత్తర్వులు

- ఒకరు ఎంఈవో, ఆరుగురు గ్రేడ్-2 హెచ్‌ఎంలుగా నియామకం

ఒంగోలు(విద్య), జూలై 15 : ఉద్యోగ విరమణ చేసిన ఒక ఎంఈవో-1, ఆరుగురు గ్రేడ్-2 హెచ్‌ఎంల స్థానంలో ఏడుగురికి పూర్తి అదనపు బాధ్యతలు(ఎఫ్‌ఏసీ) అప్పగిస్తూ పాఠశాల విద్య గుంటూరు ఆర్‌జేడీ బి.లింగేశ్వరరెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. పరిపాలన, జీతాల చెల్లింపుల సౌలభ్యం కోసం ఈ ఏర్పాట్లు చేశారు. ఉద్యోగ విరమణ చేసిన సింగరాయకొండ ఎంఈవో-1 స్థానంలో అక్కడి మూలగుంటపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కె.శ్రీనివాసరావును నియమించారు. పెదకండ్లగుంట జడ్పీ హైస్కూల్‌కు అదేపాఠశాలలో పనిచేస్తున్న గణితం స్కూల్ అసిస్టెంట్ వై.శ్రీనివాసులు, ఎం.నిడమానూరు జడ్పీ హైస్కూల్‌కు ఆ పాఠశాల పీఎస్ స్కూల్ అసిస్టెంట్ ఎం.కల్యాణి, మద్దులూరు జడ్పీ హైస్కూల్‌కు సోషల్ స్కూల్ అసిస్టెంట్ ప్రభాకరరావులకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. మాగుటూరు జడ్పీ హైస్కూల్‌కు హిందీ స్కూలు అసిస్టెంట్ బి.వెంకటరమణ, పూసలపాడు జడ్పీ హైస్కూల్‌కు హిందీ స్కూల్ అసిస్టెంట్ సయ్యద్ షబ్బీర్‌ను, హెచ్‌ఎంపాడు జడ్పీ హైస్కూల్‌కు అక్కడి ఇంగ్లీషు టీచర్ బి.వి.సుబ్బారావును ఇన్‌చార్జి హెచ్‌ఎంలుగా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

అటాచ్‌మెంట్.. ఆగమేఘాలపై!

- చీమకుర్తి సీఐగా సుబ్బారావు బాధ్యతలు



ఒంగోలు(క్రైం), జూలై 15: గెలాక్సీ టౌన్‌గా పేరుగాంచిన చీమకుర్తి పోలీసు స్టేషన్ సీఐ పోస్టింగ్ వివాదాస్పదమైంది. సోమవారం ఇక్కడ సీఐగా గుంటూరు సీసీఎస్‌లో పనిచేస్తున్న ఎం.సుబ్బారావు బాధ్యతలు తీసుకున్నారు. అక్కడ పనిచేస్తున్న దుర్గాప్రసాద్‌పై అవినీతి ఆరోపణలు రావడంతో 15 రోజుల క్రితం సస్పెండ్ చేసిన విషయం విదితమే. దీంతో ప్రస్తుతం ఇన్‌చార్జిగా రూరల్ సీఐ అజయ్ కుమార్ పని చేస్తున్నారు. అయితే తాజాగా ఎం.శ్రీనివాసరావును నియమించాలని సంతనూతలపాడు ఎమ్మెల్యే విజయకుమార్ కోరినట్లు తెలిసింది. అయితే ఎమ్మెల్యే సూచనను పరిగణనలోకి తీసుకోకుండా హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ దగ్గర సహాయకుడిగా పనిచేస్తున్న వ్యక్తి సిఫార్సు మేరకు సుబ్బారావుకు గుంటూరు రేంజ్ ఐజీ అటాచ్‌మెంట్ ఇచ్చారు. దీంతో హడావుడిగా సుబ్బారావు చీమకుర్తి వచ్చి బాధ్యతలు చేపట్టారు.

మారిన మధ్యాహ్న భోజనం మెనూ

ఒంగోలు (విద్య), జూలై 15: ప్రభుత్వ రంగ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం మెనూను ప్రభుత్వం మార్చింది. కొత్తది ప్రకటించింది. ఇక నుంచి పీఎం పోషన్ మధ్యాహ్న భోజన పథకంగా దీన్ని అమలు చేయనుంది. విద్యార్థులకు నాణ్యమైన చిక్కీలు, గుడ్లు అందించాలని ఆదేశించింది. ప్రభుత్వం ప్రకటించిన పోషకాహార మెనూ 2024-25ఇలా ఉంది.

సోమవారం : హాట్ పొంగలి, ఉడికించిన గుడ్లు లేదా కూరగాయల పలావు, గుడ్లు కూర, వేరుశనగ చిక్కీ.

మంగళవారం : పులిహోర, టమాటా పచ్చడి లేదా దొండకాయ పచ్చడి, ఉడికించిన గుడ్డు

బుధవారం : కూరగాయల అన్నం, బంగాళాదుంప కుర్మా, ఉడికించిన గుడ్డు, వేరుశనగ చిక్కీ

గురువారం : సాంబర్ బాత్, ఉడికించిన గుడ్డు

శుక్రవారం : అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, వేరుశనగ చిక్కీ

శనివారం : తీపి పొంగలి, ఆకుకూర అన్నం, పప్పుచారు.



డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

రేపు రేషన్ డీలర్ల సర్వసభ్య సమావేశం

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 15 :ఒంగోలులోని కాపు కల్యాణ మండపంలో ఈనెల 17వతేదీ ఉదయం పది గంటలకు రేషన్ డీలర్ల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర జాతీయ ఉత్పత్తి పంపిణీ పథకం నిర్వహణదారుల సంక్షేమ సమాఖ్య అధ్యక్షుడు మోదుకూరి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక సంఘ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో డీలర్లు అనేక ఇబ్బందులకు గురయ్యారన్నారు. ఈ కొత్తప్రభుత్వంలో డీలర్ల జీవనోపాధి, జీతభత్యాలపై చర్చిస్తామని తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి, ఒంగోలు, సంతనూతలపాడు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్ విజయకుమార్‌లు పాల్గొంటారని తెలిపారు. ఈసమావేశంలో డీలర్లందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో కార్యదర్శి సుమన్, కారుముడి సింపిరయ్యలు ఉన్నారు.



ప్రపంచ యువ నైపుణ్యదినోత్సవ సభలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

యువత నైపుణ్య శిక్షణ పొందాలి

ఒంగోలు(కలెక్టరేట్),జూలై 15 : ప్రస్తుత ఆధునిక కాలంలో నైపుణ్యాల శిక్షణకు ఎంతో ప్రాధాన్యత ఏర్పడిందని, అందువల్ల యువతీ, యువకులు ఏదో ఒక వృత్తిలో శిక్షణ పొందాలని జన శిక్షణ సంస్థాన్ డైరెక్టర్ పి. శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర పారిశ్రామిక శిక్షణ సంస్థలో సోమవారం ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవ కార్యక్రమానికి పారిశ్రామిక శిక్షణ సంస్థ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ శిక్షణ పొందిన వారికే నైపుణ్యం పెరుగుతుందన్నారు. 20శాతం యువత నైపుణ్యం లేమితో ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారని తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జే రవితేజ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జిల్లాలో ఎంపిక చేసిన కళాశాలలు, ఐటీఐ కాలేజీల్లో స్కిల్ హబ్స్ ద్వారా వృత్తి శిక్షణకార్యక్రమాలను ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లా యువజన సంక్షేమశాఖ మేనేజర్ పి. శ్రీమన్నారాయణ మాట్లాడుతూ తమ సంక్షేమ శాఖ ద్వారా యువజనులకు అనేక ప్రోత్సాహక పథకాల ద్వారా ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఎ్‌సఎస్ ప్రోగ్రాం అధికారులు కే శ్యాంసునీల్, హరికృష్ణ, కో ఆర్డినేటర్లు కే శివకృష్ణ, పి. రాజేష్‌బాబు, స్టాఫ్ సిబ్బంది కృష్ణ ప్రసాద్ తదితరులు ఉన్నారు. అంతకు ముందు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.

కారుమంచి మేజర్‌కు మరమ్మతులు చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 15 : నాగార్జున సాగర్ ఒంగోలు బ్రాంచి కాలువపై ఉన్న కారుమంచి మేజర్‌కు మరమ్మతులు చేపట్టాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ కారుమంచి మేజర్‌కాలువ కట్ట మధుకాన్ గ్రానైట్ క్వారీలోకి జారి పోయి మూడేళ్ళు గడుస్తున్నా ఇప్పటికీ పూర్తి చేయపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ఈ కాలువ కింద 17 గ్రామ పంచాయతీల పరిధిలో 25వేల ఎకరాలు సాగు అవుతుందని, అందువల్ల ఆ కాలువకు వెంటనే మరమ్మతులు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. అనంతరం జేసీ గోపాలకృష్ణను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బెజవాడ శ్రీనివాసరావు, కే చిన్నపురెడ్డి, కొల్లూరి వెంకటేశ్వర్లు, నల్లూరి కృష్ణయ్య ఉన్నారు.

భవనం పైనుంచి పడి బేల్దారి మృతి

ఒంగోలు(క్రైం),జూలై15: మూడంతస్తుల భవనం పైనుంచి పడి బేల్దారి మేస్త్రీ మృతి చెందాడు. ఈ సంఘటన స్థానిక వెంకటేశ్వరకాలనీలో సోమవారం జరిగింది. చీమకుర్తి మండలం దేవరపాలెంనకు చెందిన కడియం సురేష్ (35) బేల్దారి పనులకు వచ్చి మూడంతుస్థుల భవనం పై నుంచి జారి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు తాలుకా పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలి

కలెక్టర్ అన్సారియా ఆదేశం

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 15 : ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించే అర్జీలకు అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని మీకోసం సమావేశపు హాలులో సోమవారం మీ కోసం కార్యక్రమంలో వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన ప్రజలు పలు రకాల సమస్యలను విన్నవించారు. ఆయా సమస్యలపై కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారులు సంతృప్తి చెందేలా నిర్దేశిత గడువులోపు తప్పని సరిగా పరిష్కారం చూపాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీ కోసం కార్యక్రమానికి సంబంధించి ఆన్‌లైన్‌లో వచ్చే అర్జీలను సంబంధిత శాఖల హెచ్‌వోడీలు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అర్జీదారులకు నిర్దేశిత గడువులోగా నాణ్యమైన పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు అధికారులకు అర్జీలను అందజేశారు. ఈకార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ, డీఆర్వో విశ్వేశ్వరరావు, ఎస్‌డీసీలు వరకుమార్, ఝాన్సీలక్ష్మి తదితరులు ఉన్నారు.


మీ కోసం కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అన్సారియా, అధికారులు

అవగాహన పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్

హెల్మెట్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. స్థానిక మీ కోసం భవన్‌లో సోమవారం రవాణా శాఖ రూపొందించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో జేసీ గోపాలకృష్ణ, డీటీసీ సుశీల తదితరులు ఉన్నారు.

ఫిషింగ్ హార్బర్ స్థల పరిశీలన

కలెక్టర్‌కు సమస్యలు విన్నవించిన మత్స్యకారులు

కొత్తపట్నం(ఒంగోలు నగరం) జూలై 15:పిన్నివారిపాలెం తీర ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న ఫిషింగ్ హార్బర్ స్థలాన్ని కలెక్టర్ తమీమ్ అన్సారియా సోమవారం పరిశీలించారు. స్థలం విస్తీర్ణం, భౌగోళిక పరిస్థితుల గురించి రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులు వెంటనే ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని ఆమె ఆదేశించారు. కొత్తపట్నం మండలంలోని పలు గ్రామాల్లో కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. ముందుగా కొత్తపట్నం పల్లెపాలెంలో పర్యటించి మత్స్యకారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మత్స్యకార గ్రామంలో ఆ మె పర్యటించి వారి జీవన విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. వారు ఎదుర్కొంటున్నసమస్యలను శ్రద్ధగా విన్నారు. తీరంలో పర్యటించి వలలను, బోట్లను పరిశీలించారు. వేటలో ఎదురవుతున్న ఇబ్బందులను గురించి ఆమె మత్స్యకారులను అడిగి తెలుసుకున్నారు. మత్స్యకారులు చేపలు ఎండబెట్టుకునేందుకు స్థలం కేటాయించాలని కోరారు. మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ చంద్రశేఖరరెడ్డి మత్స్యకారులకు ప్రభుత్వం అందించే పథకాలను మత్స్యకారులకు చేరువ చేస్తున్నట్లు వివరించారు. పరిశీలించారు అనంతరం ఆ మె పాదర్తి వద్ద ఉన్న కస్తూర్బా గాంధీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాత్రి సమయంలో ఆమె పాఠశాలలోని విద్యార్థినులతో ఎక్కువసేపు గడిపారు. వారికి పాఠశాలలో అందుబాటులో ఉన్న వసతులను పరిశీలించారు. వారి కోసం సిద్ధంగా ఉంచి కూరగాయలు, ఇతర నిత్యావసర సరుకులనాణ్యతను ఆమె పరిశీలించారు. మెనూ సక్రమంగా అమలు జరుగుతుందా అంటూ విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల బోధన మీకు అర్థం అయ్యేలా ఉంటుందా అంటూ వారిని అడిగారు. క్రమ శిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆమె విద్యార్థులను కోరారు. ప్రభుత్వం కేజీబీవీ లాంటి పాఠశాలలను ఏర్పాటు చేసి పేదలకు నాణ్యమైన విద్యను అందిస్తుందని, విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. ఆమె వెంట మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ చంద్రశేఖరరెడ్డి, కె పల్లెపాలెం ఎంపీటీసీ నరసింహారావు , గ్రామ కాపులు పాల్గొన్నారు.


ఫిషింగ్ హార్బర్‌కు కేటాయించిన స్థలం వివరాలు అధికారులను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ అన్సారియా


ఆంజనేయులు విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే జనార్దన్

దామచర్ల ఆంజనేయులు జయంతి

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 15 : మాజీ మంత్రి, స్వర్గీయ దామచర్ల ఆంజనేయులు 95వ జయంతి జిల్లా తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జనార్దన్ హాజరై మాట్లాడారు. తమ తాత ఆంజనేయులు జీవితం తమకు ఆదర్శమన్నారు. ఆయన ఆశయ సాధన కోసం తాను పనిచేస్తానని తెలిపారు. విద్యా సంస్థలు, వ్యాపారాలు నెలకొల్పి ఎందరికో అండగా నిలిచారని అన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ శ్రేణులు పాల్గొని నివాళులు అర్పించారు. ముందుగా పెద్దాయన ఆంజనేయులు, స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తెలుగుదేశం పార్టీలో వివిధ పదవులు అలంకరించి, పార్టీ అభివృద్ధి కోసం, ఆయన చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. అనంతరం స్థానిక బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ ఎదురు, కర్నూలు రోడ్ పై ఓవర్ బ్రిడ్జి వద్ద ఆంజనేయులు విగ్రహాలకు పూలమాలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని దామచర్ల సేవలను స్మరించుకున్నారు.

అన్న క్యాంటీన్లకు గోల్డ్ మర్చంట్స్ సహాయం

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 15 : తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో పేదల ఆకలి తీర్చేందుకు త్వరలో అందుబాటులోకి రానున్న అన్న క్యాంటీన్లకు ఆర్థిక సహాయం అందిస్తూ, భాగస్వాములుగా ఉండేందుకు పలువురు ముందుకు వస్తున్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సొంత నిధులతో, అదేవిధంగా దామచర్ల అభిమానుల ఆధ్వర్యంలో 29 రోజులుగా ఒంగోలు నగరంలో నాలుగు క్యాంటీన్‌లలో ఉచితంగా భోజనం అందిస్తున్నారు. అందుకోసం నగరానికి చెందిన గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం రూ. లక్ష ఆర్థిక సహాయాన్ని అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే దామచర్లకు అందజేశారు.


జనార్దన్‌కు నగదు అందజేస్తున్న గోల్డ్‌మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులు

కౌలు కార్డులను సద్వినియోగం చేసుకోవాలి

మద్దిపాడు,జూలై 15: ఖరీఫ్ సీజన్లో కౌలు రైతులకు గ్రామసభలు నిర్వహించి కార్డులు అందజేస్తామని వ్యవసాయ అధికారి జి.రమేష్‌బాబు తెలిపారు. సోమవారం పెద్దకొత్తపల్లి, నేలటూరు గ్రామంలో ఆయన గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కౌలు కార్డులు అందజేస్తామని అన్నారు. ఈ కార్డు 11 నెలల పాటు పనిచేస్తుందని, దీనివల్ల పంట నష్టపరిహారం, ఇన్సూరెన్స్ పొందటానికి సబ్సిడీపై విత్తనాలకు కౌలు రైతులకు వీలు కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి పాటిబండ్ల వెంకటశేషారావు, బాలసుబ్రహ్మణ్యం, షాహినా, వీఆర్వో వెంకటస్వామి, రైతులు పాల్గొన్నారు.

చేకూరపాడు రోడ్డు ఛిద్రం

ఐదేళ్లలో తట్టమట్టి పోయని వైసీపీ ప్రభుత్వం

అధ్వానంగా మారిన రోడ్డుతో గ్రామస్థుల అవస్థలు

మరమ్మతులు చేయాలని విన్నపాలు

నాగులుప్పలపాడు, జూలై 15 : ఒంగోలు నగరానికి కూతవేటు దూరంలో ఉంది చేకూరపాడు. ఈ గ్రామంలోకి వెళ్లే రహదారి మాగాణిని తలపిస్తోంది. దీంతో ఆ రోడ్డులో ప్రయాణించాలంటే గ్రామస్థులకు నరకంగా మారింది. ఐదేళ్ళు పాలన సాగించిన వైసీపీ నాయకులకు ఆ ఊరి ప్రజల ఇబ్బందులు పట్టలేదు సరికదా, గోతుల మయంగా మారిన రోడ్డుపై తట్ట మట్టి పోయాలన్న ఆలోచన కూడా రాలేదు. వెరసి చేకూరపాడు గ్రామంలోకి వెళ్లాలంటేనే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. జాతీయ రహదారి 216 నుంచి చేకూరపాడుకు వెళ్లే సుమారు కిలోమీటరు ఉన్న రహదారి ఛిద్రమైపోయి గుంతలు పడి, గోతుల మయంగా మారింది. గ్రామంలో 2,200 మంది జనాభా నివసిస్తున్నారు. 1600 మంది ఓటర్లు ఉన్నారు. ఆ గ్రామానికి వెళ్లాలంటే ఒంగోలు - చీరాల జాతీయ రహదారి నుంచి కిలోమీటరు దూరంలో ఉంది. 2009-2014 మధ్యకాలంలో ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ చొరవతో జాతీయరహదారి నుంచి చేకూరపాడు గ్రామం వరకు తారురోడ్డు నిర్మించారు. గత కొద్ది కాలం నుంచి ఆ తారురోడ్డు కుంగిపోయి, పగిలిపోయి, పెద్ద పెద్ద గుంతలు పడి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గోతులలో నీరు నిలిచి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో ప్రయాణించాలంటే నరకం కనిపిస్తుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తమ గ్రామానికి రోడ్డు నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.


పెద్దపెద్ద గోతులతో నీటితో నిండి ఉన్న రహదారి



ముందస్తు జాగ్రతలు పాటిస్తే వ్యాధులకు దూరం

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 15 : ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే వ్యాధులకు దూరం కావచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సురేష్‌కుమార్, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మాధవీలతలు ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. జిల్లాలో విస్తారంగా వర్షాలు పడుతున్నందున తాగునీరు కలుషితమై ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడే అవకాశం ఉందన్నారు. అతిసార, టైఫాయిడ్, పచ్చకామెర్లు, మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. అదువల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి ప్రభుత్వం సూచించిన నివారణ పద్ధతులను తప్పకుండా పాటించాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని, క్లోరినేషన్ చేసిన నీటిని ప్రజలు తాగాలని కోరారు. వండిన ఆహారపదార్థాలపై మూతలు ఉంచి వేడిగా ఉన్నప్పుడే వాటిని తినాలని కోరారు. ప్రజలు అత్యవసరమైన వారికి వైద్య సహాయం కోసం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో టోల్ ఫ్రీ నెంబరును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు 9515324799 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

మొహర్రం వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

మద్దిపాడు,జూలై 15: ప్రశాంత వాతావరణంలో మొహర్రం పండుగ వేడుకలను జరుపుకోవాలని మద్దిపాడు ఎస్సై వెలగా మహేష్ ప్రజలకు సూచించారు. సోమవారం ఆయన మొహర్రం వేడుకలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని, ఎటువంటి అసాంఘిక సంఘటనలకు తావివ్వవద్దని కోరారు.

అవీ..ఇవీ..

సర్పంచ్‌ను దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలి

నాగులుప్పలపాడు, జూలై 15 : ఉప్పుగుండూరు గ్రామ పంచాయతీ గిరిజన మహిళా సర్పంచ్ దేవరకొండ జయమ్మను వేధిస్తూ కులం పేరుతో దూషించిన కార్యదర్శి హరిబాబుతో పాటు ఆయనకు సహకరిస్తున్న వారిని చట్ట పరంగా శిక్షించాలని ఎరుకుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మోహన్ కుమార్ ధర్మ డిమాండ్‌చేశారు. సోమవారం ఉప్పుగుండూరు పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ ప్రజలు ఎన్నుకున్న ప్రథమ పౌరురాలైన గిరిజన మహిళా సర్పంచ్ జయమ్మను పలువురు వార్డుమెంబర్ల సహకారంతో కార్యదర్శి హరిబాబు దూషించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు న మోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎరుకుల హక్కుల పోరాట సమితి లీగల్ అడ్వయిజర్ ప్రతాప్, సర్పంచ్ దేవరకొండ జయమ్మ, రిటైర్డు రైల్వే అధికారి పాలపర్తి యానాదిరావు, నాగయ్య, పాలపర్తి వెంకటేశ్వర్లు, రాంబాబు, కుంబా శ్రీను తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మోహన్‌కుమార్ ధర్మ

కలెక్టర్‌ను కలిసిన ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 15 : కలెక్టర్ తమీమ్ అన్సారియాను సంతనూతలపాడు శాసనసభ్యుడు బీఎన్ విజయకుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో సోమవారం కలెక్టర్ అన్సారియాను కలిసి బోకే ఇచ్చి అభినందించారు. ఈ సందర్భంగా సంతనూతలపాడు నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. గుండ్లకమ్మ ప్రాజెక్టుతో పాటు కారుమంచి కాలువలు, ఇతర పలు సమస్యలను కలెక్టర్‌తో చర్చించారు. ఆయా సమస్యలపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

మూల్యాంకనం చేసిన మ్యాథ్స్ టీచర్లకు ఆన్‌డ్యూటీ

ఒంగోలు(విద్య), జూలై 15 : పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో గణితం సబ్జెక్టు జవాబు పత్రాలు ఆన్‌లైన్‌లో మూల్యాంకనం చేసిన గణితం స్కూలు అసిస్టెంట్లకు మూల్యాంకనం చేసిన రోజులను ఆన్ డ్యూటీగా పరిగణిస్తూ ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ డి. దేవానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. సప్లిమెంటరీ పరీక్షల్లో గణితం సబ్జెక్టు జవాబు పత్రాలను ప్రయోగాత్మకంగా ఆన్‌లైన్‌లో మూల్యాంకనం చేయించిన విషయం విదితమే. ఆనలైన్‌లో జవాబు పత్రాలు మూల్యాంకనం చేసినన్ని రోజులకు ఆన్ డ్యూటీగా పరిగణిస్తున్నారు. వీరికి రెమ్యూనరేషన చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఆదేశించారు.

నేడు సీఈపీ పాఠశాలల హెచ్‌ఎంలకు శిక్షణ

ఒంగోలు(విద్య); జూలై 15 : జిల్లాలో కెరీర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్(సీఈపీ) అమలు చేస్తున్న 20 పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మంగళవారం మధ్యాహ్నం రెండు గంటలకు స్థానిక సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలో శిక్షణ నిర్వహిస్తున్నటుల జిల్లా విద్యాశాఖాధికారి డి. సుభద్ర ఒక ప్రకటనలో తెలిపారు. 20 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తప్పని సరిగా శిక్షణ కార్యక్రమానికి హాజరు కావాలన్నారు. ఎవరికీ మినహాయింపు లేదని అందరూ శిక్షణకు హాజరు కావాలని ఆయన స్పష్టంచేశారు.

రేపు ప్రజాస్వామ్య పరిరక్షణపై సదస్సు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 15 : ఆసరా ఆధ్వర్యంలో మోదీ 3.0 ప్రభుత్వం-లౌకిక ప్రజాస్వామ్యం - పరిరక్షణ అనే అంశంపై ఈనెల 17వతేదీన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆసరా సహాయకార్యదర్శి ఎంసీ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈసదస్సుకు ప్రధాన వక్తగా ప్రముఖ సామాజిక, రాజకీయ విశ్లేషకులు టి. లక్ష్మీనారాయణ, ఆసరా అధ్యక్షుడు చిడిపోతు వెంకటేశ్వర్లు, ప్రజానాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు పాల్గొంటారన్నారు.

మంత్రి మనోహర్‌కు అభినందనలు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 15 : రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను జనసేన పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం జనసేన అధినేత, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. రాష్ట్రం లో జనసేన పార్టీ తరఫున గెలిచిన 21 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలను కల్యాణ్ చేతుల మీదుగా సత్కరించారు. ఈసందర్భంగా ఆ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లాకు చెందిన జనసేన పార్టీ ప్రచార కమిటీ కో ఆర్డినేటర్ జడా బాలనాగేంద్రయాదవ్, రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణ, నగర పార్టీ అధ్యక్షుడు మలగా రమేష్‌లు మనోహర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈసందర్భంగా నామినేటెడ్ పదవుల్లో జిల్లాకు ప్రాధాన్యత ఇవ్వాలని మనోహర్‌ను కోరారు.


మంత్రి మనోహర్‌ను కలిసిన జిల్లా జనసేన నాయకులు

13 మంది హిజ్రాలకు గుర్తింపు కార్డులు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 15 : ఒంగోలుకు చెందిన 13 మంది హిజ్రాలకు కలెక్టర్ తమీమ్ అన్సారియా గుర్తింపు కార్డులను అందజేశారు. స్థానిక కలెక్టరేట్‌లోని మీ కోసం కార్యక్రమంలో సోమవారం ఈ గుర్తింపు కార్డులను అందించారు. వీరందరూ ఆన్‌లైన్‌లో గుర్తింపు కార్డులకోసం దరఖాస్తులను చేసుకున్నారు. ఆ దరఖాస్తులను పరిశీలించిన అనంతనం కలెక్టర్ అన్సారియా గుర్తింపు కార్డులను అందజేశారు. అదే విధంగా మర్రిపూడి మం డలం రేగళ్ళగడ్డకు చెందిన వయోవృద్ధుడు లక్ష్మీనరసింహకు శ్రవణ యంత్రాన్ని కలెక్టర్ అందజేశారు. జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ, జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జి. అర్చనతో పాటు పలు శాఖల అధికారులు ఉన్నారు.



గుర్తింపుకార్డులు అందుకున్న హిజ్రాలతో కలెక్టర్

నేడు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 15 : ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి మంగళవారం నుంచి మూడు రోజుల పాటు ఒంగోలులో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. మంగళవారం సాయంత్రం ఆరు గంటలకు స్థానిక మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. అనంతరం నగరంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు.

బడిఈడు పిల్లలను బడికి పంపించాలి

నాగులుప్పలపాడు, జూలై 15 : బడిఈడు పిల్లలందరినీ బడికి పంపించాలని జడ్పీ మాజీ చైర్మన్ ఈదర హరిబాబు సూచించారు. అమ్మనబ్రోలు గ్రామంలోని జడ్పీ హైస్కూల్ వద్దనున్న ఎస్టీకాలనీలో పాఠశాల ఉపాధ్యాయులతో కలసి హరిబాబు క్షేత్రస్థాయిలో స్వయంగా బడిఈడు పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులు, కాలనీ వాసులతో సోమవారం సమావేశం అయ్యారు. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుడా పాఠశాలకు పం పించాలన్నారు. చదువుతోనే తగిన గుర్తింపు లభిస్తుందని వారికి సూచించారు. 20 మంది బడి బయట విద్యార్థులను గుర్తించి వారిని పాఠశాలలో చేర్పించి యూని ఫాం అందిచారు. అనంతరం ఉపాధ్యాయులతో కలసి నేను బడికి పోతా అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.సత్యవతి, ఉపాధ్యాయులు జి.శ్రీనివాసరావు, పి.బ్రహ్మయ్య, వి.మోహనరావు, కృష్ణ పాల్గొన్నారు.


కాలనీవాసులతో మాట్లాడుతున్న హరిబాబు

ఎంఈవో శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ


ఎంఈవో బాధ్యతలు స్వీకరిస్తున్న కత్తి శ్రీనివాసరావు

సింగరాయకొండ, జూలై 15 : మండలంలోని మూలగుంట పాడు ప్రభుత్వ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న కత్తి శ్రీనివాసరావును ఎంఈవో-1 (ఇన్‌చార్జిగా) నియమిస్తూ ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన్ను ఎంఈవో-2 ఆవుల శ్రీనివాసులు, సిబ్బంది, పలువురు ఉపాధ్యాయులు కలిసి శుభాకాంక్షలు చెప్పారు.

'మీకోసం'కు రెండు అర్జీలు

కొండపి, జూలై 15 : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం నిర్వహించిన మీకోసంకు రెండు అర్జీలు వచ్చాయి. అందులో మ్యూటేషన్ కోరుతూ ఒకటి, భూమి సర్వే కోసం మరొకటి ఉన్నాయని తమసీల్దార్ బి.కిరణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగమణి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

డయేరియా, డెంగ్యూపై అవగాహన ర్యాలీ


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

పొన్నలూరు (కొండపి), జూలై 15 : డయేరియా, డెంగ్యూపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ పీహెచ్‌సీ సిబ్బంది సోమవారం పొన్నలూరులో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైద్యశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో పీహెచ్‌సీ వైద్యుడు చైతన్యకృష్ణ మాట్లాడారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులు, నివారణకు తీసుకోవాల్సిన చర్యలను డాక్టర్ రవికిరణ్ వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సుబ్బారావు, సూపర్‌వైజర్లు సురేష్‌బాబు, శ్రీనివాసరావు, జ్యోతి, సుజాత ఏఎన్‌ఎంలు, ఎమ్మెల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అధికారుల ఆదేశాలు బేఖాతర్

వివాదాస్పద స్థలంలో బోర్డు తొలగింపు

తాళ్లూరు, జూలై 15 : తాళ్లూరులోని సంచారజాతులకు చెందిన పేద పాములకాలనీవాసులకు, మాజీ తలారీ కుటుంబానికి భూవివాదం నెలకొంది. తాళ్లూరులోని 20కుటుంబాలకు చెందిన పాముల కాలనీవాసులు గ్రామ శివారున కొర్రపాటివారిపాలెం వెళ్లేమార్గంలోగల ప్రభుత్వస్థలంలో నాలుగు దశాబ్దాల నుండి నివాసముంటున్నారు. ఆకాలనీ సమీపాన గల సర్వే నెంబర్ 474లోని 6 ఎకరాల 17సెంట్ల ఏడబ్ల్యూ లాండ్‌లోని స్థలాన్ని కాలనీకి చెందిన మాజీ తలారి కుటుంబీకుడు నల్లూరి ఏసోబు కుటుంబీకులు ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతుండటంతో పాములకాలనీ వాసులు అభ్యంతరం తెలిపారు. దీనిపై మే 29న పాముల కాలనీవాసులున డిప్యూటీ తహసీల్దార్ ఇమ్మానియేల్ రాజును కలిసి స్థలం ఆక్రమణకు గురికాకుండా చూడాలని వినతి పత్రం అందజేశారు. డీటీ స్పందించి వీఆర్వో, సర్వేయర్‌లను పంపి ఆ స్థలాన్ని పరిశీలించారు. ఆక్రమణదారుడు తనకు పట్టా ఇచ్చారని రెవెన్యూ అధికారులకు చూపించారు. ఆపట్టా ఆక్రమణ స్థలానిది కాదని చెప్పినా వినలేదు. ఆస్థలంలో నిర్మాణాలు చేపడుతుండగా అడ్డుకోబోయిన పాముల కాలనీవాసులకు, ఏసోబు కుటుంబీకులకు వివిదాలు జరిగి పంచాయితీ పోలీస్ స్టేషన్ దాకా వెళ్లింది. సమస్య జటిలంగా మారటంతో ఆ భూమిని ప్రభుత్వ రికార్డుల్లో ఏడబ్ల్యూ ల్యాండ్‌గా ఉన్నందున ఆ స్థలం ప్రభుత్వానికి చెందిన స్థలంగా నిర్ధారించారు. ఆ స్థలంలోకి ఎవరికి ప్రవేశం లేకుండా చూడాలని రెవెన్యూ అధికారులు ఈనెల 12న స్థానిక ఎస్ఐకి ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో ఎస్ఐ ఆదేశంతో ఏఎస్ఐ మోహన్‌రావు, వీఆర్వో నాగలక్ష్మిలు వివాదంలో ఉన్న సర్వే నంబర్ 474, 475లో ప్రభుత్వభూమిలోకి ఎవరూ ప్రవేసించరాదని సోమవారం ఉదయం బోర్డులు ఏర్పాటుచేశారు. వీటిని ఆక్రమణదారుడు తొలగించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని పలువురు కోరుతున్నారు.

'దామచర్ల' జీవితం ఆదర్శం

ఆయన ఆశయాలను కొనసాగిస్తాం

జయంతి కార్యక్రమంలో మంత్రి స్వామి, సత్య

ఆంజనేయులుకు ఘన నివాళి


తూర్పునాయుడుపాలెంలో దామచర్ల ఆంజనేయులు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి స్వామి, సత్య, టీడీపీ నాయకులు

తూర్పునాయుడుపాలెం (టంగుటూరు) జూలై 15 : అవినీతి ఎరుగని నేత మాజీ మంత్రి స్వర్గీయ దామచర్ల ఆంజనేయులు అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి కొనియాడారు. ఆయన జీవితం అందరికీ ఆదర్శమన్నారు. దామచర్ల స్వగ్రామమైన మండలంలోని తూర్పునాయుడుపాలెంలో సోమవారం ఆయన జయంతిని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ స్వామి మాట్లాడుతూ.. దామచర్ల కొండపి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశారన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి సొంత నిధులను సైతం ఆయన వెచ్చించారన్నారు. కొండపిలో గురుకుల పాఠశాల, పొగాకు బోర్డు, అందమైన రోడ్లు ఆయన కృషి ఫలితమేనన్నారు. కొండపి నుంచి తాను వరుసగా మూడుసార్లు విజయం సాధించడానికి దామచర్ల సేసిన ప్రజాసేవే కారణమన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య మాట్లాడుతూ దామచర్ల మనవడిగా ఆయన ఆశయాలు, సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటానన్నారు. తాత చూపిన మార్గంలో పయనించడం తన జీవితాశయమన్నారు. ముందుగా తూర్పునాయుడుపాలెం ముఖద్వారంలోని దామచర్ల ఆంజనేయులు, ఎన్టీఆర్ విగ్రహాలకు మంత్రి, సత్య టీడీపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు కామని విజయకుమార్, చదలవాడ చంద్రశేఖర్, బెల్లం జయంత్‌బాబు, బెజవాడ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

టంగుటూరులో..

టంగుటూరు : దామచర్ల ఆంజనేయులు జయంతిని టీడీపీ నాయకులు టంగుటూరులో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కామని విజయ్‌కుమార్, మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు, సీనియర్ నేత బెజవాడ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కొండపిలో..

మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులు జయంతి సందర్భంగా స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సత్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. ఈసందర్భంగా సత్య మాట్లాడుతూ కొండపి నియోజకవర్గ అభివృద్ధికి తన తాత ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో పార్టీ ఒంగోలు పార్లమెంటు ఉపాధ్యక్షుడు గొర్రెపాటి రామయ్య చౌదరి, మండల అధ్యక్షుడు బొడ్డపాటి యల్లమంద నాయుడు, నాయకులు బత్తుల నారాయణ స్వామి, చాగంరెడ్డి నరసారెడ్డి, తిప్పారెడ్డి కృష్ణారెడ్డి, మారెడ్డి సుబ్బారెడ్డి, పోటు శ్రీనివాసరావు, కొమ్మాలపాటి రాఘవరావు, నన్నూరి సుబ్బరామయ్య, బూదవాటి సోమయ్య, షేక్ ఖాజాషా, నేతి రవికుమార్, దేపూరి మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

పొన్నలూరులో...

పొన్నలూరులోని బస్టాండ్ సెంటర్‌లో ఉన్న దామచర్ల, ఎన్టీఆర్ విగ్రహాలకు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, నాయకులు మండవ ప్రసాద్, కర్నా కోటిరెడ్డి, మండవ మురళి, అనుమోలు సుధాకర్, తానికొండ మహేంద్ర, బోయపాటి రమణారెడ్డి, భూమిరెడ్డి వేణు తదితరులు పాల్గొన్నారు.

కామేపల్లిలో...

కామేపల్లిలోని బస్టాండ్ సెంటర్‌లో ఉన్న దామచర్ల ఆంజనేయులు విగ్రహానికి టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దామచర్ల సత్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పోటు శ్రీనివాసమురళి, ఏలూరి రాంబాబు, దగ్గుమాటి సుబ్బారెడ్డి, కామాక్షయ్య, కొమ్మాలపాటి కృష్ణ, పేముల విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, చీరల పంపిణీ

కొండపిలోని సీహెచ్‌సీలోని రోగులకు తెలుగు మహిళ నాయకులు పండ్లు పంపిణీ చేశారు. అక్కడ ఉన్న మహిళలకు, వైద్యశాల సిబ్బందికి చీరలు అందజేశారు. కార్యక్రమంలో తెలుగు మహిళ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి రాయపాటి సీతమ్మ, మండల అధ్యక్షురాలు బొద్దులూరి ప్రసన్నలక్ష్మి, మాజీ ఎంపీపీ దేపూరి రత్తమ్మ, పద్మ, అలేఖ్య, అరుణ పాల్గొన్నారు.

మర్రిపూడిలో..

మర్రిపూడి : మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులు జయంతిని మండలంలోని పలు గ్రామాల్లో టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో దామచర్ల, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రమోతు శ్రీనివాసులు, టీడీపీ మండల అధ్యక్షుడు చేరెడ్డి నరసారెడ్డి, నాయకులు రేగుల వీరనారాయణ, తుళ్లూరి నరసింహారావు, గొంటు హనుమారెడ్డి, ఎర్రంరెడ్డి వెంకటరెడ్డి, చేరెడ్డి నరసారెడ్డి, కొణిదెన మోహనరావు, చెన్నుబోయిన బాల నరసయ్య, ఉప్పు రమణయ్య, మండే ఏడుకొండలు, మద్దూరి దాసు, గురిజాల రాజేష్, పోలయ్య, కాటయ్య, గురుబ్రహ్మం, ఉప్పు సాయి, పాలడుగు రమేష్ పాల్గొన్నారు.

సింగరాయకొండలో..

సింగరాయకొండ : మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులు జయంతి సందర్భంగా స్థానిక కందుకూరు రోడ్డు సెంటర్‌లో ఉన్న ఆయన విగ్రహానికి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, నేతలు షేక్ సంధానీబాషా, కూనపరెడ్డి సుబ్బారావు, సన్నెబోయిన శ్రీనివాసులు, పాకల సర్పంచ్ సైకం చంద్రశేఖర్, చంటి, మండలపు గాంధీచౌదరి, రామారావు, మించల బ్రహ్మయ్య గుదే వెంకటేశ్వర్లు, చిగురుపాటి గిరి, భైరపనేని మోహన్‌రావు, గాలి హరిబాబు, వేల్పుల వెంకట్రావు, నక్కా బ్రహ్మేశ్వరరావు, కొత్తూరి రంగనాయకులు, యస్థాని, సనావుల్లా, జనసేన మండల అధ్యక్షుడు రాజేష్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పృథులగిరి పాలకవర్గ నియామకం జరిగేనా?

టీడీపీ పాలనలో ఏర్పాటుకు నోచుకోని వైనం

ప్రస్తుతం మళ్లీ అధికారంలోకి రావడంతో పలువురు ఆసక్తి


లక్ష్మీనరసింహస్వామి దేవాలయం

మర్రిపూడి, జూలై 15 : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పృథులగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవాలయ పాలకవర్గం ఈసారైనా నియామకం జరుగుతుందా అన్న సందేహం మండల ప్రజల్లో వ్యక్తమవుతోంది. గత టీడీపీ పాలనలో పాలకవర్గ నియామకం చేపట్టకపోవడం అందుకు కారణమైంది. దామచర్ల ఆంజనేయులు 1994లో తొలిసారిగా శాసనసభకు ఎన్నికైన తరువాత మర్రిపూడి గ్రామానికి చెందిన చలువాది వెంకటేశ్వర్లు చైర్మన్‌గా నియమితులయ్యారు. ఆయన రెండేళ్ల పదవీ కాలం అనంతరం పాలకవర్గం ఏర్పాటుకు నోచుకోలేదు. అప్పటి నుంచి టీడీపీ పాలనలో పాలకవర్గాన్ని నియమించలేదు. కాంగ్రెస్ హయాంలో మర్రిపూడికి చెందిన చేరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, రేగలగడ్డకు చెందిన అంబటి జయరామిరెడ్డి, పొదిలికి చెందిన అలవల చెంచయ్యలు చైర్మన్‌లుగా పనిచేశారు. 2014లో టీడీపీ అధికారం చేపట్టిన తరువాత అప్పటి శాసనసభ్యుడు డాక్టర్ స్వామి పాలకవర్గం నియామకం కోసం ప్రయత్నించినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. దీంతో దేవదాయ శాఖ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. లక్షలాది రూపాయలు దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మర్రిపూడికి చెందిన కుప్పం ప్రసాద్ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్‌గా ఉంటూ తన తండ్రి కొల్లారావును రెండుసార్లు చైర్మన్‌గా ఎంపిక చేయించుకున్నారు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం రావడంతో పార్టీ నేతలు పలువురు చైర్మన్ పీఠం దక్కించుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. మండల కేంద్రానికి చెందిన కీలక నేతలు కొందరు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ త్వరగా చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించినందున ఎవరికి వారు మంత్రి స్వామి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య ఆశీస్సుల కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఈసారైనా పార్టీలో సుదీర్ఘకాలం పనిచేసిన నాయకులను గుర్తించి పాలకవర్గం పగ్గాలు అప్పగించాలని ఆ పార్టీ కార్యకర్తలు ఆశిస్తున్నారు.

కౌలు కార్డులపై ఆందోళన వద్దు


మాట్లాడుతున్న ఏవో విజయ్‌కుమార్

కొండపి, జూలై 15 : కౌలు రైతులకు పంటల సాగు హక్కు పత్రాలు ప్రభుత్వం ఇచ్చినంత మాత్రాన భూయజమానులకు ఎలాంటి నష్టం ఉండదని మండల వ్యవసాయాధికారి డి.విజయ్‌కుమార్ అన్నారు. వారు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కౌలు రైతుల గుర్తింపులో భాగంగా సోమవారం మండలంలోని కె.ఉప్పలపాడు, వెన్నూరు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో నిర్వహించిన సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా భూయజమానుల సందేహాలను నివృత్తి చేశారు. ఏడాది కాలానికి కౌలుదారులకు పంటల మీద హక్కు మాత్రమే ఉంటుందన్నారు. సమావేశంలో వీఆర్వోలు కోటిరెడ్డి, డి.మల్లీశ్వరి, వీఏఏలు జయలక్ష్మి, కొండలరావు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పాకలలో..

సింగరాయకొండ : మండలంలోని పాకలలో సోమవారం సీసీఆర్‌సీ కార్డులపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ భవానీ శంకర్, వ్యవసాయశాఖ ఏడీ నిర్మలకుమారి పాల్గొన్నారు పంటసాగు పత్రం పొందిన కౌలు రైతులకు మాత్రమే సబ్సిడీ విత్తనాలు, బ్యాంకు రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ అందుతాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సైకం చంద్రశేఖర్, ఏవో సుధాకర్, రైతులు పాల్గొన్నారు.

బింగినపల్లి పంచాయతీ కార్యదర్శి మృతి

సింగరాయకొండ, జూలై 15 : మండలంలోని బింగినపల్లి పంచాయతీ కార్యదర్శి టంగుటూరుకు చెందిన శ్రీనివాసులు (50) మృతి చెందారు. కొద్దిరోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. కు టుంబ సభ్యులు సోమవారం ఒంగోలులోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన మృతికి ఎంపీడీవో నగేష్‌కుమారి, పలుగ్రామాల పంచాయతీ కార్యదర్శులు సంతాపం తెలిపారు.

నారాయణస్వామి హుండీ ఆదాయం రూ.లక్షా 70వేలు

సీఎస్‌పురం(పామూరు), జూలై 15 : సీఎస్‌పురం మండలం మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి ఆదివారం హుండీ ఆదాయం రూ.లక్షా 68 వేల700 వచ్చినట్లు ఈవో గిరిరాజు నరసింహబాబు తెలిపారు. టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.66,170, లడ్డు ప్రసాదం ద్వారా రూ.30,290, అన్నదానం విరాళం ద్వారా రూ.72,240 వచ్చినట్లు తెలిపారు. హుండీ లెక్కింపు కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు.

తాత్కాలిక భవనాల్లోనే ప్రభుత్వ డిగ్రీ కళాశాల

స్థలం మంజూరైనా

వైసీపీ పాలకుల నిర్లక్ష్యం

కార్యరూపం దాల్చని శాశ్వత నిర్మాణాలు

పూర్తిస్థాయిలో కోర్సులు అందుబాటులో

లేక విద్యార్థుల ఇబ్బందులు


తాత్కాలిక భవనాల్లో నడుస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల

దర్శి, జూలై 15 : ఏళ్ల తరబడి దర్శి ప్రభుత్వ డిగ్రీ కళాశాల తాత్కాలిక భవనంలో నడుస్తోంది. పూర్తిస్థాయిలో మౌలిక వసతులు లేకపోవటంతో ఇప్పటికీ విద్యార్థులు అరకొరగానే చేరుతున్నారు. శాశ్వత భవనాల ఏర్పాటుకు రెండేళ్ల క్రితమే స్థలం మంజూరైనప్పటికీ వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతో కార్యరూపం దాల్చలేదు. దర్శి పట్టణంలో 2021లో మంజూరైన ప్రభుత్వ డిగ్రీ కళాశాలను స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని భవనాల్లో ప్రారంభించారు. అందులో నాలుగు కోర్సులను ప్రవేశపెట్టారు. బీఎస్సీ(జియాలజీ), బీఎస్సీ(కంప్యూటర్స్ సైన్స్), బీకాం(కంప్యూటర్స్ అప్లికేషన్), బీఏ(హిస్టరీ) కోర్సులు నడుస్తున్నాయి. బీఎస్సీ(కెమిస్ట్రీ) కోర్సు ఏర్పాటుచేయాల్సి ఉండగా ఇప్పటివరకు ప్రారంభించలేదు. ఇంకా అదనంగా బ్యాచిలర్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ కోర్సు కూడా ఏర్పాటు చేయవచ్చు. శాశ్వత భవనాలు లేక, చాలినన్ని తరగతి గదులు అందుబాటులో లేక ఉన్న భవనాల్లో నడుపుతున్నారు. ప్రస్తుతం ఇక్కడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల ఎంతోకాలంగా నడుస్తోంది.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరుకావటంతో ఎక్కడా భవనాలు అందుబాటులో లేక తాత్కాలికంగా ఇక్కడ ప్రారంభించారు. రెండేళ్లలో శాశ్వత భవనాలు నిర్మిస్తామని ఆ సందర్భంగా వైసీపీ పాలకులు చెప్పిన మాటలు నీటి మూటలయ్యాయి. దర్శి - కురిచేడు రోడ్డులో రెండేళ్ల క్రితమే కళాశాల భవనాల కోసం ఆరెకరాల భూమిని అధికారులు కేటాయించారు. భవనాల నిర్మాణానికి నిధులు విడుదల కాకపోవటంతో ఇప్పటివరకు అడుగు ముందుకు పడలేదు. ప్రస్తుతం కళాశాలలో నాలుగు కోర్సుల్లో కేవలం 300 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. మొత్తం 540 మంది వరకు అవకాశం ఉన్నప్పటికీ వసరులు లేకపోవటంతో పూర్తిస్థాయిలో విద్యార్థులు చేరటంలేదు. కీలకమైన బీఎస్సీ(కెమిస్ట్రీ) కోర్సు అందుబాటులో లేకపోవటంతో అనేకమంది ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో శాశ్వత భవనాల నిర్మాణానికి శ్రీకారం చుడతారని దర్శి ప్రాంత ప్రజలు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు. విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ బాధ్యతలు నిర్వహిస్తున్నందున త్వరలో ఖచ్చితంగా నిధులు విడుదల అవుతాయనే విశ్వాసంతో ప్రజలు ఎదురుచూస్తున్నారు.

భూకబ్జాలపై విచారణ చేసుకోవచ్చు

నా నిర్ణయం మార్చుకున్నా.. రాజకీయాలు విరమించుకోను..

రెండు నెలల తర్వాత ఒంగోలులో ఉంటా

నేను,నా కుమారుడు పారిపోయినట్లు ఫ్లెక్సీలు వేయించడం దుర్మార్గం

మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 15 : ఒంగోలులో భూకబ్జాలపై దమ్ముంటే విచారణ చేసుకోవచ్చని, నియోజకవర్గంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలు, అరాచకాలపై ప్రజాపోరాటం చేస్తానని మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ధ్వజమెత్తారు. ఇటీవలి సాధారణ ఎన్నికల ఫలితాల అనంతరం తాను ఇక రాజకీయాల నుంచి విరమించుకోవాలని అనుకున్నానని, ఒంగోలులో జరుగుతున్నవి చూశాక మళ్లీ కొనసాగాలని నిర్ణయించుకున్నట్లు ఆయన స్పష్టంచేశారు. స్థానిక లాయర్‌పేటలోని ఆయన నివాసంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు ఊహించలేదన్నారు. కౌంటింగ్ రోజున రిజల్ట్ చూశాక తాను హైదరాబాద్ వెళ్లిపోయానని తెలిపారు. గత 25ఏళ్లు తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కూడా ఎవరిని ఇబ్బంది పెట్టలేదన్నారు. తాను, తన కుమారుడు పారిపోయినట్లు ఫ్లెక్సీలు వేయడం దుర్మార్గమన్నారు. ఆ ఫలితాలు అనంతరం వైసీపీ కార్యకర్తలను కొట్టడంతోపాటు అక్రమ కేసులు పెట్టారన్నారు. తాను ఎక్కడికి వెళ్లేది లేదని, మరో రెండు నెలలు వ్యక్తిగత పనులు ఉన్నాయని, అవి పూర్తిచేసుకొని ఒంగోలులోనే ఉంటానన్నారు. తాను జనసేన పార్టీలోకి వెళ్తున్నట్లు ప్రచారం చేయిస్తున్నారని మండిపడ్డారు. గతంలో తనను హవాలా మంత్రి అని అన్నారని, ఆ ఘటనకు సంబంధించిన వ్యక్తి(నల్లమల్లి బాలు) ఇప్పుడు మీ పార్టీలో ఉన్నారని, ఆ వ్యవహారం తేల్చాలని డిమాండ్ చేశారు. బ్రాహ్మణుల స్థలం విషయంలో తనపై టీడీపీ అసత్య ఆరోపణలు చేసిందని, ఆ వివాదంలో ఉన్న వెంకటరెడ్డి, తన అండ చూసుకొని పెద్దిరెడ్డి భూకబ్జాలకు పాల్పడ్డాడని ఆరోపణలు చేశారని, ఇప్పుడు వారిద్దరు టీడీపీలోనే ఉన్నారన్నారు. అలా తన కుమారుడిపై కూడా ఆరోపణలు చేశారన్నారు. తన వియ్యంకుడు భాస్కర్‌రెడ్డి విల్లాలు కడుతుంటే కొంతమంది అక్కడికి వెళ్లి దౌర్జన్యం చేశారని మండిపడ్డారు. అన్ని అనుమతులు తీసుకున్న తర్వాతనే అక్కడ నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. ఆ విల్లా నిర్మాణంలో ఏదైనా తప్పు జరిగి ఉంటే చర్యలు తీసుకోవచ్చని, కానీ అందుకు భిన్నంగా కొంతమందిని అక్కడకు పంపి దౌర్జన్యం చేయడం ఏమిటని ప్రశ్నించారు. నెలరోజుల వ్యవధిలోనే ఒంగోలులో బిల్డర్లు, రియల్టర్లకు సుమారు 150మందికి నోటీసులు ఇచ్చి బెదిరింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఒంగోలులో శిలాఫలకాలు ధ్వంసం చేయడం దుర్మార్గంగా ఉందన్నారు.

జిల్లాలో నాయకులకు కొదవలేదు

జిల్లాలో నాయకులకు కొదవవ లేదని బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. నేతలకు జిల్లా గొడ్డుపోలేదని, అధ్యక్ష పదవి జిల్లాకు సంబంధించిన వ్యక్తులకే ఇవ్వాలన్నారు. చెవిరెడ్డికి జిల్లా అధ్యక్ష పదవి విషయాన్ని తాను వ్యతిరేకించినట్లు స్పష్టం చేశారు. కాగా హైదరాబాద్ నుంచి వందేభారత్ రైలులో ఒంగోలు చేరుకున్న మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డికి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఒంగోలులో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, మేయర్ గంగాడ సుజాత, పీడీసీసీబీ మాజీ చైర్మన్ మాదాశి వెంకయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సత్య

కొండపి, జూలై 15 : ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఇంటర్ విద్యార్థులకు సోమవారం ఆయన ఉచిత పుస్తకాలను అందజేశారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మామిళ్లపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పుస్తకాలను అందిస్తున్నదన్నారు. చదువుకున్నాక, వారికి అవసరమైన శిక్షణలు ఇచ్చి ఉద్యోగాలు కల్పించే బాధ్యత కూడా మంత్రి నారా లోకేష్ తీసుకున్నారని చెప్పారు. అనంతరం ఆయన ఐఎఫ్ ప్యానల్స్‌ను, కళాశాలలోని స్కిల్ హబ్ కేంద్రంలో కుట్టుశిక్షణను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కొండపి ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి, పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డపాటి యల్లమంద నాయుడు, సీనియర్ నాయకుడు బత్తుల నారాయణస్వామి పాల్గొన్నారు.

కలసికట్టుగా పనిచేయండి

● నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా ● మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి హామీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

బేస్తవారపేట, జూలై15: అధికారులు, ప్రజాప్రతినిధులు కలసికట్టుగా పనిచేయాలని, అప్పుడే గిద్దలూరు నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకోవచ్చని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి భరోసా ఇచ్చారు. సోమవారం మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.., బేస్తవారపేట మండలంలో గత టీడీపీ పాలనలో తాను గ్రామాల్లో తాగునీరు, రోడ్ల అభివృద్ధి, భూగర్భజలాల పెంపునకు కృషి చేసినట్లు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ మండలాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు. అందుకు అందరి సహకారంతో ముందుకు పోనున్నట్లు తెలిపారు. మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా ముందు జాగ్రతలు తీసుకోవాలని, పైపుల మరమ్మతులను వెంటనే చేయాలని స్థానిక అధికారులకు సూచించారు. అక్కపల్లె గ్రామంలో తాగునీటి బోర్ల కోసం మంజూరైన నిధులను కాంట్రాక్టర్ ఉపయోగించకుండా పనులు ఎందుకు చేయలేదని అధికారులను ప్రశ్నించారు. ఖాజీపురం గ్రామంలో బోర్లు వేసి పైప్‌లైన్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో నీటికోసం ఇబ్బందులు పడుతున్నామని ఆ గ్రామ సర్పంచ్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఓబినేనిపల్లెలో పైప్‌లైన్ ఇష్టాను సారంగా కాంట్రాక్టర్ వేశాడని జడ్పీటీసీ సభ్యులు బండ్లమూడి రాజయ్య ఆరోపించారు. బేస్తవారపేటలో పైప్ లైన్ సక్రమంగా లేక నీటి సరఫరా సక్రమం గా లేదని అందుకు నిధులు మంజూరు చేయాలని బి.ప్రేమానంద్ కోరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులతో త్వరలో సమావేశం ఏర్పాటు చేసి ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సమావేశం ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో టి.పార్వతి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ

బేస్తవారపేట : బేస్తవారపేట పంచాయతీ కార్యాలయాన్ని సోమవారం గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సందర్శించారు. బి.ప్రేమానంద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం ప్రధాన రోడ్డు నుంచి పంచాయతీ కార్యలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. టీడీపీ విజయోత్సవ కార్యక్రమానికి మండలంలోని పలువురు కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేశారు. అనంతరం పంచాయతీ కార్యలయంలో పనిచేసే కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బి.ప్రేమానంద్, సోరెడ్డి మోహన్‌రెడ్డి, పూనూరు భూపాల్‌రెడ్డి, తిగిరెడ్డి భూపాల్‌రెడ్డి, గుంటి సుబ్బయ్య, వార్డుసభ్యుడు శివ, బీసు అరుణ్ కుమార్, మూప్పూరి రాము, సుబ్రహ్మణ్యం, సైదులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి



కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న అశోక్‌రెడ్డి

కంభం : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపేందుకు కంకణం కట్టుకున్నారని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వం వచ్చే 5 సంవత్సరాల పాలనలో పూర్తిగా వెనుకబడిన రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుపోయేందుకు కృషి చేస్తుందన్నారు. పశ్చిమ ప్రకాశంలో పూర్తిగా వెనుకబడిన కంభం మండలాన్ని పార్టీలకు అతీతంగా పూర్తిస్థాయిలో అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఇకపై ప్రతి మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొని అధికారులు, ప్రజా ప్రతినిధులు చెప్పే సమస్యలను ఆలకించి సమస్యల పరిష్కారానికి అవసరమైన నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. వేసవికాలంలో మండలంలోని సూరేపల్లి, లింగోజీపల్లి, తదితర గ్రామాలలో నీటిఎద్దడి సమస్యను ప్రజలు తన దృష్టికి తెచ్చారన్నారు. సంబంధిత అధికారులు ప్రజలకు, పశుసంపదకు నీటిఎద్దడి లేకుండా ట్యాంకర్లతో నీటిని అందించాలని ఆదేశించారు. తురిమెళ్ల సర్పంచ్ సుభద్రమ్మ పలు సమస్యలను ప్రస్తావించగా, పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అంతకుముందు పంచాయతీరాజ్, ఇరిగేషన్, గృహనిర్మాణం, రెవెన్యూశాఖ, వైద్యఆరోగ్యశాఖ, విద్యుత్‌శాఖ, తదితర శాఖల అధికారులు గతంలో చేసిన హామీలను, చేసిన పనులను వివరించారు. పలువురు ప్రజాప్రతినిధులు మూడు సంవత్సరాలుగా మండల సమావేశాల్లో తమ గ్రామాల సమస్యలపై చెప్పినా ఏ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం రాయితీపై జీలుగ, జనుము, తదితర విత్తనాలను గిద్దలూరు ఏడీఏ బాలాజీనాయక్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి రైతులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో మస్తాన్‌వలి, తహసీల్దార్ రామయ్య, ఎంపీపీ చేగిరెడ్డి తులసమ్మ, జడ్పీటీసీ సభ్యురాలు కొత్తపల్లి జ్యోతి, సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

సంక్షేమ బోర్డును కొనసాగించాలి

● సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట భవన నిర్మాణరంగ కార్మికుల ధర్నా



నిరసన తెలుపుతున్న భవన నిర్మాణరంగ కార్మికులు

మార్కాపురం వన్‌టౌన్, జూలై 15: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును కొనసాగించాలని స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ రాహుల్ మీనాకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆవులయ్య మాట్లాడుతూ.. గత ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలను నిలిపేస్తూ జీవో జారీ చేసిందన్నారు. మెమో నెంబరు 1214 అమలు చేసిందన్నారు. ఈ మెమోను రద్దు చేస్తే కార్మికులకు సంక్షేమ పథకాలు అమలవుతాయన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డీకేఎం రఫీ మాట్లాడుతూ టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు కొనసాగిస్తామని, ఉచిత ఇసుక అమలు చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. కార్మికులందరూ టీడీపీ ప్రభుత్వాన్ని గెలిపించుకున్నారన్నారు. కార్మికుల ఆకాంక్షకు అనుగుణంగా సంక్షేమ బోర్డును కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు రోశయ్య, ఖాజావలి, ఎర్నియా, నరసింహలు, థామస్, మహబూబ్ బాషా, రామకృష్ణ పాల్గొన్నారు.

మొహర్రం వేడుకలు ప్రారంభం



పీర్లచావిడిలోని పీర్లు

గిద్దలూరు, జూలై 15 : గిద్దలూరులోని పీర్ల చావిడిలు రంగురంగుల విద్యుత్ దీపాలతో వెలుగులు జిమ్ముతున్నాయి. మొహర్రం సందర్భంగా పీర్ల చావిడిలలో పీర్లు నిలబెట్టారు. ముస్లింలు ఇప్పటికే పీర్లను దర్శించుకుంటుండగా సోమవారం పగలు సరిగేసును వైభవంగా నిర్వహించారు. మంగళవారం పెద్దసరిగేసు, బుధవారం మొహర్రం పండుగను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఖాదర్‌వలి దర్గా వద్ద నిమజ్జనం చేస్తామని పీర్లచావిడి ప్రతినిధులు పేర్కొన్నారు.

వైద్యశాల ఆక్రమిత గేట్లను తెరిపించాలి

● మండల నాయకుల వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పెద్దదోర్నాల, జూలై 15: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం ఆక్రమిత గేట్లను తెరిపించాలని టీడీపీ, వైసీపీ మండల నాయకులు సూపరింటెండెంట్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బట్టు రమణారెడ్డి మాట్లాడుతూ దోర్నాల నటరాజు కూడలిలోని సామాజిక ఆరోగ్యకేంద్రం 30 పడకల వైద్యశాల నుండి 50 పడకల వైద్యశాలగా రూపొందడం హర్షణీయ మన్నారు. రోగులు వైద్యశాలకు అధికసంఖ్యల్లో వస్తున్న నేపథ్యంలో రహదారులు ఆక్రమణకు గురికావడం ఆందోళనకరమన్నారు. వైద్యశాలకు ఎమర్జెన్సీ వాహనాలు రావడానికి వీలు లేకుండా రహదారులు ఆక్రమణకు గురయ్యాయన్నారు. ప్రహరీగోడ ఉత్తరంవైపు చాలావరకు నిర్మాణం లేక పోవడంతో ఆక్రమణకు గురవుతోందన్నారు. వెంటనే నిర్మాణం చేపట్టాలని కోరుతూ టీడీపీ నాయకులు కే సుబ్బారెడ్డి, బట్టు రమణారెడ్డి, సుధాకర్ రెడ్డి, గోవిందు, కల్లె ఏడుకొండలు, వైసీపీ నాయకులు జోగి వెంకటనారాయణ తదితరులు సూపరిండెంటు నాగమహేశ్వరీకి వినతిపత్రం అందజేశారు.

విద్యార్థులు బోధనను అర్థం చేసుకోవాలి


● ఏకలవ్య విద్యార్థులకు ఎంఈవో సూచన



సూచనలిస్తున్న ఎంఈవో

పెద్దదోర్నాల, జూలై 15: గురుకుల పాఠశాలలో చదివే విద్యార్థులు ఉపాధ్యాయులు, అధ్యాపకులు చెప్పే బోధనను అర్థం చేసుకోవాలని ఎంఈవో మస్తాన్ నాయక్ విద్యార్థులకు సూచించారు. స్థానిక ఏకలవ్య ఆదర్శ పాఠశాల, కళాశాలలోని విద్యార్థులు సోమవారం తరగతులు బహిష్కరించి ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులందరూ హిందీ, ఆంగ్లంలోనే బోధించే వారు కావడంతో తమకు అర్థం చేసుకోవడానికి ఇబ్బందిగా ఉందని పలువురు విద్యార్థులు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న ఎంఈవో మస్తాన్ నాయక్ పాఠశాలకు వచ్చి విద్యార్థులతో మాట్లాడారు. ముందుగా విద్యార్థులు నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఉపాధ్యాయ, అధ్యాపక సిబ్బంది, ప్రిన్సిపాల్‌తో సహా అందరూ హిందీ మాతృభాషగా ఉన్నవారన్నారు. వారు మాతృ భాష హిందీ ఉచ్చారణతో ఆంగ్లంలో బోధిస్తున్నారన్నారు. ఇక్కడ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు గిరిజనులన్నారు. వీరి మాతృభాష తెలుగు కావడంతో బోధన అర్థం చేసుకోవడం తొలిరోజుల్లో కొంచెం కష్టతరంగా ఉంటుందన్నారు. ఉపాధ్యాయులకు సిబ్బందికి ఏమైనా సమస్యలు చెప్పుకుందామంటే అర్థం కావడం లేదన్నారు. ఈ క్రమంలో చదువు ఎలా సాగుతుందనే భయాందోళనగా ఎంఈవో దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఎంఈవో మస్తాన్‌నాయక్ మాట్లాడుతూ ఈ పాఠశాల కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తోందన్నారు. సీబీఎస్ఈ విధానంలో విద్యాబోధన చేయాల్సి ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం పాఠశాలకు సరిపడ ఉపాధ్యాయ, అధ్యాపక సిబ్బందిని నియమించడంతో తెలుగు తెలిసిన వారు లేరన్నారు. అయితే విద్యార్థులకు మొదట్లో కొంచెం కష్టంగా ఉన్నా, బాష సహజంగానే వస్తుందన్నారు. చదువు పట్ల ఆసక్తితో అభ్యసించాలని తర్వాత ఈ విద్యావిధానం ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో కూడా లభించని విద్య ఇక్కడి విద్యార్థులకు అందుతుందన్నారు. అపోహలకు పోకుండా శ్రద్ధగా చదువుకోవాలన్నారు. దీంతో విద్యార్థులు తిరిగి తరగతులకు హాజరయ్యారు.

మిర్చి రైతులను ఆదుకోవాలి : రైతు సంఘం



మాట్లాడుతున్న రైతుసంఘం నాయకులు

ఎర్రగొండపాలెం, జూలై 15: గత ఏడాది మిర్చి సాగు చేసిన రైతులను ఆదుకోవాలని రైతుసంఘం నియోజవర్గ అధ్యక్ష, కార్యదర్శులు మన్నె సాంబశివరావు, బాణాల రామయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఎర్రగొండపాలెంలోని సీపీఐ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన రాష్ట్రంలో గత ఏడాది రైతులు విస్తారంగా మిర్చిని సాగుచేశారని అన్నారు. అయితే గుంటూరు మార్కెట్ యార్డులో గిట్టుబాటు ధరలు లేక చాలా మంది రైతులు గుంటూరులోనే కాకుండా ఇతర ప్రాంతాల్లో కూడా కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ వుంచారని అన్నారు. రాష్ట్ర సీఎం కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ఎగుమతులను పెంచి , వ్యాపార వర్గాలతో మాట్లాడి రైతులకు గిట్టుబాటు ధర వచ్చేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియరు నాయకులు టిసిహెచ్ చెన్నయ్యసీపీఐ నాయకులు కెవి కృష్ణ గౌడ్, ఆవుల యోగయ్య, లక్ష్యయ్య,బాల వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

మోటార్‌బైకుల దొంగ అరెస్ట్



రికవరీ చేసుకున్న బైకులతో పోలీసులు

పొదిలి, జూలై 15 : పొదిలి, దర్శి ప్రాంతాల్లో మోటార్‌బైకుల దొంగతనాలకు పాల్పడుతున్న దొంగను పోలీసులు అరెస్ట్ చేశారు. ఐదు మోటార్‌బైకులను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ మల్లికార్జున్ వివరాలు వెల్లడించారు. కొంతకాలంగా పట్టణంలో, దర్శి ప్రాంతాల్లో మోటార్‌బైక్ దొంగతనాలు జరుగుతున్నాయనే ఫిర్యాదులు పలువురి ద్వారా అందుతున్నాయన్నారు. ఈ సమాచారంతో ఎస్ఐ కోటయ్య ఆధ్వర్యంలో స్పెషల్ టీంను ఏర్పాటు చేసి గాలించామన్నారు. ఈ క్రమంలో స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలో అనుమానస్పదంగా ఉన్న ఖదర్‌బాష అనే వ్యక్తిని విచారిస్తున్న సమయంలో బైకు వదిలి పారిపోవడానికి ప్రయత్నించాడన్నారు. దీంతో బాషాను అదుపులోకి తీసుకొని విచారించామన్నారు. మద్యానికి బానిసై దర్శి, పొదిలి ప్రాంతాల్లో బైక్‌ల దొంగతనాలకు పాల్పడినట్లు ఖాదర్‌బాష అంగీకరించినట్లు చెప్పారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు తమ వాహనాలను ఇళ్లముందు పార్క్ చేసే సమయంలో తప్పనిసరిగా సైడు లాక్ వేసుకోవాలన్నారు. మొత్తం ఐదు మోటార్‌బైకులు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వాటి విలువ రూ.2.38 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో ఎస్ఐ కోటయ్య తదితర సిబ్బంది ఉన్నారు.

18సెల్ ఫోన్‌లు రికవరి

వివిధ ప్రాంతాల్లో ప్రజలు పోగొట్టుకున్న 18 సెల్ ఫోన్‌లను రికవరి చేసినట్లు సీఐ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు రికవరీకి స్పెషల్‌డ్రైవ్ నిర్వహించామన్నారు. పొరపాటున సెల్‌ఫోన్ పోయినట్లైతే సమయం వృథాకాకుండా వెంటనే స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

రేపటి నుంచి సీఐటీయూ శిక్షణ తరగతులు

పొదిలి, జూలై 15 : ఈ నెల 17, 18 తేదీల్లో పొదిలిల్లో జరిగే సీఐటీయూ జిల్లా శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ కోరారు. సిఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు ఏవీ.నాగేశ్వరావు, రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరావు ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు తెలిపారు. మూడవసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం పీఎఫ్ సకాలంలో చెల్లించని యజమానులపై విధించిన పెనాల్టీని 25 శాతం నుండి 5శాతం వరకు తగ్గించిందన్నారు. తద్వారా కార్మిక హక్కులను కాలరాసేలా తీసుకొచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను అమలు చేయడానికి సిద్ధమౌతుందన్నారు. నూతన వ్యవసాయ చట్టాలతో రైతులను సాగుకు దూరం చేస్తోందన్నారు. ఉపాధి హామీ పథకానికి నిధుల కోత పెట్టి నిర్వీర్యం చేస్తోందన్నారు. రాష్ట్రంలో కార్మిక ఉద్యమాలపై గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన నిర్బంధాలను అధిగమించి అంగన్‌వాడీ, మున్సిపల్, సమగ్ర శిక్ష ఉద్యోగులు చేసిన పోరాటంతో నాటి ప్రభుత్వం దిగొచ్చిందన్నారు. నేడు కార్మికవర్గం ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కల్పించి పరిష్కారానికి బలమైన ఉద్యమాన్ని నిర్మించేందుకు జిల్లాస్థాయి శిక్షణాతరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మికులు ఈ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలన్నారు.

తాగునీటి సరఫరా ట్యాంకర్లు ప్రారంభం



ట్యాంకర్లను ప్రారంభిస్తున్న కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, టీడీపీ కూటమి నాయకులు

పొదిలి, జూలై 15 : పట్టణంలో నెలకొన్న తాగునీటి సమస్యను తీర్చేందుకు నీటిసరఫరా ట్యాంకర్లను సోమవారం నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఆధ్వర్యంలో ప్రారంభించారు. మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి ఆదేశాల మేరకు నీటి ఎద్దడిని తీర్చేందుకు నగరపంచాయతీ పరిధిలోని కాటూరివారిపాలెం, ఎస్సీపాలెం, 10, 11, వార్డుల్లో నీటి సరఫరా ట్యాంకులను ప్రారంభించి నీటిని అందజేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ పట్టణ ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటానని నీటి సమస్యను పరిశీలిస్తూ సమస్య ఉన్న ప్రాంతాలవారు తెలియజేస్తే వెంటనే ప్రాంతానికి ట్యాంకర్‌తో నీటిని అందిస్తామన్నారు. ప్రభుత్వం నీటిసమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టిందని కనుక ప్రజలకు నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజలు నీటి సమస్య ఎక్కడ ఉన్నా వెంటనే తెలియజేయాలని కోరారు. పట్టణంలో సాగర్‌నీరు, బుగ్గచలం, పైపులైన్‌లు లేని ప్రదేశాలను గుర్తించి రోజుకు 100 నుండి 120 ట్రిప్పుల నీటిని సరఫరా చేయనున్నట్లు చెప్పారు. కూటమి నాయకులు మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో కందుల నారాయణరెడ్డి ఇచ్చిన మాట ప్రకారం సీఎం ఆదేశానుసారం నీటి సమస్యను తార్చేందుకు పూనుకున్నారన్నారు. మండలంలో ఉన్న నీటి సమస్యను తీర్చేందుకు ముందుకు వచ్చిన ఎమ్మెల్యేకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నగర పంచాయతీ ఏఈ భూపాల్‌రెడ్డి, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అధ్వానంగా అంతర్గత రహదారులు



నడిచేందుకు వీలులేని మేడపిలోని ఓ వీధి

త్రిపురాంతకం, జూలై 15: రెండు రోజులుగా కురుస్తున్న చిన్నపాటి వర్షాలకు మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో అంతర్గత రోడ్లు గుంతలమయంగా మారాయి. దీంతో నడిచేందుకు వీలులేకుండా తయారయ్యాయి. దీంతో ఆయా గ్రామాల్లో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. త్రిపురాంతకంలోని ఉత్తరపువీధి, బ్రహ్మంగారికాలనీలో రోడ్లు చిత్తడిగా తయారై గుంతలమయంగా మారాయి. గణపవరం గ్రామంలోని ప్రధాన రహదారి, మేడపిలోని ఆంధ్రా బ్యాంకు బజార్ మరీ అధ్వానంగా మారింది. వాహనదాలుకు, పాదచారులకు కనీసం నడిచేందుకు వీలు లేకుండా ఉంది. ఇక జి.ఉమ్మడివరం, సోమేపల్లి, హసానాపురం, కేశినేనిపల్లి, విశ్వనాథపురం, లేళ్ళపల్లి ఎస్సీకాలనీ, కంకణాలపల్లి ఎస్సీకాలనీ, మిరియంపల్లి ఒడ్డుపాలెం గ్రామాలలో అంతర్గత రోడ్లు మరీ అధ్వానంగా మారాయి. దీనికితోడు గ్రామాల్లో ఎక్కడా సైడు కాలువలు లేవు. దీంతో వర్షపు నీటితోపాటు, ఇళ్లలో వినియోగించిన వృథానీరింతా రోడ్లపైనే నిలుస్తోంది. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. జ్వరాలుకూడా వ్యాప్తిచెందే అవకాశం ఉండడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు గ్రామాల అంతర్గత రహదారులు, సైడు డ్రైనులపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



త్రిపురాంతకంలోని రహదారి

కౌలు రైతుల కార్డులతో ప్రయోజనాలు

పెద్ద దోర్నాల, జూలై 15: కౌలు రైతులకు పంటసాగుహక్కు పత్రాలతో ప్రయోజనాలున్నాయని ఏవో జవహర్‌లాల్‌నాయక్ అన్నారు. దోర్నాల-2 రైతుసేవా కేంద్రంలో పంటసాగు హక్కుపత్రాలపై కౌలురైతులకు ఏవో సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలుతో వ్యవసాయం చేసే ప్రతి రైతూ పంట సాగుహక్కు పత్రం పొందాలన్నారు. తద్వారా ప్రభుత్వం మంజూరు చేసే పథకాలు వర్తిస్తాయన్నారు. సీజనులో సాగు చేసే పంటలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వీఆర్‌వో, వీపీఏలు పాల్గొన్నారు.

తర్లుపాడు : పంటలు సాగు చేస్తున్న కౌలు రైతులు ప్రభుత్వం ఇస్తున్న గుర్తింపుకార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. మండలంలోని నికరంపల్లి, నాగులవరం, మాల్యవంతునిపాడు గ్రామాలలో వ్యవసాయ అధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు అధ్యక్షతన కౌలురైతులకు పంటసాగుదారు హక్కుపత్రంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రసుతతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని, కావున గ్రామంలోని కౌలు రైతులు మీ యొక్క సీజన్ దరఖాస్తులను వీఆర్‌వోలకు ఇవ్వాలని తెలియజేశారు. దరఖాస్తు చేసుకున్న మూడు రోజులలో కౌలుకార్డులు ఇస్తారని అన్నారు. పంట రుణాలు, ఈ-పంట నమోదు, పంట నష్టపరిహారం, పంటల బీమా, పంట కొనుగోలు, రాయితీపై వ్యవసాయ పరికరాలు కౌలురైతులకు సైతం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నికరంపల్లి, నాగులవరం, మాల్యవంతునిపాడు గ్రామాల వీఆర్‌ఓలు, వీపీఏలు పాల్గొన్నారు.

నిరాహార దీక్షలు చేపట్టిన కార్మికులు

పొదిలి, జూలై 15 : పొదిలి ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న ఎంప్లాయిస్ యూనియన్ కార్మికులు సోమవారం రిలేనిరాహార దీక్షలు చేపట్టారు. డిపోలో సమస్యలపై పలుమార్లు అధికారులకు మొరపెట్టుకున్నా పరిష్కారం కాలేదన్నారు. అలాంటి పరిస్థితుల్లో నిరాహారదీక్ష చేపట్టక తప్పలేదన్నారు. రీజనల్ కమిటీ పిలుపు మేరకు ఎస్‌కే జిలాని, ఎస్‌కే బాబావలి దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్‌కే బాష మాట్లాడుతూ డిపోలో గత మూడు సంవత్సరాలుగా డ్యూటీ చార్టులు, చార్ట్‌లు, ప్రతినెల రెండు రోజులు సెలవులు, ఉద్యోగులకు ఇవాల్సిన వార్షిక ఇంక్రిమెంట్‌లు సకాలంలో కలపాలన్నారు. ఏఏఎస్ 6, 12, 18, 24, 30 ఇంక్రిమెంట్‌లు కూడా సకాలంలో కలపాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల పట్ల మహిళా కార్మికుల పట్ల అధికారులు వివక్ష చూపడం మానుకోవాలన్నారు. ఉద్యోగుల కొరత వెంటాడుతుందని వేరే డిపోలో పనిచేస్తున్న ఉద్యోగులను మాతృడిపోలో పోస్టింగ్‌లు ఇవ్వాలవని కోరారు. ఈ సమస్యలు పరిష్కారం అయ్యే వరకు రిలేనిరాహార దీక్షలు కొనసాగుతాయని చెప్పారు.

18న డయల్ యువర్ డీఎం

గిద్దలూరు, జూలై 15 : ఆర్టీసీ ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు వీలుగా ఈ నెల 18న డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ బి.చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. 18న మధ్యాహ్నం 11 నుండి 12 గంటల వరకు 9959225702 నెంబరుకు ఫోన్ చేసి సమస్యలు, పరిష్కారాలు, సూచనలు అందచేయాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా చమన్ జయంతి

మార్కాపురం వన్‌టౌన్, జూలై 15: అనంతపురం జిల్లా మాజీ జెడ్పీ ఛైర్మన్ చమన్ 68వ జయంతి వేడుకలు సోమవారం నిర్వహించారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి రాష్ట్ర నూర్‌బాషా సంఘం ఉపాధ్యక్షులు దూదేకుల మస్తానయ్య నివాసం వద్ద చమన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దూదేకుల సంఘం నాయకులు గురవయ్య, నూర్ బాషా, చిన్న కాశీం, బికారి, పెద్ద హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమావేశాన్ని విజయవంతం చేయాలి

పొదిలి, జూలై 15 : జిల్లా కేంద్రం ఒంగోలులో ఈ నెల 17న జిల్లాలో జరిగే రేషన్ డీలర్ల సర్వసభ్య సమావేశాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర రేషన్ డీలర్స్ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ గౌస్‌బాష కోరారు. సోమవారం స్థానిక డీలర్ల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర రేషన్ డీలర్ల సమాఖ్య అధ్యక్షుడు వావిలాల మాధవరావు అధ్యక్షతన ఈ నెల 17న ఒంగోలు కాపు కల్యాణ మండపంలో జరిగే సమావేశాన్ని జయప్రదం చేయాలన్నారు. పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి మండలాల నుండి ప్రతి గ్రామ డీలర్ తప్పకుండా సమావేశంలో పాల్గొనాలని కోరారు. డీలర్లకు ఉన్న సమస్యలపై ఏవిధంగా ముందుకు వెళ్లాలనే విషయాలను సమావేశంలో చర్చించ నున్నట్లు చెప్పారు. ఇక్కడ గుర్తించిన సమస్య లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. అంతే కాకుండా సమస్యల పోరాటంపై తమ అభిప్రా యాలను తెలియజేయాలని కోరారు. కార్యాక్ర మానికి మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనే యస్వామి, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ హాజరవుతారన్నారు. విలేకరుల సమావేశంలో జిల్లా వైస్ ప్రెసిడెంట్ కె రాజమోహన్‌రెడ్డి, డీలర్లు పి.ప్రసాద్, నాగేశ్వరరావు, కాకర్ల బ్రహ్మయ్య పాల్గొన్నారు.

వైసీపీకి కౌన్సిలర్ దంపతుల రాజీనామా

గిద్దలూరు, జూలై 15 : వైసీపీకి మున్సిపల్ కౌన్సిలర్ దంపతులు రాజీనామా చేశారు. గిద్దలూరు మున్సిపాలిటీలోని 20వ వార్డు కౌన్సిలర్‌గా కొనసాగుతున్న సాయిపోగు రిబ్కా వైసీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా కూడా పని చేస్తున్నారు. ఈమె భర్త గోన రంజిత్‌కుమార్ వైసీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు. వ్యక్తిగత కారణాలతో తాము వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు గోన రంజిత్‌కుమార్, ఆయన సతీమణి అయిన కౌన్సిలర్ రిబ్కాలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ రాజీనామా పత్రాలను వైసీపీ రాష్ట్ర కార్యాలయానికి, క్రిస్టియన్ విభాగం రాష్ట్ర అధ్యక్షులుకు పంపించినట్లు పేర్కొన్నారు.

18 నుంచి ఇంటింటి సర్వే

దొనకొండ, జూలై 15: కుష్ఠు వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా ఈనెల 18 నుంచి ఆగస్టు 2 వరకు ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు డిప్యూటీ పారా మెడికల్ అధికారి డాక్టర్ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ స్పర్శ లేని రాగి రంగు మచ్చలు ఉన్నా, కాళ్లు లేదా చేతులు కండరాల్లో బలహీనత, చేతులు, పాదాలు, నరాల్లో తిమ్మిర్లుగా అనిపించటం, చేతులు, కాళ్లల్లో పుండ్లు ఉండటం, కళ్లు పూర్తిగా మూసుకోక పోవటం, చర్మంపై, చెవి తంబలపై బుడిపెలు ఉండటం వ్యాధి లక్షణాలన్నారు. ఈ లక్షణాలు ఉన్న వారు వెంటనే సంబంధిత డాక్టర్‌ను సంప్రదిస్తే తప్పకుండా నయమవుతుందన్నారు. గ్రామాల్లో వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించేందుకే ఆరోగ్యకేంద్రం సిబ్బంది ద్వారా ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో వసంతరావు నాయక్, డాక్టర్ శుక్రునాయక్, డాక్టర్ కె.సునీత, హెల్త్ సూపర్‌వైజర్లు కె.ప్రభావ తీదేవి, తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలు సక్రమంగా అందించాలి



పీహెచ్‌సీలోని ఉద్యోగుల హాజరు రిజిస్టరును పరిశీలిస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరి, జూలై 15: పీహెచ్‌సీల్లో సక్రమంగా సేవలు అందించాలని మున్సిపల్ చైర్మన్ గఫార్ అన్నారు. సోమవారం పట్టణంలోని 2వ పీహెచ్‌సీ కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వైద్యులు, ఆరోగ్యసిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. సిబ్బంది హాజరు రికార్డులను పరిశీలించారు. పీహెచ్‌సీ కేంద్రానికి అద్దె చెల్లించని విషయాన్ని వైద్యులు చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. గత వారం రోజులుగా కేంద్రానికి వాడుకనీరు లేవని తెలిపారు. నీటి సమస్యను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కనిగిరి పట్టణానికి మంజూరైన రెండు ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలు చివరి దశలో ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ ప్రియార్ష నంద, వైద్యసిబ్బంది మేరి, దీపిక తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పేట్లు, గ్లాసులు పంపిణీ

సీఎస్‌పురం(పామూరు), జూలై 15: సీఎస్‌పురం మండలం పెదరాజుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అవసరాలకు ఉపయోగపడేందుకు అవసరమైన ప్లేట్లు, గ్లాసులు, వాటర్‌బాటిళ్లు, నోటు పుస్తకాలను సింగిల్‌విండో మాజీ చైర్మన్ బోయిళ్ల నారాయణరెడ్డి సోమవారం పంపిణీచేశారు. అనంతరం దాత బోయిళ్లను ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో సీఐ ఎం.రామానాయక్, ఎస్ఐ ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

రాయితీపై కంది విత్తనాలు

పామూరు, జూలై 15: కంది పంటను సాగుచేసే రైతులకు 33 శాతం రాయితీపై సరఫరాచేసే విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని సచివాలయ వ్యవసాయ అసిస్టెంట్ వినయ్ సూచించారు. మండలంలోని బోడవాడ గ్రామ సచివాలయ కేంద్రం వద్ద సోమవారం జరిగిన కార్యక్రమంలో రాయితీపై కంది విత్తనాలను రైతులకు పంపిణీచేశారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు డొడ్డా కోటిలింగం, దాసరి రత్తయ్య, ఐటీడీపీ కోఆర్డినేటర్ దండిబోయిన మల్లికార్జున, ప్రధానకార్యదర్శి శివయ్య, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

గోతులమయంగా రహదారి



ప్రమాదకరంగా రోడ్డుపై గుంతలు

పీసీపల్లి, జూలై 15: రహదారులు గోతులమయంగా మారాయి. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా పీసీపల్లిలో ప్రభుత్వ కార్యాలయాల సముదాయానికి వెళ్లే ప్రధానమార్గం దారుణంగా ఉంది. బస్టాండు సెంటర్ నుంచి ప్రభుత్వ కార్యాలయాలైన తహసీల్దార్, ఎంపీడీవో, పోలీస్‌స్టేషన్, స్త్రీశక్తి భవన్ కార్యాలయాలకు ఉద్యోగులు, ప్రజలు ఈ మార్గం గుండానే వెళ్లాలి. బస్టాండు వద్ద నుంచి వే బ్రిడ్జి వరకు రోడ్డు గోతులమయంగా తయారైంది. వర్షం పడితే నీరు ఆ గోతుల్లో నిలుస్తోంది. రెండురోజులుగా కురుస్తున్న వర్షానికి రోడ్డంతా బురదమయమైంది. వర్షపునీటితో నిండిన గోతులు చిన్నపాటి కుంటలా తలపిస్తున్నాయి. దీంతో ఆ మార్గం నరకప్రాయంగా మారింది.

అధికారుల ఆదేశాలు బేఖాతర్

- వివాదాస్పద స్థలంలో బోర్డు తొలగింపు



వివాదాస్పద స్థలంలో ఎవరూ ప్రవేశించవద్దంటూ ఏర్పాటుచేసిన బోర్డు

తాళ్లూరు, జూలై 15 : తాళ్లూరులోని సంచారజాతులకు చెందిన పేద పాములకాలనీవాసులకు, మాజీ తలారీ కుటుంబానికి భూవివాదం నెలకొంది. తాళ్లూరులోని 20కుటుంబాలకు చెందిన పాముల కాలనీవాసులు గ్రామ శివారున కొర్రపాటివారిపాలెం వెళ్లేమార్గంలోగల ప్రభుత్వస్థలంలో నాలుగు దశాబ్దాల నుండి నివాసముంటున్నారు. ఆకాలనీ సమీపాన గల సర్వే నెంబర్ 474లోని 6 ఎకరాల 17సెంట్ల ఏడబ్ల్యూ లాండ్‌లోని స్థలాన్ని కాలనీకి చెందిన మాజీ తలారి కుటుంబీకుడు నల్లూరి ఏసోబు కుటుంబీకులు ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టుతుండటంతో పాములకాలనీ వాసులు అభ్యంతరం తెలిపారు. దీనిపై మే 29న పాముల కాలనీవాసులున డిప్యూటీ తహసీల్దార్ ఇమ్మానియేల్ రాజును కలిసి స్థలం ఆక్రమణకు గురికాకుండా చూడాలని వినతి పత్రం అందజేశారు. డీటీ స్పందించి వీఆర్వో, సర్వేయర్‌లను పంపి ఆ స్థలాన్ని పరిశీలించారు. ఆక్రమణదారుడు తనకు పట్టా ఇచ్చారని రెవెన్యూ అధికారులకు చూపించారు. ఆపట్టా ఆక్రమణ స్థలానిది కాదని చెప్పినా వినలేదు. ఆస్థలంలో నిర్మాణాలు చేపడుతుండగా అడ్డుకోబోయిన పాముల కాలనీ వాసులకు, ఏసోబు కుటుంబీకులకు వివిదాలు జరిగి పంచాయితీ పోలీస్ స్టేషన్ దాకా వెళ్లింది. సమస్య జఠిలంగా మారటంతో ఆ భూమిని ప్రభుత్వ రికార్డుల్లో ఏడబ్ల్యూ లాండ్‌గా ఉన్నందున ఆ స్థలం ప్రభుత్వానికి చెందిన స్థలంగా నిర్ధారించారు. ఆ స్థలంలోకి ఎవరికి ప్రవేశం లేకుండా చూడాలని రెవెన్యూ అధికారులు ఈనెల 12న స్థానిక ఎస్ఐకి ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో ఎస్ఐ ఆదేశంతో ఏఎస్ఐ మోహన్‌రావు, వీఆర్వో నాగలక్ష్మిలు వివాదంగా ఉన్న సర్వే నంబర్ 474, 475లో ప్రభుత్వభూమిలోకి ఎవరూ ప్రవేశించరాదని సోమవారం ఉదయం బోర్డులు ఏర్పాటుచేశారు. వీటిని ఆక్రమణదారుడు తొలగించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని పలువురు కోరుతున్నారు.

నారాయణస్వామి హుండీ ఆదాయం రూ.లక్షా 70వేలు

సీఎస్‌పురం(పామూరు), జూలై 15: సీఎస్‌పురం మండలం మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి ఆదివారం హుండీ ఆదాయం రూ.లక్షా 68 వేల700 వచ్చినట్లు ఈవో గిరిరాజు నరసింహబాబు తెలిపారు. టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.66,170, లడ్డు ప్రసాదం ద్వారా రూ.30,290, అన్నదానం విరాళంద్వారా రూ.72,240 వచ్చినట్లు తెలిపారు.

ఎమ్మెల్యే ఉగ్రను కలిసిన ఆర్‌ఎంసీ కుటుంబసభ్యులు

పామూరు, జూలై 15: పామూరు మండలం పుట్టంనాయుడుపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు రాయవరపు మాల్యాద్రి చౌదరి, ఆయన సతీమణి, మాజీ ఎంపీటీసీ ఝాన్సీలక్ష్మి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రను కలిశారు. సోమవారం కనిగిరిలోని క్యాంపు కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

తాత్కాలిక భవనాల్లోనే ప్రభుత్వ డిగ్రీ కళాశాల

- స్థలం మంజూరైనా వైసీపీ పాలకుల నిర్లక్ష్యం
- కార్యరూపం దాల్చని శాశ్వత నిర్మాణాలు
- పూర్తిస్థాయిలో కోర్సులు అందుబాటులో లేక విద్యార్థుల ఇబ్బందులు



తాత్కాలిక భవనాల్లో నడుస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల

దర్శి, జూలై 15: ఏళ్ల తరబడి దర్శి ప్రభుత్వ డిగ్రీ కళాశాల తాత్కాలిక భవనంలో నడుస్తోంది. పూర్తిస్థాయిలో మౌలిక వసతులు లేకపోవటంతో ఇప్పటికీ విద్యార్థులు అరకొరగానే చేరుతున్నారు. శాశ్వత భవనాల ఏర్పాటుకు రెండు సంవత్సరాల క్రితమే స్థలం మంజూరైనప్పటికీ వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతో కార్యరూపం దాల్చలేదు. దర్శి పట్టణంలో 2021లో మంజూరైన ప్రభుత్వ డిగ్రీ కళాశాలను స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని భవనాల్లో ప్రారంభించారు. కళాశాలలో నాలుగు కోర్సులను ప్రవేశపెట్టారు. బీఎస్సీ(జియాలజీ)), బీఎస్సీ(కంప్యూటర్స్ సైన్స్), బీకాం(కంప్యూటర్స్ అప్లికేషన్), బీఏ(హిస్టరీ) కోర్సులు నడుస్తున్నాయి. బీఎస్సీ(కెమిస్ట్రీ) కోర్సు ఏర్పాటుచేయాల్సిఉండగా ఇప్పటివరకు ప్రారంభించలేదు. ఇంకా అదనంగా బ్యాచిలర్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ కోర్సు కూడా ఏర్పాటు చేయవచ్చు. శాశ్వత భవనాలు లేక చాలినన్ని తరగతి గదులు అందుబాటులో లేక ఉన్న భవనాల్లో నడుపుతున్నారు. ప్రస్తుతం ఇక్కడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల ఎంతోకాలంగా నడుస్తోంది.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరుకావటంతో ఎక్కడా భవనాలు అందుబాటులో లేక తాత్కాలికంగా ఇక్కడ ప్రారంభించారు. రెండు సంవత్సరాల్లో శాశ్వత భవనాలు నిర్మిస్తామని ఆసందర్భంగా వైసీపీ పాలకులు చెప్పిన మాటలు నీటి మూటలయ్యాయి. దర్శి - కురిచేడు రోడ్డులో రెండేళ్ళ క్రితమే కళాశాల భవనాల కోసం ఆరు ఎకరాల భూమిని అధికారులు కేటాయించారు. భవనాల నిర్మాణానికి నిధులు విడుదల కాకపోవటంతో ఇప్పటివరకు అడుగు ముందుకు పడలేదు. ప్రస్తుతం కళాశాలలో నాలుగు కోర్సుల్లో కేవలం 300 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. మొత్తం 540 మంది వరకు చేరే అవకాశం ఉన్నప్పటికీ వనరులు లేకపోవటంతో పూర్తిస్థాయిలో విద్యార్థులు చేరటంలేదు. కీలకమైన బీఎస్సీ(కెమిస్ట్రీ) కోర్సు అందుబాటులో లేకపోవటంతో అనేకమంది విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో శాశ్వత భవనాల నిర్మాణానికి శ్రీకారం చుడతారని దర్శి ప్రాంత ప్రజలు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు. విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ బాధ్యతలు నిర్వహిస్తున్నందున త్వరలో ఖచ్చితంగా నిధులు విడుదల అవుతాయనే విశ్వాసంతో ప్రజలు ఎదురుచూస్తున్నారు.

సాకారంకాని పేదల సొంతింటి కల

- గత ప్రభుత్వంలో పునాదులు దాటని వైనం
- ఆర్భాటంగా లేఅవుట్లు
- లక్ష్యసాధనలో పూర్తిగా వైఫల్యం
- యూనిట్ ధర పెంచాలని

కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్న లబ్ధిదారులు



తూర్పు కోడిగుడ్లపాడులో పునాది దశలో ఉన్న గృహాలు

పామూరు, జూలై 15: పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఇళ్ల నిర్మాణాలు పునాదులు దాటలేదు. ఎక్కడా పూర్తయిన గృహాలు కనిపించకపోగా, అసంపూర్తిగా నిర్మాణాలు మాత్రం జగనన్న లేఅవుట్లలో కన్పిస్తున్నాయి. మండలంలో 8 గ్రామాల్లో జగనన్న లేఔట్లలో ఊర్లే నిర్మిస్తామని అప్పటి పాలకులు ఆర్భాటంగా ప్రకటించారు. లక్ష్య సాధనలో మాత్రం పూర్తిగా వైఫల్యం చెందారు.



గుమ్మలంపాడు లేఅవుట్‌లో నిర్మించిన ఒకే ఒక గృహం

నియోజకవర్గంలోనే అతి పెద్ద లేఅవుట్ అయిన గుమ్మలంపాడులో 536 ప్లాట్లు వేసి, 236 మందికి గృహాలు మంజూరు చేశారు. కేవలం ఒకే ఒక ఇల్లు మాత్రమే నిర్మించడం విశేషం. ఇంటి పట్టా పొందిన ప్రతి లబ్ధిదారునికి నిర్మాణం కోసం ప్రభుత్వ ప్రకటించిన రూ.1.80 వేలల్లోనే రూ.35 వేలు విలువ చేసే 486 కేజీల ఇనుము, రూ.24 వేలు ఖరీదుచేసే 90 బస్తాల సిమెంటు, రూ.7,500 విలువ కలిగిన 20 టన్నుల ఇసుక ను ప్రభుత్వం సరఫరా చేసింది. అయితే, పెరిగిన ధరల ప్రభావంతో గృహాలు నిర్మించుకోవడానికి లబ్ధిదారులు విముఖత చూపుతున్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా యూనిట్ ధరను పెంచాలని, సెంటున్నర బదులు కనీసం రెండున్నర సెంట్ల స్థలం కేటాయించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

పామూరు మండలంలో వేసిన 8 లేఅవుట్లలో సుమారుగా 1500 గృహాలలో కనీసం 20శాతం కూడా పూర్తి కాలేదు. చాలాచోట్ల నిర్మాణ దశలోనే ఉన్నాయి. తూర్పు కోడిగుడ్లపాడులో సర్వే నెంబర్ 110లో 180 మందికి ఇంటి పట్టాలు మంజూరుచేశారు. మొదటి విడత లో 27 గృహాలు మంజూరుకాగా, కేవలం మూడు ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. మిగిలినవి పునాదులతోనే నిలిచిపోయాయి. త్వరగా పనులు చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకున్నా లబ్ధిదారులు ముందుకురాలేదు. అందుకు ప్రధాన కారణం గ్రామాలకు దూరంగా ఇంటి పట్టాలు మంజూరుచేశారు. దీనికితోడు గృహనిర్మాణ సామగ్రి, బేల్దారి మేస్త్రీల ఖర్చులు, ధరలు పెరగడంతోపాటు కనీస సదుపాయాలులేవు. మంజూరైన సెంటున్నర స్థలంలో ఇల్లు నిర్మించుకోవడానికి లబ్ధిదారులు ఆసక్తి చూపడంలేదు.

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద ఇళ్లు నిర్మించుకొన్న లబ్ధిదారులకు అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం చివరి బిల్లులు ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టిన విషయం తెలిసిందే. ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వంలో ఆ బిల్లులు మంజూరుచేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటుచేసిన లేఅవుట్లలో గృహాలు లేకున్నా లెక్కకు మించి విద్యుత్ స్తంభాలు మాత్రం ఉన్నాయి. పెరుగుతున్న ధరలను దృష్టిలో పెట్టుకొని యూనిట్ ధరను పెంచి నిర్మాణాలను అడ్డంకిగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని నూతన ప్రభుత్వాన్ని లబ్ధిదారులు కోరుతున్నారు.

ప్రాధాన్యతాక్రమంలో సమస్యల పరిష్కారం

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి
- ఇందిరా కాలనీలో పర్యటన



మంచినీటి సమస్యను ఎమ్మెల్యేకు వివరిస్తున్న వృద్ధురాలు

కనిగిరి, జూలై 15: కనిగిరి పట్టణంలోని ప్రజా సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. ఒకటో వార్డు పరిధిలోని ఇందిరాకాలనీలో సోమవారం వేకువజామున ఆయన పర్యటించారు. కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు మీ తో..మీ ఎమ్మెల్యే కార్యక్రమం నిర్వహించారు. కాలనీలోని సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తమ సమస్యలను ఏకరువుపెట్టారు. మూడు రోజులకొకసారి కూడా వాడుక నీటిని సరఫరా చేయటం లేదని తెలిపారు. చెత్తకుప్పలను, డ్రైనేజీలను ప్రతిరోజూ శుభ్రం చేయటం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. వీధి లైట్లు సక్రమంగా వెలగటం లేదని చెప్పారు. ఎమ్మెల్యే స్పందిస్తూ వీధిలైట్లు, డ్రైనేజీ, నీటి సమస్యలను పరిష్క రించాలని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావును ఆదేశించారు.



ఎస్సీ బాలుర హస్టల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కాలనీలోని ఎస్సీ బాలుర హాస్టల్‌ను ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర సందర్శించా రు. నీటి సమస్యతో హాస్టల్‌ను మూసివేసిన వి షయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే ఎస్‌డ బ్ల్యూవోను వివరాలతో రావాలని ఆదేశించారు. హాస్టల్‌లకు నీటి సరఫరా చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. పశువుల ఆసుపత్రి, సమీపంలో ఉన్న నాగుల చెరువుకు వెళ్ళే వాగును పరిశీలించారు. వాగు ఆక్రమణలపై దృష్టి పెట్టాలని తహసీల్దార్ సురేష్‌ను ఆదేశించారు. నాగుల చెరువు ఆక్రమణలపై నివేదిక ఇవ్వాలని గత వారం చెప్పిన విషయాన్ని తహసీల్దార్ వద్ద ప్రస్తావించారు. రెండు రోజుల్లో నాగుల చెరువును, కొండసాలు వాగులను ఆక్రమించిన వివరాలు ఇవ్వాలని, లేకుండా చర్యలు తీసుకోక తప్పదని వీఆర్వోను హెచ్చరించారు.

కార్యక్రమంలో ఎస్ఐ త్యాగరాజు, టీడీపీ నాయకులు వీవీఆర్ మనోహరరావు, రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, ఫిరోజ్, తమ్మినేని వెంకటరెడ్డి, చిలకపాటి లక్ష్మయ్య, నజిముద్దీన్, బడేబాయి, సద్గురు, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో వసతుల కల్పనకు కృషి

- ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు

తాళ్లూరు, జూలై 15: తాళ్లూరు పీహెచ్‌సీలో అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తిచేసి వసతుల కల్పనకు టీడీపీ ప్రభుత్వం కృషి చేస్తుందని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో ఎంపీపీ అధ్యక్షతన అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. వైద్యురాలు షేక్ ఖాదర్‌మస్తాన్‌బీ మాట్లాడుతూ ఆస్పత్రిలో వసతులు సక్రమంలేవన్నారు. ఆసుపత్రి అభివృద్ధికి నిధులు మంజూరు కాగా, పనులు అసంపూర్తిగా వదిలివేశారని చెప్పారు. ఆసుపత్రి భవనం వర్షానికి ఉరుస్తూ రికార్డులు తడుస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. వైద్యశాలలో మరుగుదొడ్లు లేక రోగులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. దీనిపై ఎంపీపీ శ్రీనివాసరావు స్పందిస్తూ ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి నిధులను సమకూర్చి వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని చెప్పారు. అభివృద్ధి కమిటీ నిధులను మందుల కొనుగోలు వంటి అవసరాలకు వినియోగించాలని సూచించారు. రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, వైద్యులు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలి

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి పేర్కొన్నారు. స్థానిక పీహెచ్‌సీలో సోమవారం పారిశుధ్యం పరిరక్షణపై జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామాల్లో వైద్యబృందం ఇంటింటికి తిరిగి ప్రజలకు పారిశుధ్యం పట్ల అవగాహన కల్గించాలని కోరారు.



మాట్లాడుతున్న ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు

దోమలు ఆవాసులుగా ఉన్న ప్రాంతాల్లో వాటి నివారణకు తగు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు ఖాదర్‌మస్తాన్‌బీ, రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

ముండ్లమూరు, జూలై 15: చట్టాలపై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలని న్యాయవాది పరిటాల సురేష్ అన్నారు. సోమవారం ముండ్లమూరులోని కేజీబీవీ పాఠశాలలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమాజంలో జరుగుతున్న సంఘటనలను తెలుసుకోవాలని చెప్పారు. ప్రస్తుతం మహిళలపై జరుగుతున్న దాడులను ఏ విధంగా అరికట్టాలో విద్యార్థినులకు వివరించారు. ప్రధానంగా విద్యార్థినులు ఎవరి చేతిలో మోస పోకుండా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలపై వేధింపులు అరికట్టడంలో ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారి సునీత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సలాములు అందుకొంటున్న పీర్లు

భక్తిశ్రద్ధలతో చినపీర్ల సరగత్తుల గ్రామోత్సవం

పామూరు, జూలై 15: మొహర్రం వేడుకల్లో భాగంగా చిన్నపీర్ల సరగత్తుల గ్రామోత్సవాలను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పీర్ల చావిడిల్లో ముస్తాబు చేసిన ఇమామే ఖాశీం స్వామి పీర్లను పూలమాలలు, షేరాలతో అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. పామూరు పాత బస్టాండ్ వద్ద ఉన్న సర్కార్ పీర్లచావిడి, పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న పీర్లు, సీఎస్‌పురం దర్గా వద్ద ఉన్న పీర్లు స్థానిక పాబోలు జ్యూయలర్స్ సెంటర్‌లో సలాములు అందుకున్నారు. అనంతరం స్థానిక తూర్పువీధిలోని స్వామివార్ల దర్గా చెట్టువద్ద జెండాలతో గ్రామోత్సవం నిర్వహించారు. వీటితో దర్గా చెట్టు చుట్టూ ప్రదక్షిణలు చేసి జెండాలను చెట్టువద్ద నిలబెట్టారు. కార్యక్రమాల్లో పీర్ల చావిడిల ముజావర్లతో పాటు హిందూ ముస్లిం భక్తులు పాల్గొన్నారు.



తూర్పువీధి దర్గా చెట్టు వద్ద జెండాలను ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

ముండ్లమూరు, జూలై 15: జిల్లా శిశు సంక్షేమ శాఖ పీడీ ఆదేశాల మేరకు మండలంలోని పోలవరం అంగన్ వాడీ కేంద్రం - 3ని సీడీపీవో భారతి సోమ వారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలోరి కొందరు కేంద్రం సక్రమంగా పనిచేయటం లేదని ఫిర్యాదు చేశారు. ఈమేరకు సీడీపీవో రికార్డులను పరి శీలించటంతో పాటు కేంద్రంలో ఉన్న పలురకాల సరుకులను పరిశీలించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ఎలిశమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అంబవరం పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత తీరుస్తాం



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో కొండారెడ్డి

సీఎస్‌పురం(పామూరు), జూలై 15: అంబవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలలో ఉపాధ్యాయుల కొరతను అధిగమించేందుకు సర్దుబాటు ద్వారా నియ మిస్తున్నట్లు ఎంఈవో రాజాల కొండారెడ్డి తెలిపారు. అంబవరం జడ్పీ పాఠశాల కు వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథ నంపై అధికారులు స్పందించారు. జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు పాఠశాల ను సందర్శించి వాస్తవ పరిస్థితులను నివేదించాలని ఎంఈవోను ఆదేశించారు. దీంతో ఆయన పాఠశాలను సందర్శించారు. ముగ్గురు ఉపాధ్యాయులను సర్దు బాటు కింద నియమిస్తున్నట్లు చెప్పారు. మిగిలిన ఖాళీలను కూడా మార్కాపు రం ఉపవిద్యాశాఖాధికారి ఆదేశాలతో సర్దుబాటు ద్వారా నియమిస్తామని తెలి పారు.

జేవీవీ జాతీయ ఉపాధ్యక్షుడిగా గయాజ్

కనిగిరి, జూలై 15: జేవివి జాతీయ ఉపాధ్యక్షుడిగా షేక్ గయాజ్‌బాషా ఎంపికయ్యారు. ఈనెల 14న బెంగుళూరులో జరిగిన జేవీవీ ఐదవ జాతీయ మహాసభలో ఆయన ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. గయాజ్ కనిగిరి ప్రాంతంలోనే కాకుండా రాష్ట్రంలోని పలుచోట్ల మూఢనమ్మకాల నిర్మూలనకు అనేక కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను తెలియచేసే ప్రోత్సాహక అవగాహన సదస్సులు నిర్వహించారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా జేవీవీ ఆధ్వర్యంలో గత 30 ఏళ్ళుగా ఆయన సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5

మంగళవారం 16 జూలై 2024



గోదావరి జలాలే దిక్కు

కూటమి మీదే లుక్కు

- సాగర్ ఆయకట్టులో సాగు నీటి సంక్షోభం
- గోదావరి జలాల తరలింపు వరప్రదాయిని
- 9.61 లక్షల ఎకరాలకు సాగునీటి భరోసా
- ఐదేళ్ళ పనులు నిలిపివేసిన వైసీపీ ప్రభుత్వం
- తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటుతో రైతులలో చిగురిస్తున్న ఆశలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

బిరబిరా కృష్ణమ్మ పరుగులిడుతుంటే బంగారు పంటలే పండేను. ఈ పరిస్థితి ప్రస్తుతం పలనాట కానరావడంలేదు. కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో వర్షాభావంతో సాగర్ అయకట్టులో సాగు నీటికి కట కటలాడుతోంది. అయకట్టులో సాగునీటి సంక్షోభం నెలకొంది. శ్రీశైలం, సాగర్ జలాశయాలల్లో నీటి నిల్వలు నిండుకున్నాయి.



నకరికల్లులో గోదావరి జలాలు ఎత్తి పోతల పథకానికి 2018లో నాటి సీఎం చంద్రబాబు అవిష్కరించిన శంకుస్థాపన శిలాఫలకం

పంటల సాగు కూడా సందిగ్ధంలో పడింది. అయకట్టులో సాగు నీటికి ఏటా ఇబ్బందులు ఏర్పడుతూనే ఉన్నాయి. సాగర్ అయకట్టులో తాగు, సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారంలో భాగంగా నాడు తెలుగుదేశం ప్రభుత్వం గోదావరి జలాలను సాగర్ అయకట్టుకు తరలించే పథకానికి శ్రీకారం చుట్టింది. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు ఈ పథకాన్ని అటకెక్కించింది. రైతులు ఈ పథకం కోసం ఏళ్ల తరబడి ఎదురుస్తున్నారు. ఈ పనులు తిరిగి ప్రారంభం అవుతాయని రైతులు కోటి ఆశలతో ఉన్నారు. గోదావరి, కృష్ణా నదుల అనుసంధానంకు సీఎం చంద్రబాబు తొలి ప్రాధాన్యం ఇస్తారని రైతులు ఆశిస్తున్నారు.


గోదావరి-పెన్నా నదుల అనుసంధానంలో భాగంగా కృష్ణా నదిలో ప్రకాశం బ్యారేజీ ఎగువన నీటిని ఎత్తిపోతల ద్వారా తరలించి నాగార్జునసాగర్ కుడి కాలువలో పోసే ప్రాజెక్టు నిర్మాణానికి 2018 సెప్టెంబరు 5న టీడీపీ ప్రభుత్వంలో శ్రీకారం చుట్టింది. ఈ ప్రాజెక్టు పూర్తి కావడానికి టీడీపీ ప్రభుత్వం రూ.6,020.15 కోట్లు మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టు కింద గుంటూరు, పల్నాడు, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో మొత్తం 9,61,231 ఎకరాలకు సాగునీరు, 679 చెరువులకు తాగునీరు అందించేందుకు ప్రణాళిక రూపొందించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణ పనులను రెండు ప్యాకేజీలుగా విభజించారు. ఈ ప్రాజెక్టు కోసం తొలి విడతలో ప్రభుత్వ భూములను జలవనరుల శాఖకు స్వాధీనం చేశారు. ప్రైవేటు భూమి అవసరమైన చోట భూసేకరణ నోటిఫికేషన్లు జారీ చేశారు. ప్యాకేజీ 1 కింద పంపుహౌస్ల నిర్మాణానికి లింగాపురంలో 5,32,000 క్యూబిక్ మీటర్లు, క్రోసూరులో 5,77,496 క్యూబిక్ మీటర్ల మట్టిపనిని పూర్తి చేశారు. నీటి పంపింగ్‌కు పైపులను అమర్చే పనిని చేపట్టారు. 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చాక పరిస్థితి మారిపోయింది. ఎక్కడిపనులు అక్కడ ఆగిపోయాయి. ఈ ప్రాజెక్టు కోసం భూసేకరణ చేపట్టలేదు. చేసిన పనులకు సంబంధించి ప్యాకేజీ -1కు రూ.201.96 కోట్లు, ప్యాకేజీ- 2కు రూ.208.52 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఈ ప్రాజెక్టు పేరును వైఎస్ఆర్ పల్నాడు కరువు దుర్భిక్ష నివారణ ప్రాజెక్టుగా మార్చడంలో జగన్ సర్కారు చూపిన శ్రద్ధ, నిధులు కేటాయించడంలో చూప లేదు. మళ్లీ చంద్రబాబునాయుడు సీఎంగా బాధ్యతలు చేపట్టడంతో గోదావరి జలాలు సాగర్‌కు తరలించే పథకంపై రైతుల్లో ఆశలు చిగురించాయి. గత ఏడాది సాగు నీటి కరువతో పంటలను కోల్పోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఏటా సాగు నీటి సంక్షోభం సాగర్ ఆయకట్టులో నెలకొంటుండటంతో గోదావరి జలాల తరలింపే సాగర్ ఆయకట్టుకు దిక్కుగా మారింది. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం గోదావరి జలాల తరలింపుకు వెనువెంటనే నిధులు కేటాయించి పనులు తిరిగి ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.



నిలిచిపోయిన ఎత్తిపోతల పథకం పనులు

ఎన్నాళ్లకెన్నాళ్లకు..

- కృష్ణా డెల్టాకు సకాలంలో సాగునీరు
- కృష్ణా జలాశయాలు అడుగంటినా డెల్టాలో గోదారమ్మ గలగలలు
- మరోసారి డెల్టాకు ఊపిరి పోసిన పట్టిసీమ
- లేకుంటే మళ్లీ సాగు ఆలస్యం... దిగుబడులపై ప్రభావం
- గత ప్రభుత్వంలో ఒక్క ఖరీఫ్‌కూ సకాలంలో రాని నీరు
- సంతోషంలో డెల్టా వరి రైతన్నలు



కృష్ణా పశ్చిమ డెల్టా ప్రధాన కాల్వలో నిండుగా ప్రవహిస్తున్న పట్టిసీమ నీరు



వేమూరు మండలంలో బోర్ల కింద వరి నారుమళ్లు పోసిన రైతులు

ఎన్నాళ్లకు... ఎన్నాళ్లకు! కృష్ణా డెల్టాకు సకాలంలో సాగునీరందింది!... కృష్ణానదీ ఎగువ జలాశయాలన్నీ అడుగంటినా, చుక్కనీరు పులిచింతలలో లేకపోయినా, ఏ చింతా లేదన్నట్టు డెల్టా కాల్వల్లో మాత్రం నీటి ప్రవాహం పరవళ్లు తొక్కుతోంది. ఆల్మట్టి నిండాక కానీ మనకు చుక్కనీరు కిందికి దిగని పరిస్థితి. ఆ నీటిపై ఆశలు పెట్టుకుంటే ఈ సారికూడా ఖరీఫ్ ఆలస్యమయ్యేది. ఫలితంగా రైతులు దిగుబడుల రూపంలో ఈ ఏడాదీ నష్టం భరించాల్సి వచ్చేది. గత నాలుగు ఖరీఫ్ సీజన్‌లుగా సాగునీటి విడుదలపై ఆలస్యం కాదు కదా, కనీసం సకాలంలో నీరందుతుందన్న నమ్మకమే లేని పరిస్థితి. అటువంటి తరుణంలో కృష్ణా డెల్టాను మరోసారి ఆదుకుంది గోదారమ్మ.

తెనాలి, జులై 15 (ఆంధ్రజ్యోతి): ముందుచూపుతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఏనాడో తీసుకొచ్చిన పట్టిసీమ ఖరీఫ్ రైతుకు ఊపిరి పోసింది. కృష్ణా నదికంటే ముందే గోదావరి పరవళ్లు తొక్కటంతో ఏమాత్రం ఆలస్యం చేయకుండా పట్టిసీమను ఉపయోగించి గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు మళ్లించేశారు. దీంతో జూలైలోనే డెల్టా కాల్వలకు నీరొచ్చేసింది. పులిచింతల ఖాళీ అయినా, ప్రకాశం బ్యారేజి మాత్రం జలకళతో ఉట్టిపడుతోంది. అయితే ఇదే పులిచింతల గత ప్రభుత్వ కాలంలో అందుబాటులో లేదాఅంటే... అంతా సక్రమంగా ఉన్నా, జగన్ సర్కారు మాత్రం దీనిపై కక్ష కట్టినట్టు పూర్తిగా నిర్లక్ష్యం చేసింది.

జగన్ పంతం... ఖరీఫ్ అంతం!

తాను పట్టిన కుందేలుకు మూడేకాళ్లన్న చందంగా జగన్ వ్యవహరించిన తీరుతో ఖరీఫ్ రైతులు నాలుగు సీజన్‌లలో పంటలు నష్టపోయారు. పట్టిసీమను చంద్రబాబు తీసుకొచ్చారు కనుక దానిని ధ్వంసం చేయాలన్న తీరుతో అసలు పట్టించుకోకుండా వదిలేశారు. నీరు అందుబాటులో ఉన్నప్పుడు దీనితో పెద్దగా అవసరం లేకున్నా, సాగు నీటి కష్టాలు ఎక్కువగా ఉన్న సమయంలోనూ పట్టిసీమను ఉపయోగించిన పరిస్థితిలేదు. పంతంపట్టి మరీ పట్టిసీమను పట్టించుకోకుండా నాశనం చేశారు. అయితే మళ్లీ చంద్రబాబు సర్కారు రావటంతో మొదటి ప్రాధాన్యం కింద పట్టిసీమపై దృష్టిపెట్టటంతో సకాలంలో సాగునీరొచ్చేసింది.



అది ఎంతగానంటే... పంటలు ఎండినా, రైతు లు నష్టపోయినా, పచ్చని కృష్ణా డెల్టా నీరులేక ఎడారిగా మా రినా మా పంతం మాదేనన్న చందంగా పట్టిసీమను పూర్తిగా నిర్లక్ష్యం చేసేశారు. దీంతో డెల్టా రైతులకు అన్నీ ఉన్నా శని వెంటాడుతుందన్నట్టు ఒక్క సీజన్‌లోకూడా సకాలంలో నీరు రాక పంట నష్టపోయారు. అయితే ఈ ఖరీఫ్‌కు ముందే కొత్తగా కూటమి ప్రభుత్వం రావటం, ముందుగానే అప్రమ త్తం కావటం, పట్టిసీమను సద్వినియోగం చేసుకునే పనికి శ్రీకారం చుట్టటంతో గోదావరి గలగలలు డెల్టాలో వినిపిస్తున్నాయి.

కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలో గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో 5.71 లక్షల ఎకరాల్లో ఏటా వరి సాగవుతుంది. ఖరీఫ్‌లో వరి సాగుచేస్తే, రబీలో మొక్కజొన్న, మినుము, జొన్న పంటలు సాగుచేయటం ఆనవాయితీ. అయితే ఈ ఐదేళ్లలో ఒక సంవత్సరం మినహా మిగిలిన ఖరీఫ్ సీజన్‌లలో సకాలంలో సాగునీరు అందిన పరిస్థితిలేదు. గత ఖరీఫ్ సీజన్‌లో సాగునీటి ఆలస్యం కారణంగా సాగులో జాప్యం ఏర్పడింది. కాల్వల చివరి భూముల్లో అయితే మరింత ఆలస్యం కావటం, కొన్నిచోట్లయితే నాటువేయటానికి సాహసించలేని పరిస్థితులు వచ్చాయి. సాధారణంగా ప్రతి సంవత్సరం జూన్ మొదటి వారంలో నారుమళ్లు పోయటం, జూలైలో నాట్లు వేయటం కృష్ణా పశ్చిమ డెల్టాలో ఆనవాయితీ. పట్టిసీమ లేక ముందు సాగునీటికి కటకట ఏర్పడిన తరుణంలో మాత్రమే సాగు జూలై దాటిపోయేది. అయితే పట్టిసీమ వచ్చాక కృష్ణా జలాశయాల్లో నీరు లేకపోయినా, గోదావరి నది నుంచి నీటిని పట్టిసీమ ద్వారా మళ్లించి మరీ సాగు సకాలంలో జరిగేలా చూడగలిగారు. తర్వాత వైసీపీ సర్కారు వచ్చాక పట్టిసీమను పూర్తిగా పక్కనపెట్టి జలాశయాలను అడుగంటించారు. ఆ ప్రభావం రెండో పంట రబీపైనా చూపింది. అటు పులిచింతలలోనూ ఉన్న కొద్దిపాటి నీటిని తాగునీటికోసం, ఇతర అవసరాలకోసం వదిలేయటంతో మొత్తం అడుగంటింది. 2022 జూలై సమయంలో ఎగువ నుంచి వరద రావటంతో 101 టీఎంసీలు నీరు శ్రీశైలం చేరితే, తర్వాతి సం వత్సరానికి అదికాస్తా ఆవిరైపోయింది. ఇటు నాగార్జున సాగర్, పులిచింతలలోనూ నీరు నిండుకుంది. పులిచింతలలో పూర్తి నీటినిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు ఉంటే, 2023లో కేవలం 10 టీఎంసీల నీరే మిగిలింది. ఇప్పుడు అదీ అడుగుకు చేరింది. ఈ తరుణంలో కృష్ణా డెల్టాలో సాగు కోసం నీరు ఇచ్చే పరిస్థితి లేదు. ఇప్పుడు కూడా జగన్ సర్కారే ఉంటే కచ్చితంగా ఎగువ జలాశయాల నుంచి నీరొచ్చే వరకు ఎదురు చూపులు కానీ, వర్షం ఆధారపడటం వంటి వాటితో సరిపెట్టేవారు.


తెనాలి దగ్గర వెద్ద పద్ధతిలో వరి సాగు మొదలు పెట్టిన రైతులు



మళ్లీ ఆదుకున్న పట్టిసీమ

గోదావరిలో ఏటా వృధాగా పోతున్న వరదనీరే ఎక్కువ కావటం, వాటిని సద్వినియోగం చేసుకునేందుకు 2016లో పట్టిసీమను అప్పటి సీఎం చంద్రబాబు ప్రారంభించటంతో కృష్ణా డెల్టాకు ఊపిరి పోసినట్టయింది. అయితే 2016లో 56 టీఎంసీలు, 2017లో 71 టీఎంసీలు, మిగిలిన సీజన్‌లలో 80 టీఎంసీల వరకు నీటిని తీసుకుని డెల్టా సాగును గట్టెక్కించారు. అయితే వైసీపీ సర్కారు అధికారంలోకి వచ్చాక ఈ ఐదేళ్లలో కేవలం 2023లో మాత్రమే పట్టిసీమను ఉపయోగించామనిపించారు. అప్పట్లో కేవలం 17 టీఎంసీల నీటినే రెండు దఫాలుగా తీసుకున్నారు. మిగిలిన సీజన్‌లలో పట్టిసీమ వైపు చూసిందేలేదు. గత ఏడాది భారీగా నీటి కరవు ఏర్పడటంతో డెల్టాలో రైతులు ఖరీఫ్, రబీ కోసం భూగర్భ జలాలను విచ్చలవిడిగా వాడేశారు. పట్టిసీమ అందుబాటులో ఉన్నా, గోదావరిలో నీటి ప్రవాహం పుష్కలంగా ఉన్నా, జగన్ సర్కారు మాత్రం దానిపై దృష్టే పెట్టలేదు. దీంతో రైతులకు నీటి తడులు పెట్టటానికి తడిచి మోపెడయింది. కొత్త బోర్లు భూమిలో పది నుంచి 20 అడుగుల గోతులు తీసి దానిలో మోటార్లు అమర్చాల్సి వచ్చింది. చేతి పంపులు, గృహ అవసర మోటార్లయితే పనిచేయనే లేదు. అయినా జగన్ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించింది. అయితే ఇప్పటి తరుణంలో అంతకంటే ఎక్కువ నీటి కరవు ఉన్నా, డెల్టా కాల్వలు మాత్రం పుష్కలంగా నీటితో నిండిపోయాయి. దీనికి పట్టిసీమే కారణం. కొత్త ప్రభుత్వం వచ్చాక యుద్ధ ప్రాతిపదికన పట్టిసీమను సద్వినియోగం చేసుకునే పనిపై దృష్టి పెట్టటంతో సాగునీటి కష్టాలుతీరి, మరోసారి సకాలంలో డెల్టా రైతులు పంటలు వేసుకునేందుకు ఊపిరి పోసినట్టయింది. దీంతో రైతులు కూడా సంతోషంతో వ్యవసాయ పనుల్లో మునిగిపోయారు.

సేకరణ పేరుతో.. స్వాహా



- పేదల ఇళ్ల భూ కుంభకోణంపై విచారణ జరిగేనా...!
- ముఖ్య నేతల కనుసన్నల్లోనే భూసేకరణ ప్రక్రియ
- తహసీల్దార్ల ద్వారా ముందుగానే లేఅవుట్ల సర్వే నెంబర్ల లీక్
- ఆ భూములను కొనుగోలు చేసి ప్రభుత్వానికి అధిక ధరకు స్వాధీనం

గుంటూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పేదల ఇళ్ల కోసం ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా సేకరించిన భూసేకరణపై టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం త్వరగా విచారణ జరిపించాలన్న డిమాండ్ వివిధ వర్గాల నుంచి వస్తున్నది. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొన్ని నెలలకే ఈ భారీ కుంభకోణానికి శ్రీకారం చుట్టి ప్రజాధనాన్ని రూ. కోట్లలో దోచేసుకొన్నది. భూసేకరణ ఎక్కడైనా రెవెన్యూ శాఖ కనుసన్నల్లో జరుగుతుంది. జిల్లాలో మాత్రం అంతా అప్పటి ఎమ్మెల్యేలు, వైసీపీ నేతల పర్యవేక్షణలోనే జరిగింది. ఇక్కడే భూముల ధరలను అమాంతం పెంచేసి ప్రభుత్వానికి వాటిని స్వాధీనం చేసి సొమ్ము చేసుకొన్నారు. ఎమ్మె ల్యేలుగా గెలిచిన కొద్ది రోజుల్లోనే రూ. కోట్లకు పడగలెత్తారు. అప్పట్లో తెలుగుదేశం పార్టీ అ సెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌ఛార్జ్‌లు పెద్ద ఎత్తున ఈ అవినీతిపై పో రాటం చేసినా ఫలితం లేకపోయింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ఈ భూ కుంభకోణంపై విచారణ జరిపితే వైసీపీ నేతల జేబుల్లోకి పోయిన ప్రజాధనం లెక్క తేలుతుంది.

- పేదలందరికి ఇళ్లు అని చెబుతూ గత వైసీపీ ప్రభుత్వం ఈ కార్యక్రమానికి తెర లేపింది. భూసేకరణలో లోగడ కుంభకోణాలు జరిగిన దాఖలాలు లేవు. అలాంటిది ఇందులోనూ అవినీతికి పాల్పడొచ్చని వైసీపీ నేతలు చూపించారు. తొలుత తెనాలి నుంచి ఈ కుంభకోణానికి బీజం పడింది. పేదలందరికి ఇళ్ల లేఅవుట్‌లు ఏ సర్వే నెంబర్లలో ప్రతిపాదించారో ముందుగానే తహసీల్దార్ల ద్వారా తెలుసుకొన్నారు. ఆ భూములను ముఖ్య నేతలు వారి అనుచరులు/సన్నిహితుల ద్వారా కొనుగోలు చేశారు. ఆయా సర్వే నెంబర్లలో అప్పటివరకు ఎకరం రూ. 10 లక్షలుంటే ఒక్కసారిగా రెండు, మూడు రెట్లు పెంచి రిజిస్ట్రేషన్లు జరిపించారు. దాంతో ఆయా సర్వే నెంబర్లలో సగటు భూమి రిజిస్ట్రేషన్ విలువ పెరిగింది. దానిని ప్రభుత్వానికి ఇవ్వడం ద్వారా అర్బన్‌లో అయితే ఒకటి, గ్రామీణ ప్రాంతాల్లో అయితే 1.25 విలువని గుణకారం చేశారు. ఉదాహరణకు బేసిక్ విలువ ఎకరం రూ. 7.50 లక్షలు ఉంటే సగటు విక్రయ ధరని రూ. 7,78,146కు చేశారు. దానిని 1.25తో గుణకారం చేయడంతో ఎకరం రూ. 9,72,683 అయింది. ఈ మొత్తానికి 100 శాతం సొలాటియం జోడించడంతో ఎకరం రూ. 19 లక్షల 45 వేల 366కు చేరుకొంటుంది. ఈ మొత్తాన్ని నష్టపరిహారంగా పొందారు.
- కొందరు ముఖ్య నేతలు అయితే భూ యజమానులతో ముందుగానే ఒప్పందాలు చేసుకొన్నారు. మీ భూమికి మంచి ధర ఇప్పిస్తామని, అందుకు గాను తమకు 5 శాతం కమీషన్ ఇవ్వాల్సి ఉంటుందని మాట్లాడుకొని భూసేకరణ కింద భూములు ఇప్పించారు. ఈ క్రమంలో వాగు, చెరువు పోరంబోకు భూములను కూడా తాడికొండ నియోజకవర్గంలో భూసేకరణ చేయించి సొమ్ము చేసుకొన్నారు. జొన్నలగడ్డలో అయితే ఎకరానికి రూ. 80 లక్షలకు పైగా చెల్లించారు. తెనాలిలోనూ ఇదే పరిస్థితి. తెనాలికి సమీపంలోని జంపనిలో ఎకరానికి రూ. 55 లక్షలు చెల్లించారు. వట్టిచెరుకూరు మండలంలోని అనంతవరప్పాడులో ఎకరానికి రూ. 52 లక్షలు చెల్లించారు. కొల్లూరులోని మొసలిపాడులో ఎకరానికి రూ. 30 లక్షలు చెల్లించారు. పొన్నూరులోని దండమూడిలో రూ. 50 లక్షలు ఇచ్చారు. వినుకొండలో అయితే ముఖ్య నేతకు చెందిన నివాసానికి పనికి రాని భూములనే ఎకరం రూ. 25 లక్షల నుంచి రూ. 30 లక్షల వరకు చెల్లించి సేకరించారు.
- అప్పట్లో భూసేకరణని పర్యవేక్షించిన రెవెన్యూ అధికారులు కూడా భారీగా లాభపడ్డారని వినికిడి. ఊహించనంత ధర వస్తుండటంతో సంప్రదింపుల ద్వారానే భూసేకరణ ప్రక్రియ పూర్తి అయింది. జిల్లా స్థాయి అధికారి ఒకరైతే సూట్‌కేసులకు సూట్‌కేసుల నగదుని తీసుకెళ్లారని అప్పట్లో వైసీపీ నేతలే గుసగుసలాడారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఇలా 400 ఎకరాలకు పైగానే భూసేకరణ చేసి రూ. వందల కోట్లను ప్రభుత్వ ఖజాన నుంచి చెల్లించారు. అదేమని ఎవరైనా ప్రశ్నిస్తే పేదల ఇళ్లకు అడ్డుపడతారా అని ఎదురుదాడికి దిగే వారు. అప్పట్లో టీడీపీ నేతలు ఈ భూదోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలు జరిపారు. అయితే వారి గళం అరణ్య రోదనే అయింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దృష్ట్యా ఈ కుంభకోణం వెలికి తీయాలని వివిధ వర్గాలు కోరుతోన్నాయి.

రేషన్ మాఫియాకు అడ్డుకట్ట పడేనా

సిండికేట్‌గా మారిన బియ్యం వ్యాపారులు

చీరాల, జూలై 15 : చీరాల నియోజకర్గంలో రేషన్ మాఫియా ఎప్పటినుంచో వేళ్లానుకుని ఉంది. డీలర్ల నుంచి బియ్యం కొనడం, పక్క జిల్లాల నుంచి బియ్యం కొనడం, వాటిని పోర్టుల వరకు తరలించడంలో ఈ మాఫియా కీలకంగా పని చేస్తోంది. అయితే ప్రభుత్వం మారిన తర్వాత పొరుగు నియోజకవర్గాల నుంచి పోర్టుల దాకా తాము నిర్వహించే దందాలకు సంబంధించి ఒప్పందాలను కుదుర్చుకోవడంలో ఆధిపత్య పోరు మొదలైంది. అందులో ఇద్దరు అన్నదమ్ములు కీలకంగా మారారు. వారి ద్దరి చుట్టూ రేషన్ రాజకీయం తిరుగుతోంది. వారు సుదీర్ఘకాలంగా రేషన్ బియ్యాన్ని డీలర్ల నుంచి కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తుంటారు. అందులో ఒకరు గతంలో ప ర్చూరు నియోజకవర్గం ఇంకొల్లు మండలం కేంద్రంగాను, మరొకరు చీరాల నియోజకవర్గంలోను ఈ దందా సాగించేవారు.

ఈ పరిస్థితిని గమనించి చీరాల బియ్యం మాఫియాలో చక్రం తిప్పే వ్యక్తి తెరపైకి వచ్చి బియ్యం వ్యాపారులు అందరికీ సంధానకర్తగా వ్యవహరించి విషయాన్ని సెటిల్ చేసినట్లు సమాచారం. మీడియాలో కథనాలు రాకుండా వ్యూహాత్మకంగా వ్యవహరించాలనే విషయంలో మాత్రం అందరూ ఏకాభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. అందుకు సంబంధించి అవసరమైతే పలు రూపాల్లో ఎదురుదాడికి కూడా సిద్ధంగా ఉందామని చర్చించుకున్నట్లు సమాచారం.

బియ్యం మాఫియా నియంత్రణకు నాదెండ్ల కంకణం

మంత్రి నాదెండ్ల మనోహర్ రేషన్ మాఫియాపై ఉక్కుపాదం మోపేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నారు. అందులో భాగంగా కాకినాడ పోర్టులో నిర్వహించిన తనిఖీలలో రేషన్ బియ్యం అక్రమ రవాణా, ఎగుమతులకు సంబంధించిన ఆధారాలు లభించాయి. ఈ క్రమంలో తాజాగా ఆదివారం తెనాలిలో ఎండీయూ వాహనాల ద్వారా జరుగుతున్న రేషన్ పంపిణీని మంత్రి మనోహర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్డుదారులు రేషన్ బియ్యాన్ని తీసుకోవాలన్నారు. ప్రభుత్వం రేషన్ బియ్యం అక్రమ కొనుగోళ్లు, రవాణాకు అడ్డుకట్ట వేయాలని కృతనిశ్చయంతో ఉందని చెప్పారు. చీరాలలో మాత్రం ఇతర రాష్ట్రాలకు, పోర్టుల (కాకినాడ, కృష్ణపట్నం)దాకా రేషన్ బియ్యాన్ని రోడ్డు మార్గంలో రవాణా చేసేందుకు, అక్కడ నుంచి జలమార్గంలో బియ్యాన్ని విదేశాలకు అక్రమంగా తరలించేందుకు ఇక్కడి మాఫియా రంగం సిద్ధం చేసుకోవడం గమనార్హం. అధికారులు స్పందిస్తే దీనికి అడ్డకట్ట వేయవచ్చు.

మంత్రి మనోహర్‌ను ప్రశంసించిన పవన్‌కళ్యాణ్



తెనాలి, జూలై 15(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల చైర్మన్ నాదెండ్ల మనోహర్‌ను ఆ పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రశంసించారు. సోమవారం మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన జనసేన పార్టీ ప్రజాప్రతినిధుల సత్కార కార్యక్రమంలో ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రిగా నాదెండ్ల మనోహర్ చేస్తున్న సేవలకు పార్టీ అధినేత డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దుశ్శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ప్రజల కోసం వారి అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రగతి కోసం కూటమి ప్రభుత్వం ముందుకు నడుస్తుందని అందులో బాధ్యతగా మనోహర్ చేస్తున్న కృషికి ఆయన సంతోషం వ్యక్తం చేశారు. మనోహర్‌ను అలింగనం చేసుకుని రాష్ట్రాభివృద్ధికి మరింతగా ముందుకు సాగాలని ఆయన సూచించారు.



చీరాలలో సమస్యలు తిష్ఠ

జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు

బాపట్ల, జూలై 15 : చీరాల నియోజకవర్గంలో అనేక సమస్యలు తాండవిస్తున్నాయని జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు శీలం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ విషయమై సోమవారం ప్రజాసమస్యల పరిష్కారవేదికలో కలెక్టర్ జె.వెంకటమురళికి వినతి పత్రం ద్వారా ఆయన సమస్యలు వివరించారు. చీరాల నియోజకవర్గం పరిధిలోని రెండు మండలాలలో 24 గ్రామపంచాయతీలు ఉండగా కేవలం ఒక పంచాయతీకే ఎన్నికలు జరిగాయని చెప్పారు.కార్యక్రమంలో వంగర శివ, ఇంధనం వెంకటరమణ, కాగిత కోటేశ్వరరావు ఉన్నారు.

సంస్మరణ సభను విజయవంతం చేయండి

విజయనగర్‌కాలనీ(చీరాలటౌన్), జూలై 15 : కారంచేడు మృతవీరుల సంస్మరణ సభను విజయవంతం చేయాలని పలువురు పెద్దలు కోరారు. బుధవారం చీరాల మండల పరిధిలోని విజయనగర్ కాలనీలో కారంచేడు అమర వీరుల రుధిరక్షేత్రం వద్ద సంస్మరణ సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. సోమవారం కాలనీలో జరిగిన సమావేశంలో ప్రతినిధులు మాట్లాడుతూ సభకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు భాస్కరరావు, లక్ష్మీ ప్రసాద్, దేవదానం, ప్రసాద్, ఏసుపాదం, సుబ్బారావు, లక్ష్మయ్య, భగత్‌సింగ్, రవికుమార్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న న్యాయవాది ఈశ్వరిరెడ్డి

పేరాల(చీరాలటౌన్), జూలై 15 : నూతన ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని బార్ అసోసియేషన్ న్యాయవాది ఈశ్వరిరెడ్డి అన్నారు. సోమవారం పేరాల ప్రధాన కూడలిలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ క్షేమ కరమైన ప్రయాణాలపై వాహనచోదకులు దృష్టి సారించాలన్నారు. భిన్నంగా వ్యవహరించి ప్రమాదాలబారిన పడవద్దన్నారు. ట్రాఫిక్ రూల్స్ కూడా కఠినంగా ఉన్నట్లు వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు రామారావు, సోషల్ వర్కర్ మదీన్, పోలీసులు, వాహన చోదకులు ఉన్నారు.

సత్తెనపల్లి నుంచి తిరుమలకు పాదయాత్ర

అద్దంకిలో స్వాగతం పలికిన టీడీపీ కూటమి నేతలు



పాదయాత్రగా వెళ్తున్న వారికి స్వాగతం పలుకుతున్న నేతలు

అద్దంకి, జూలై 15 : రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సత్తెనపల్లి నుంచి టీడీపీ కూటమి శ్రేణులు తిరుమలకు పాదయా త్రగా బయలుదేరారు. సోమవారం పాదయాత్ర బృందం అద్దంకి పట్టణంలోకి చేరుకోగా టీడీపీ, బీజేపీ నేతలు స్వాగతం పలికారు. తిరుమలకు మొక్కు తీర్చుకునేందుకు వెళ్తున్న శ్రేణులకు అద్దంకిలో ఆతిథ్యం ఇచ్చారు. పాదయాత్ర బృందంతో కలిసి కొద్దిదూరం నడిచారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు సందిరెడ్డి శ్రీనివాసరావు, గార్లపాటి శ్రీనివాసరావు, బీజేపీ నేత తమ్మన శ్రీనివాసరావులు ఉన్నారు.

వివాహిత ఆత్మహత్య

మార్టూరు, జూలై 15 : మండలంలోని వలపర్ల గ్రామంలో తస్నీరు సుజాత(35) అనే వివాహిత ఇంటిలో సీలింగ్ ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం మధ్యాహ్నం జరిగింది. ఏఎస్సై మహమ్మద్‌బాషా వివరాల మేరకు.. సుజాతకు భర్త అంకమ్మరావు, ఇద్దరు కుమారులున్నారు. ఉరేసుకున్నాక కొన ఊపిరితో ఉన్న ఆమెను గుర్తించి మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. సుజాత చీటీ పాటలను నిర్వహిస్తూ అప్పులు కావడంతో ఆత్మహత్య చేసుకుంది.

వైసీపీలో ఉండలేం...!

బాలినేని కార్యక్రమానికి నలుగురు కార్పొరేటర్లు డుమ్మా...

మేం పార్టీలో ఇమడలేమన్న మరో నలుగురు

రెండు నెలలు ఆగి వస్తా.. అన్నీ తేలుస్తా

సర్దిచెప్పడానికి ప్రయత్నించిన మాజీ మంత్రి

మూడు రోజుల్లో కార్పొరేషన్ లెక్క అంతా సెటిల్ అంటున్న ఒంగోలు ఎమ్మెల్యే జనార్దన్

వేడెక్కిన కార్పొరేషన్ రాజకీయం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఒంగోలు కార్పొరేషన్‌లో వైసీపీ కార్పొరేటర్లలో కొందరు టీడీపీలో చేరటం ప్రారంభించటంతో వైసీపీ పెద్దల్లో కలవరం మొదలైంది. ఒకవైపు కార్పొరేషన్‌లో పట్టుకోసం టీడీపీ ప్రయత్నించటం, మరోవైపు పార్టీ మారనున్న కార్పొరేటర్లను వైసీపీ నేత, మాజీ మంత్రి బాలినేని బుజ్జగించడం వంటివి నగరంలో చర్చనీయాంశమయ్యాయి.

ఇటీవల సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు పూర్తికాకుండానే ఓటమిని గ్రహించి ముందే హైదరాబాద్ వెళ్లిన బాలినేని.. మళ్లీ సోమవారం 11 గంటలకు ఒంగోలు చేరారు. స్థానిక రైల్వేస్టేషన్‌లో పార్టీశ్రేణులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఆ తర్వాత ఆయన డివిజన్‌లోని పార్టీ నాయకులు, కార్పొరేటర్లతో మంతనాలు జరుపుతూనే ఉన్నారు. అందిన సమాచారం మేరకు.. నలుగురు కార్పొరేటర్లు బాలినేనిని కలవలేదనేది సమాచారం. అందులో 37, 50, 30, 23వ డివిజన్‌ల కార్పొరేటర్లు ఉన్నట్లు తెలిసింది. 11 డివిజన్ కార్పొరేటర్ కూడా బాలినేనిని కలవనప్పటికీ ఆయన కుమారుడు వచ్చి కలిసినట్లు తెలిసింది. బాలినేనిని కలిసిన వారిలో 24వ డివిజన్ కార్పొరేటర్ కుటుంబ సభ్యులు మాకు తప్పని పరిస్థితి.. మేము వైసీపీలో ఉండలేమని చెప్పినట్లు సమాచారం. మరో కార్పొరేటర్ భర్త పసుపులేటి శ్రీనివాసరావు ఎన్నికల సమయంలో మమ్మల్ని పక్కనపెట్టి బయటవారిని ఇన్‌చార్జిగా మమ్మల్ని చిన్నబుచ్చారంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. 2వ డివిజన్ కార్పొరేటర్ తమ డివిజన్‌లో పార్టీ కార్యకర్తలపై దాడులు చేస్తుంటే మన పార్టీ తరపున ఆలకించిన నాథుడే లేకపోవటం తమ అసంతృప్తికి కారణమన్నట్లు తెలిసింది. ఇలా మరో ఇద్దరు, ముగ్గురు కార్పొరేటర్లు ఆయా అంశాలపై బాలినేని ఎదుట వారి అసంతృప్తి వెళ్లగక్కినట్లు సమాచారం.

ఇలా వచ్చి అలా వెళ్లారు..

కొందరు కార్పొరేటర్లు ఇలా వచ్చి అలా వెళ్లిపోవటం ద్వారా వారి మనోగతం తేటతెల్లం చేశారు. కొందరు కార్పొరేటర్లు మాత్రం బాలినేని పక్కనే ఉండి పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ మొత్తం వ్యవహారాన్ని పరిశీలిస్తే రానున్న రోజుల్లో కొందరు వైసీపీ కార్పొరేటర్లు టీడీపీవైపు చేరటం ఖాయంగానే కనిపిస్తోంది. కేవలం ఇంకా 10మంది కార్పొరేటర్లు టీడీపీలో చేరితే కార్పొరేషన్ పాలకమండలిలో టీడీపీకి ఆధిక్యత వచ్చేస్తుంది. సోమవారం నాటి పరిస్థితి గమనిస్తే భవిష్యత్తులో కార్పొరేషన్ టీడీపీ చేతిలోకి వెళ్లేందుకే అవకాశాలు ఎక్కువగా కనిపించాయి. కాగా బాలినేని మాత్రం తిరిగి రాజకీయంగా చురుకైన పాత్ర పోషిస్తానని ప్రకటించారు. అయితే రెండు నెలల అనంతరం ఒంగోలు వచ్చి అప్పటి నుంచి ఇక్కడే ఉంటానని సెలవిచ్చారు.

> ఒంగోలు వచ్చిన బాలినేని శ్రీనివాసరెడ్డిని సోమవారం నలుగురు వైసీపీ కార్పొరేటర్లు కలవలేదు. కలిసిన మరో ముగ్గురు, నలుగురు అసంతృప్తి, అసమ్మతి రాగాలు వినిపించారు. బాలినేని మాత్రం మరో రెండు నెలలు ఆగండి. తిరిగి నేను ఒంగోలు వస్తా. అధికారపార్టీ స్థానిక నేతల బాగోతాలు బయటపెడతానంటూ హెచ్చరికలు, హామీలు ఇచ్చారు. మరోవైపు వెంటనే స్పందించిన ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మేము వచ్చి 20 రోజులే మున్ముందు మీ బాగోతాలు చాలా బయటకు తీస్తామంటూనే మూడు రోజుల్లోనే కార్పొరేషన్ లెక్క సెటిల్ చేస్తామని స్పష్టం చేశారు. దీంతో ఒంగోలు కార్పొరేషన్ రాజకీయం మరింత వేడెక్కింది.



వేచిచూడండి.. అంతా మార్చేస్తాం

ఆ సందర్భంగా దామచర్ల పాలన తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆ తర్వాత ప్రతిస్పందించిన దామచర్ల బాలినేని పాలనలో జరిగిన అవినీతి వ్యవహారాలు ఒక్కొక్కటి బయటకు వస్తాయి. వేచి ఉండండి అన్నారు. వైసీపీ కార్పొరేటర్ల పార్టీ మార్పుపై మూడే రోజుల్లో లెక్కలన్నీ తేలుతాయని వెయిట్ చేయండి అంటూ చెప్పారు. ఈ ఇద్దరు నాయకుల స్పందన, ప్రతి స్పందన ఆ పార్టీ రాజకీయ పరిస్థితులను పరిశీలిస్తే రానున్న రోజుల్లో ఒంగోలు రాజకీయాల్లో స్పష్టమైన మార్పులకు కార్పొరేషన్ టీడీపీ పరమయ్యేందుకు అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి.

మామూళ్ల కోసం వేధింపులు

డ్వామా పీడీపై ఉద్యోగుల ధ్వజం

యూటీఎఫ్ కార్యాలయంలో సమావేశమైన డ్వామా ఉద్యోగులు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 15: జిల్లా నీటి యాజమాన్య సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు రోడ్డెక్కారు. డ్వామా పీడీ బి.అర్జునరావు మామూళ్ల కోసం ఉద్యోగులను వేధింపులకు గురిచేస్తుండటంతో తట్టుకోలేక శాఖలోని అన్ని విభాగాల్లో పనిచేసేవారు ఆందోళనకు దిగారు. డ్వామాలో గత 18 ఏళ్ల నుంచి పనిచేస్తున్న ఉద్యోగులను చులనకగా చూడటంతోపాటు అసభ్యకరంగా మాట్లాడుతుండటంతో తట్టుకోలేక సమావేశమయ్యారు. ఒంగోలులోని యూటీఎఫ్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం డ్వామా ఉద్యోగులు సమావేశమై పీడీ అర్జునరావు విధానాలపై చర్చించారు. ఈ ఏడాది మార్చిలో పీడీగా అర్జున్‌రావు బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఉద్యోగుల పట్ల దురుసుగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. ప్రతి క్లస్టర్ పరిధిలో ప్రగతి పేరిట సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేసి ప్రతి మండలం నుంచి నెలకు రూ.లక్ష తనకు మామూలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని పేర్కొన్నారు. లేనిపక్షంలో ఆయా ఉద్యోగులను టార్గెట్ చేసి సమావేశాలు, టెలికాన్ఫరెన్స్‌లో సస్పెండ్ లేదా ఉద్యోగం నుంచి తొలగిస్తానని భయపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి మండలంలో వర్క్ విజిట్ పేరుతో వెళ్లడం, బెదిరించడం పనిగా పెట్టుకున్నాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయి విజిట్‌కు వచ్చే ముందు నేరుగా మండలస్థాయి సిబ్బందికి ఫోన్ లేదా వాట్సప్ కాల్ ద్వారా పీడీ ఫోన్ చేసి, తన వ్యక్తిగత సిబ్బంది వస్తారని, డబ్బులు రెడీ చేసుకోవాలని ఆదేశాలు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. గత నాలుగు నెలల కాలంలో రూ.2కోట్లకుపైగానే డ్వామా పీడీ అర్జునరావు వెనకేసుకున్నారని ఉద్యోగులు ఆరోపించారు. అంతేకాకుండా ఇంటికి కావాల్సిన వస్తువులను కూడా ఫోన్ చేసి తెప్పించుకుంటున్నారని, లేనిపక్షంలో తమను హీనంగా మాట్లాడుతున్నారని ఉద్యోగులు వాపోయారు. డ్వామా పీడీ అర్జునరావు నుంచి విముక్తి చేసి ఉపాధి పథకాన్ని బతికించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో ఏపీడీలు, ఏపీఓలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లతో పాటు డ్వామా జిల్లా కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు ఉన్నారు. కాగా సమావేశం అనంతరం యూటీఎఫ్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి పీడీ అర్జునరావు వేధింపుల నుంచి కాపాడాలని వేడుకున్నారు. అర్జునరావు అక్రమాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.



నిరసన తెలుపుతున్న డ్వామా ఉద్యోగులు

బింగినపల్లి పంచాయతీ కార్యదర్శి మృతి



శ్రీనివాసులు (ఫైల్)

సింగరాయకొండ, జూలై 15 : మండలంలోని బింగినపల్లి పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న టంగుటూరుకు చెందిన శ్రీనివాసులు (50) మృతి చెందారు. గత కొద్దిరోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. కుటుంబ సభ్యులు సోమవారం ఒంగోలులోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన మృతికి ఎంపీడీవో నగేష్‌కుమారి, పలుగ్రామాల పంచాయతీ కార్యదర్శులు సంతాపం తెలిపారు.

పాఠశాల విద్యార్థులకు కొత్తమెనూ

ఒంగోలు(విద్య), జూలై 15: ప్రభుత్వరంగ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం కొత్త మెనూను ప్రభుత్వం ప్రకటించింది. ఇక నుంచి పీఎం పోషన్ మధ్యాహ్న భోజన పథకంగా దీనిని వ్యవహరించారు. ప్రభుత్వం ప్రకటించిన పోషకాహార మెనూ 2024-25 ప్రకారం ఇలా ఉంది.

- సోమవారం- హాట్ పొంగలి, ఉడికించిన గుడ్లు లేదా కూరగాయల పలావు, గుడ్లు కూర, వేరుశనగ చిక్కి
- మంగళవారం- పులిహోర, టమోటా పచ్చడి లేదా దొండకాయ పచ్చడి, ఉడికించిన గుడ్లు
- బుధవారం- కూరగాయల అన్నం, బంగాళదుంప కుర్మ, ఉడికించిన గుడ్లు, వేరుశనగ చిక్కి
- గురువారం- సాంబర్ బాత్, ఉడికించిన గుడ్లు
- శుక్రవారం- అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్లు, వేరుశనగ చిక్కి
- శనివారం- తీపి పొంగలి, ఆకుకూర అన్నం, పప్పుచారు, భోజనంలో ఇస్తారు.

విద్యార్థులకు నాణ్యమైన చిక్కిలు, గుడ్లు అందించాలని ప్రభుత్వం ఆదేశించింది.

ఏడుగురికి ఎఫ్ఏసీ ఉత్తర్వులు

ఒంగోలు(విద్య), జూలై 15 : ఉద్యోగ విరమణ చేసిన ఒక ఎంఈఓ-1, ఆరుగురు గ్రేడ్-2 హెచ్ఎంల స్థానంలో ఏడుగురికి పూర్తి అదనపు బాధ్యతలు(ఎఫ్ఏసీ) అప్పగిస్తూ పాఠశాల విద్య గుంటూరు ఆర్‌జేడీ బి.లింగేశ్వరరెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. పరిపాలన, జీతాల చెల్లింపు సౌలభ్యం కోసం ఈ ఏర్పాట్లు చేశారు. ఉద్యోగ విరమణ చేసిన సింగరాయకొండ ఎంఈఓ-1 స్థానంలో సింగరాయకొండ మూలగుంటపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం కె.శ్రీనివాసరావును నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. పెదకండ్లగుంట జడ్పీ హైస్కూలుకు అదే పాఠశాలలో పనిచేస్తున్న గణితం స్కూలు అసిస్టెంట్ వై.శ్రీనివాసులు, ఎం.నిడమానూరు జడ్పీ హైస్కూలుకు ఆ పాఠశాల పీఎస్ స్కూలు అసిస్టెంట్ ఎం.కళ్యాణి, మద్దలూరు జడ్పీ హైస్కూలుకు సోషల్ స్కూలు అసిస్టెంట్ ప్రభాకరరావు, మాగుటూరు జడ్పీ హైస్కూలుకు హిందీ స్కూలు అసిస్టెంట్ బి.వెంకటరమణకు, పూసలపాడు జడ్పీ హైస్కూలుకు హిందీ స్కూలు అసిస్టెంట్ సయ్యద్ షబ్బీర్‌ను, హెచ్ఎంపాడు జడ్పీ హైస్కూల్‌కు అక్కడి ఇంగ్లీషు టీచర్ బీవీ.సుబ్బారావుకు ఇన్‌చార్జీ బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

అమ్మలను ఆదరించండి

మానవత్వాన్ని మరుస్తున్న మృగాళ్లు

పెరిగిపోతున్న అత్యాచారాలు

గంజాయి, మద్యం మత్తులో దారుణాలు

ఆచూకీలేని ముచ్చుమర్రి మైనర్, కలకలం రేపిన ఈపూరుపాలెం యువతి ఘటన

కఠిన శిక్షలు పడాల్సిందే అంటున్న న్యాయ నిపుణులు

చీరాలటౌన్, జూలై 15 : రోజు రోజుకూ మృగాళ్లు మానవత్వాని మరిచిపోతున్నారు. శిశువుతో సహా మైనర్‌లపై దారుణాలకు ఒడిగడుతున్నారు. గంజాయి, మద్యం మత్తులో రాబందుల్లా మారి పైశాచికత్వం ప్రదర్శిస్తున్నారు. వచ్చేరోజుల్లో ఆడ పిల్లలను మ్యూజియాల్లో చూడాల్సి వస్తుందని న్యాయ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ తరహాలోనే బహిర్భూమికి వెళ్లిన యువతిపై అఘాయిత్యానికి ఒడిగట్టి హతమార్చిన సంఘటన చీరాల ప్రజలను కలిచివేసింది. అనేక ఫోక్సో కేసులు సైతం నమోదయ్యాయి. గంజాయి, మద్యం మత్తులకు బానిసలుగా మారడంతోనే ఈ ఘటనలో జరుగుతున్నాయని పలువురు విశ్లేషిస్తున్నారు. ఇలా చాపకిందనీరులా గంజాయి చీరాల్లో ఎగబాకి ఉంది. రెండు రెండు రోజుల కిందట చీరాల టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో 6 కిలోల గంజాయి, వన్‌టౌన్‌లో మహిళ వద్ద నుంచి 800 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పలుచోట్ల గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నట్లు సమాచారం ఉంది. చీరాల పట్టణం, రూరల్ పరిధిలోని పలు విద్యాలయాలు ఉన్నాయి. ఇలాంటి చోట్ల నిర్వాహకులు, పోలీసులు అప్రమత్తంగా ఉండడంతోపాటు కట్టుదిట్టమైన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. గతంలో ఈపూరుపాలెంలోని ప్రైవేటు స్కూల్ నుంచి పదవ తరగతి విద్యార్థినిని మీ నాన్న ఇంటికి తీసుకురమ్మన్నట్లు చెప్పి జన సంచారం లేని ప్రదేశంలోకి తీసుకువెళ్లి భౌతికదాడికి పాల్పడిన విషయం తెలిసిందే. పట్టణంలో పలు పాఠశాలల వద్ద నిత్యం ఆకతాయిలు, గంజాయి బాబులు స్కూళ్ల వద్ద పాగా వేస్తున్నారు. అలాగే దండుబాట రోడ్డులో పలుమార్లు దారి దోపిడీలు జరిగాయి. ఇవి గంజాయి మత్తులోనే జరిగాయి. ఈక్రమంలో పోలీసులు నిఘా పెంచాల్సి ఉంది. అంతేకాకుండా పూర్తిగా గంజాయి నియంత్రణపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. అలాగే దారుణాలకు పాల్పడిన వారికి శిక్షలు కఠినంగా పడేలా చూడాలి. లేకుంటే మరిన్ని ఘోరాలు జరిగే అవకాశాలు లేకపోలేదని విశ్లేషకులు అంటున్నారు.



ఈపూరుపాలెం ప్రధాన రహదారిలో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్థులు

అఘాయిత్యాలకు పాల్పడితే అసోసియేషన్ సహకరించదు

- గౌరవ రమేష్‌బాబు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు

చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడిన వారికి అసోసియేషన్ సహకరించదు. అలాగే అలాంటి వాటిపై కొన్ని చట్టాలు కఠినతరం చేయాలి. ఇటీవల జరిగిన ఘటనలు మనసును కలచి వేశాయి. ఇప్పటికే బాలికలకు సైతం రక్షణ లేదు. ఇలాగే ఉంటే భవిష్యత్‌లో మ్యూజియంలో బొమ్మలు మాత్రమే ఉంటాయి. మానవ మనుగడ, సంస్కృతి సంప్రదాయాలు అంతరించి పోతాయి. దేశం అన్ని విధాలా వెనుకబడిపోతుంది. అందరూ వీటిని అరికట్టేందుకు సహకరించాలి.

నేర నియంత్రణకు కృషి

- సత్యనారాయణ, చీరాల రూరల్ సీఐ

చీరాల పరిధిలోని నేర నియంత్రణకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నాం. అందుకు ప్రజల సహకారం కూడా కావాల్సి ఉంది. మీ పరిధిలో ఏదైనా అసాంఘిక శక్తులు ఉన్నట్లయితే నేరుగా సమాచారం అందించండి. మీ వివరాలు గోప్యంగా ఉంచుతాం. ఇటీవల జరిగిన యువతి హత్యాచారం ఘటనలో స్పందించాం. కేసుకు సంబంధించి డీఎన్ఏ పరీక్షలు రావాల్సి ఉంది. సాధారణంగా ఇటువంటి కేసుల్లో 60 రోజుల్లో ఫైల్ సిద్ధం చేయాల్సి ఉంది. ఆవిధంగానే ముందుకు వెళుతున్నాం. నేరస్తులు ఎవ్వరైనా సరే తప్పించుకోలేరు.

అధికారుల ఆదేశాలు బేఖాతర్

వివాదాస్పద స్థలంలో బోర్డు తొలగింపు

తాళ్లూరు, జూలై 15 : తాళ్లూరులోని సంచారజాతులకు చెందిన పేద పాములకాలనీవాసులకు, మాజీ తలారీ కుటుంబానికి భూవివాదం నెలకొంది. తాళ్లూరులోని 20కుటుంబాలకు చెందిన పాముల కాలనీవాసులు గ్రామ శివారున కొర్రపాటివారిపాలెం వెళ్లేమార్గంలోగల ప్రభుత్వస్థలంలో నాలుగు దశాబ్దాల నుండి నివాసముంటున్నారు. ఆకాలనీ సమీపాన గల సర్వే నెంబర్ 474లోని 6 ఎకరాల 17సెంట్ల ఏడబ్ల్యూ లాండ్‌లోని స్థలాన్ని కాలనీకి చెందిన మాజీ తలారి కుటుంబీకుడు నల్లూరి ఏసోబు కుటుంబీకులు ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతుండటంతో పాములకాలనీ వాసులు అభ్యంతరం తెలిపారు. దీనిపై మే 29న పాముల కాలనీవాసులు డిప్యూటీ తహసీల్దార్ ఇమ్మానియేల్ రాజును కలిసి స్థలం ఆక్రమణకు గురికాకుండా చూడాలని వినతి పత్రం అందజేశారు. డీటీ స్పందించి వీఆర్వో, సర్వేయర్‌లను పంపి ఆ స్థలాన్ని పరిశీలించారు. ఆక్రమణదారుడు తనకు పట్టా ఇచ్చారని రెవెన్యూ అధికారులకు చూపించారు. ఆపట్టా ఆక్రమణ స్థలానిది కాదని చెప్పినా వినలేదు. ఆస్థలంలో నిర్మాణాలు చేపడుతుండగా అడ్డుకోబోయిన పాముల కాలనీవాసులకు, ఏసోబు కుటుంబీకులకు వివిదాలు జరిగి పంచాయితీ పోలీస్ స్టేషన్ దాకా వెళ్లింది. సమస్య జఠిలంగా మారటంతో ఆ భూమిని ప్రభుత్వ రికార్డుల్లో ఏడబ్ల్యూ ల్యాండ్‌గా ఉన్నందున ఆ స్థలం ప్రభుత్వానికి చెందిన స్థలంగా నిర్ధారించారు. ఆ స్థలంలోకి ఎవరికి ప్రవేశం లేకుండా చూడాలని రెవెన్యూ అధికారులు ఈనెల 12న స్థానిక ఎస్ఐకి ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో ఎస్ఐ ఆదేశంతో ఏఎస్ఐ మోహన్‌రావు, వీఆర్వో నాగలక్ష్మిలు వివాదంలో ఉన్న సర్వే నంబర్ 474, 475లో ప్రభుత్వభూమిలోకి ఎవరూ ప్రవేశించరాదని సోమవారం ఉదయం బోర్డులు ఏర్పాటుచేశారు. వీటిని ఆక్రమణదారుడు తొలగించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని పలువురు కోరుతున్నారు.



వివాదంలో ఉన్న భూమి

ఆ రోడ్లకు మోక్షం కలిగేనా..?





ఉప్పలపాడు రోడ్డుపై భారీ గుంతలు .. తారు రోడ్డు ఆనవాళ్లు లేని శాంతినగర్-మైలవరం.. బల్లికురవ-కొణిదెన గ్రామాల మధ్య దెబ్బతిన్న రోడ్డు

- ఆనవాళ్లు కోల్పోయిన శాంతినగర్ - మైలవరం-వి.కొప్పెరపాడు రోడ్డు
- పట్టించుకోని వైసీపీ పాలకులు
- మంత్రి గొట్టిపాటిపైనే ప్రజల ఆశలు

అద్దంకి, జూలై 15 : నాడు మార్టూరు నియోజకవర్గ పరిధిలోని గ్రామాలు... పునర్విభజనతో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌తో పాటు ఆ గ్రామాలు అద్దంకి నియోజకవర్గం పరిధికి మారాయి. రవికుమార్ మార్టూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నామ్ రోడ్డు నుంచి మరలా నామ్ రోడ్డును కలిపే విధంగా అద్దంకి మండలం శాంతినగర్ నుండి వెంపరాల, ఉప్పలపాడు, మైలవరం, బల్లికురవ మండలం జమ్మలమడక పల్లె, ఏలేశ్వరవారి పాలెం, వెలమవారిపాలెం, కొత్తూరు మీదుగా వి.కొప్పెరపాడు వరకు రెండు దశాబ్దాల క్రితం పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో సుమారు 25 కి.మీ మేర తారు రోడ్డు నిర్మాణం చేశారు. కొంతకాలానికి తారు రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరింది. పంచాయతీరాజ్ శాఖలో నిధులు లేకపోవడంతో మరమ్మతులు చేపట్టలేదు. దీంతో ఆర్ అండ్‌బీ శాఖ పరిధిలోకి మార్పు చేసి రోడ్డు పునఃనిర్మాణం చేయాలని భావించారు. అయితే ఆర్‌అండ్‌బీలో కూడా కొత్త రోడ్లకు నిధులు లేకపోవడంతో రోడ్డు మరింత అధ్వానంగా మారింది. చాలా చోట్ల అసలు తారు రోడ్డు ఆనవాళ్లు కూడా లేకుండా పోయింది. ఆర్‌అండ్‌బీ నుంచి మరలా పంచాయతీరాజ్‌కు మార్పు చేశారు. వైసీపీ పాలకుల నిర్లక్ష పాపం రాకపోకలకు కూడా ఇబ్బందిగా మారింది. కొన్ని చోట్ల స్థానికులే చిన్నపాటి మరమ్మతులు, చిల్లచెట్ల తొలగింపు చేసుకోగా, ఉప్పలపాడు-మైలవరం మధ్య రోడ్డు ను చిల్లచెట్లు పూర్తి గా మూసి వేశాయి. ఉదయం, సాయం త్రం సమయాలలో ఆర్టీసీ బస్సు నడుపుతుండగా రాకపోకలకు కూడా మరింత ఇబ్బందిగా మారింది. ప్రస్తుతం రవికుమార్ మంత్రిగా ఉండడం, రవికుమార్ తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన సమయంలో వేసిన రోడ్డు కావడంతో ప్రత్యేక దృష్టి సారించి నిధులు మంజూరు చేయిస్తారన్న గంపెడు ఆశతో ఆయా గ్రామాల ప్రజలు ఉన్నారు. దీనికి తోడు సార్వ త్రిక ఎన్నికల ప్రచార సమయంలో ఆయా గ్రామాలలో రవికుమార్ పర్యటించినప్పుడు గెలిచిన తరువాత మొదటి 100 రోజుల ప్రణాళికలో రోడ్లకు నిధులు మంజూరు చేయిస్తానని ఇచ్చిన హామీ అమలు చేసే దిశగా కచ్చితంగా అడుగులు వేస్తారనే ఆశతో ఉన్నారు. 20 ఏళ్ల తరువాత అయినా రోడ్డు కు మోక్షం కలుగుతుందన్న నమ్మకంతో ప్రజలు ఉన్నారు.

నరకప్రాయం..!

- టీడీపీ రాకతో ప్రజల్లో నమ్మకం
- రోడ్లు బాగుచేయాలని వేడుకోలు

బల్లికురవ : మండలంలోని పలు గ్రామాల పరిధిలో ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్లు నరకప్రాయంగా మారాయి. వైసీపీ అయిదేళ్ల కాలంలో ఒక్క రోడ్డుపై తట్ట మట్టి కూడా వేయలేదని దీంతో దెబ్బతన్న రోడ్లలో నిత్యం పలు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు గగ్గోలు పెడుతున్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజలలో రోడ్ల అభివృద్ధి జరుగుతాయి అనే ఆశలు కలుగుతున్నాయి. ఏ నోటా విన్న ప్రజలు రోడ్ల గురించే చర్చించుకుంటున్నారు.

బల్లికురవ మండలంలోని పలు రోడ్లు నూరు శాతం దెబ్బతిన్నాయి. పలు తారు రోడ్లు మట్టి రోడ్లగా మారాయి. ఇప్పుడు వర్షాలు పడుతుండడంతో బురద మయంగా మారాయి. నిత్యం ఈ రోడ్లలో ప్రమాదాల బారిన ప్రజలు పడుతున్నారు. మోకాటి లోతు గోతులు ఏర్పడడంతో కొత్త వ్యక్తులు ఈ రోడ్ల వైపు ప్రయాణం చేస్తే వారు తీవ్ర ఇబ్బదులు పడుతున్నారు. బల్లికురవ మండల కేంద్రం నుంచి కొణిదెన, మార్టూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు, బల్లికురవ నక్క బొక్కలపాడు మార్టూరు రోడ్లు, అలానే బల్లికురవ సంతమాగులూరు రోడ్డు, కొప్పెరపాడు వెలమవారిపాలెం రోడ్డు, చెన్నుపల్లి ఆనంతవరం రోడ్డు, చెన్నుపల్లి, వైదన రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి ఈ రోడ్లపై ప్రయాణం అంటేనే ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి రోడ్లు దెబ్బ తిన్నాయి అని చెప్తున్నా ఎవరూ పట్టించుకోవటం లేదని వాహనదారులు అరోపిస్తున్నారు. బల్లికురవ కొణిదెన మార్టూరు రోడ్డు 10 కిలోమీటర్ల ప్రయాణం గంట సేపు పడుతుందని వారు వాపోతున్నారు. అధికారులు వెంటనే దెబ్బ తిన్న రోడ్ల అభివృద్ధికి నివేదికలు తయారు చేసి ఉన్నత స్థాయికి పంపించాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.



చంద్రమౌళి జయంతి సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చంద్రమౌళి చిరస్మరణీయుడు

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జూలై 15 : డాక్టర్ సజ్జా చంద్రమౌళి చిరస్మరణీయుడని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. డాక్టర్ సజ్జా చంద్రమౌళి జయంతి సందర్భంగా సోమవారం గడియార స్తంభం సెంటర్ సమీపంలోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే కొండయ్య పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చంద్రమౌళి కుమారుడు డాక్టర్ సజ్జా రవీంద్ర, డాక్టర్ సజ్జా హేమలత దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో కొండయ్య మాట్లాడారు. ముందు తరాలవారి ఆలోచనలను కొనసాగిస్తామన్నారు. అందుకు అనుగుణంగా అడుగులు వేస్తామన్నారు. కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, చంద్రమౌళి అభిమానులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు నియామకపత్రాల అందజేత

టీడీపీ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ఆయాల నుంచి టీచర్లుగా ప్రమోషన్లు పొందిన నలుగురికి నియామకపత్రాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ అంకితభావంతో పనిచేయాలని సూచించారు. తనను కలసిన వారికి వారి, వారి సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని చెప్పారు.

అనంతరం వేటపాలెం మండలం రామచంద్రాపురం మత్స్యకారుల ఆహ్వానం మేరకు గ్రామంలో సోమవారం నిర్వహించిన పొంగళ్ల కార్యక్రమానికి ఎమ్మెల్యే కొండయ్య హాజరయ్యారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. గ్రామస్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి

వానలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి మెరుగైన సేవలందించాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య సూచించారు. పార్టీ కార్యాలయంలో సోమవారం ఆర్‌అండ్‌బీ, డ్రైయినేజీ అధికారులు, చీరాల, వేటపాలెం మండలాల ఎంపీడీవోలు, గ్రామ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్నారు. నీటి కాలుష్యంతోనే సగం వ్యాధులు వస్తున్నాయని చెప్పారు. అలాంటి పరిస్థితి లేకుండా ముందస్తుగా చేపట్టాల్సిన చర్యలపై చర్చించి, సూచనలు చేశారు. కార్యక్రమంలో అధికారులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం



విద్యార్థికి సాయమందిస్తున్న రోటరీ సభ్యులు

అద్దంకిటౌన్, జూలై 15 : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో ఇంటర్ చదువుతున్న పేద విద్యార్థికి ఆర్థిక సాయం అందజేశారు. సోమవారం పట్టణంలోని విశ్వభారతి జూనియర్ కళాశాలలో ఇంటర్ మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న పేద విద్యార్థినీ సయ్యద్ అమీర్ అహ్మద్‌కి కాలేజీ ఫీజుల కోసం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ సభ్యులు విశ్రాంత ప్రధానోపాధ్యాయులు చెన్నుపాటి రామాంజనేయులు సౌజన్యంతో రూ.15వేల సాయాన్ని అందించారు. పేదరికంలో ఉన్న ప్రభుత్వం, దాతల సహకారంతో కష్టపడి చదువుకుని ఉన్నత స్థాయికి ఎదిగి మరొకరికి ఆదర్శంగా నిలవాలని పలువురు ఆకాంక్షించారు. దాత రామాంజనేయులు సభ్యులు, అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, కార్యదర్శి చుండూరి మురళీసుధాకరరావు, గాడేపల్లి దివాకర్‌దత్తు, మలాది శ్రీనివాసరావు, జ్యోతి చంద్రమౌళి, కళాశాల ప్రిన్సిపాల్ శివారెడ్డి, సందిరెడ్డి శ్రీనివాసరావు, పువ్వాడ రామకోటేశ్వరరావు, చెన్నుపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యుత్ తీగల చోరీపై ఫిర్యాదు

వేటపాలెం(చీరాల), జూలై 15 : వేటపాలెం, సంతరావూరు మధ్య ఆదివారం విద్యుత్ తీగలు చోరీకి గురైన విషయం తెలిసిందే. దీనిపై డీఈఈ శ్రీనివాసులు, ఏఈ అరుణకుమారి సోమవారం ఆ ప్రాంతాన్ని రైతులతో కలసి పరిశీలించారు. చోరీకి గురైన విద్యుత్ తీగల విలువ రూ.1.70లక్షలు ఉంటుందని అంచనా వేశారు. ఆమేరకు వేటపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బస్టాండ్‌లో అభివృద్ధి పనులు చేపట్టాలి



బస్టాండ్‌ను పరిశీలిస్తున్న డీఎం శ్యామల

ఇంకొల్లు, జూలై 15 : ఇంకొల్లు బస్టాండ్‌లో వెంటనే అభివృద్ధి పనులు చేపట్టాలని చీరాల ఆర్టీసీ డిపో మేనేజర్ శ్యామల సివిల్ ఇంజనీర్ వెంకటేశ్వర్లుకు సూచించారు. బస్టాండ్‌లో సమస్యలపై ప్రయాణికులు డీఎంకు ఫిర్యాదు చేయగా సోమవారం డీఎం శ్యామల బస్టాండ్‌ను పరిశీలించారు. 30 ఏళ్ల కిందట నిర్మించిన మరుగుదొడ్లను చూసి అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే వసతులు కల్పించాలని ఆదేశించారు. గతంలో టీడీపీ హయాంలో నిర్మించిన నాలుగు ప్లాట్‌ఫాం ముందు సీసీ రోడ్లను నిర్మిస్తామని శ్యామల తెలిపారు. కార్యక్రమంలో సివిల్ అధికారులు డి.సుబ్బారావు, కంట్రోలర్ బాబు,ప్రయాణికుల సంఘ అధ్యక్షుడు మోహనకృష్ణ పాల్గొన్నారు.

భోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

అద్దంకిటౌన్, జూలై 15 : ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను పరిష్కారించాలని ఎంఈవో బూదాటి సుధాకరరావును కలిసి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం భోజన పథకం యూనియన్ నాయకురాలు కోటేశ్వరమ్మ మాట్లాడుతూ మండలంలో పని చేస్తున్న మధ్యాహ్న కార్మికులను రాజకీయంగా ఇబ్బంది పెడుతున్నారని, ఉన్నవారిని తొలగిపోవాలని బెదిరిస్తున్నారని తెలియజేశారు. ఏప్రిల్ నెలా మెనూ చార్జీ బిల్లులతో పాటు రెండు నెలల వేతనం పెండింగ్‌లో ఉందని వెంటనే ఆగిన బకాయిలు చెల్లించాలని కోరారు. అలాగే ప్రతి నెలా వేతనం, బిల్లులతో పాటు నెలకు వంట గ్యాస్ సిలిండర్ సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు, మధ్యాహ్నం భోజన పథకం కార్మికులు మొండితోక అక్కమ్మ, చిన్నమ్మాయి, గురుమూర్తి పాల్గొన్నారు.



ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న భోజన కార్మికులు



స్కాలర్‌షిప్‌ను సాధించిన విద్యార్థినులతో సెయింట్ ఆన్స్ ప్రతినిధులు

32 మందికి ప్రగతి స్కాలర్‌షిప్‌లు

- సత్తాచాటిన సెయింట్ ఆన్స్ విద్యార్థినులు
- ప్రకాశం, బాపట్లలో ప్రథమ, ఏపీలో 5వ స్థానం
- అభినందించిన యాజమాన్య ప్రతినిధులు

చీరాల, జూలై 15 : సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో మొదటి సంవత్సరం చదువుతున్న 32 మంది విద్యార్థినులు జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మకమైన ఏఐసీటీఈ వారి ప్రగతి స్కాలర్‌షిప్స్‌ను సాధించారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ మనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు స్కాలర్‌షిప్స్‌కు ఎంపికైన విద్యార్థినులను అభినందించారు. ప్రిన్సిపాల్ క్టర్ కే జగదీష్ మాట్లాడుతూ స్కాలర్ షిప్స్ సాధించిన వారు మొత్తం 32 మంది వరకూ ఉండగా, వారిలో 30 మంది బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నారని, ఇద్దరు డిప్లమో మొదటి సంవత్సరం చదువుతున్నారని తెలిపారు. ప్రకాశం, బాపట్ల జిల్లాల పరిధిలో ఈ స్కాలర్‌షిప్పులు పొందిన కళాశాలల్లో తమ కళాశాల ప్రథమ స్థానంలో ఉందన్నారు. అలానే ఆంధ్రప్రదేశ్‌లోని కళాశాలల్లో 5వ స్థానంలో నిలిచిందన్నారు. ప్రగతి స్కాలర్ షిప్పుల ద్వారా బీటెక్ విద్యార్థినులకు ఏడాదికి రూ.50వేలు చొప్పున 4 సంవత్సరాలకు రూ.2 లక్షలు, డిప్లమో విద్యార్థినులకు రూ.50 చొప్పున మూడేళ్లకు రూ.1.50లక్షలు ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ వారు అందజేస్తారని తెలిపారు. స్కాలర్‌షిప్పులు పొందిన విద్యార్థినులు సద్వినియోగం చేసుకుంటూ ఉత్తమ ఫలితాలు సాధిస్తూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. డైరెక్టర్ (అక్రిడేషన్స్) డాక్టర్ సి.సుబ్బారావు మాట్లాడుతూ స్కాలర్‌షిప్ పొందిన విద్యార్థినులు భవిష్యతలో మరింతగా రాణించాలని చెప్పారు. మొదటి సంవత్సరం ఇన్‌చార్జి ఎస్.అమర్‌నాథ్‌బాబు కార్యక్రమానికి కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

గుంటూరు చానల్‌తో 50 గ్రామాలకు నీరు

- పర్చూరుకు పొడిగించేలా పనులు చేపట్టాలి
- కలెక్టర్‌కు నల్లమడ రైతుల వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

పర్చూరు, జూలై 15 : గుంటూరు చానల్‌ను పర్చూరు వరకూ పొడిగిస్తే 50 గ్రామాలకు తాగునీటి సౌకర్యం కలుగుతుందని, దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకట మురళికి రైతులు విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నల్లమడ రైతు సంఘం అధ్యక్షుడు కొల్లా రాజమోహన్‌రావు అధ్వర్యంలో రైతులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గుంటూరు చానల్‌ను పర్చూరుకు పొడిగించాలని ఎనిమిదేళ్లుగా ఉద్యమాలు చేస్తున్నామని వివరించారు. టీడీపీ ప్రభుత్వం గతంలో చానల్ పొడిగింపు కోసం నిధులు విడుదల చేసినట్లు గుర్తుచేశారు. అనంతరం వచ్చిన వైసీపీ ఆ పనులను నిలిపివేసిందని తెలిపారు. దానిపై ఉద్యమించిన రైతులపై వైసీపీ అక్రమ కేసులు పెట్టిందన్నారు. చానల్ పొడిగింపు పనులు పూర్తిచేస్తే 50 గ్రామాలకు తాగు, సాగునీరు అందుతుందని తెలిపారు. ఏటా నీటి సమస్యలతో ప్రజలు, రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కార్యక్రమంలో గడ్డిపాటి శ్రీనివాసరావు, ఒగ్గిశెట్టి నరసింహారావు, కొల్లా రామన్, మానం విజేత, విజయకుమార్, గోవాడ సత్యన్నారాయణ, రైతులు పాల్గొన్నారు.



చామరాలను అందజేస్తున్న ఎంపీడీవో సత్యనారాయణ

వెండి చామరాల బహూకరణ

అద్దంకి, జూలై 15 : శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఎంపీడీవో సత్యనారాయణ సోమవారం రెండు వెండి చామరాలను బహూకరించారు. స్వామి వారి సేవలకు వినియోగించేందుకు అవసరమైన రెండు వెండి చామరాలను దేవస్థాన సిబ్బందికి ఎంపీడీవో అందజేశారు.

భగవద్గీతపై ప్రచారం



ప్రచారాన్ని నిర్వహిస్తున్న సేవకులు

అద్దంకి, జూలై 15 : త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక నర్సరావుపేట శాఖ అధ్వర్యంలో సోమవారం అద్దంకి పట్టణంలో భగవద్గీత ప్రచారం నిర్వహించారు. గురు పౌర్ణమి విశిష్టత గురించి వివరించారు. కార్యక్రమంలో నర్సరావుపేట శాఖ అధ్యక్షుడు పెద్దరెడ్డి, ఎలిశెట్టి రమేష్, పగడాల రామయ్య, చల్లగుండ్ల భాస్కరరావు, కాటం పోతురాజు, కుంచాల చినవెంకయ్య, కోవూరి చినవెంకటేశ్వర్లు, పగడాల అశోక్, తవటి అమరలింగయ్య, వెచ్చా రాజశేఖర్ పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

ఇంకొల్లు, జూలై 15 : అధికారులు సమన్వయంతో పని చేసి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ మురళీకృష్ణ టెలికాన్ఫరెన్స్‌లో సూచించారు. సోమవారం ఇంకొల్లు ఎంపీడీవో శ్రీదేవితో కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేయాలని సూచించారు.



విద్యార్థినులతో కలసి మొక్కను నాటుతున్న చారులత

మొక్కలను నాటి సంరక్షించాలి

బల్లికురవ. జూలై 15 : ప్రతి విద్యార్థి చదువుతో పాటు మొక్కలను నాటి సంరక్షించాలని సమగ్ర శిక్ష జీసీడీవో చారులత సూచించారు. సోమవారం కస్తూర్బా బాలికల విద్యాలయంలో ఏపీసీ సుధాకర్ ఆదేశాల మేరకు అమ్మ పేరిట మొక్క నాటుదాం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలు పెరిగి పెద్దవైతే చల్లని నీడతోపాటు స్వచ్ఛమైన గాలి, పండ్లు, పూలు వస్తాయన్నారు. భవిష్యత్‌లో వచ్చే విద్యార్థినులకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సరళకుమారి, బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

వీధులు పరిశుభ్రంగా ఉంచాలి

యద్దనపూడి, (మార్టూరు) జూలై 15 : గ్రామ పంచాయతీలోని ప్రతి వీధులు పరిశుభ్రంగా ఉంచేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం అన్నారు. సోమవారం యద్దనపూడి మండలంలోని అనంతవరం గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామస్థులకు ముఖ్యంగా మహిళలకు చెత్తబుట్టలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీడీవో మాట్లాడుతూ ఒక్కొక్కరికీ రెండు బుట్టలను పంపిణీ చేస్తున్నామన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలతో నీరు, గాలి కలుషితమవుతాయన్నారు. వ్యర్థాలను రీసైక్లింగ్‌కు వినియోగించాలన్నారు. తడి చెత్తను ఎరువు తయారీకి వినియోగిస్తామన్నారు. తడి, పొడి చెత్తను కలపకుండా బుట్టల్లో వేయాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ సీహెచ్ శ్రీనివాసరావు, సర్పంచ్ మస్తానబీ, కార్యదర్శి రాణి, నాయకులు తారకరామారావు, పెదవల్లి వెంకట్రావు, కొరిటాల వంశీ పాల్గొన్నారు.



బుట్టలను పంపిణీ చేస్తున్న అధికారులు

వృద్ధులకు దుస్తుల పంపిణీ

పర్చూరు, జూలై 15 : పర్చూరులోని నేతాజీ వృద్ధాశ్రంలోని వృద్ధులకు సోమవారం గ్రామానికి చెందిన యువ వ్యాపారవేత్త కొత్తూరి వెంకటేశ్వరరావు ఆర్థిక సహకారంతో దుస్తులను పంపిణీ చేశారు. అనంతరం అల్పాహార విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొత్తూరి మాట్లాడుతూ వృద్ధులను ఆదరించడం, తోడ్పాటునందించడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు, వృద్ధులు పాల్గొన్నారు.

హనుమోజీపాలెం రోడ్డులోకి యూనియన్ బ్యాంక్


ఇంకొల్లు, జూలై 15 : ఇంకొల్లులో గతంలో ఉన్న యూనియన్ బ్యాంక్ ప్రస్తుతం హనుమోజీపాలెం రోడ్డులోని నూతన భవనం (పానకాల చౌదరి)లోకి మారింది. సోమవారం నుంచి బ్యాంక్ కార్యకలాపాలు నూతన భవనంలో ప్రారంభమయ్యాయని, ఖాతాదారులు గమనించాలని బ్యాంక్ మేనేజర్ కోరారు.

ఉర్దూ పాఠశాల నిర్వీర్యం తగదు

పర్చూరు, జూలై 15: పర్చూరులోని ఉర్దూ పాఠశాలను నిర్వీర్యం చేసే విధంగా చర్యలకు పాల్పడిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని ముస్లింలు జిల్లా విద్యాశాఖాధికారిని కోరారు. గత వైసీపీ పాలనలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని నిబంధనలకు విరుద్ధంగా ఉర్దూ పాఠశాలలో ఉన్న విద్యార్థులను సమీపంలోని ఎంపీపీయూపీ పాఠశాలలోకి విలీనం చేశారన్నారు. ఈ దుశ్చర్యతో ఉర్దూ పాఠశాలలో ముస్లిం విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉర్దూ పాఠశాలలను నిర్వీర్యం చేసేలా తప్పుడు నిర్ణయం తీసుకున్నవారిపై చర్యలు తీసుకోవాలని డీఈవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అహ్మద్ బాషా, షేక్‌గౌస్ బాషా, బుల్లా మేస్త్రి, షేక్.గౌస్, ఎస్‌కే ఖాజావలి పాల్గొన్నారు.



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



'సోమశిల'లో నీటినిల్వ



అనంతసాగరం, జూలై 15: సోమశిల పూర్తిస్థాయి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా సోమవారానికి డ్యాంలో 9.880 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఎగువ నుంచి 55 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలు వలకు 10 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

వైసీపీ ప్రభుత్వం చివరి మూడేళ్లలో పంట కాలువల నిర్వహణకు ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదు. దీంతో కాలువలన్నీ అధ్వానంగా మారాయి. ఫలితంగా నీటి యాజమాన్యం సక్రమంగా జరగక భారీగా నీటి వృథా జరిగింది. దాని ఫలితమే గతేడాది సాగు విస్తీర్ణం తగ్గింది. కొత్త ప్రభుత్వంలోనైనా కాలువల్లో పూడిక తీస్తారా? కష్టాలు తొలగుతాయా? అంటూ రైతాంగం ఆశగా ఎదురు చూస్తోంది. రైతుల కష్టాలను గమనించిన ఎమ్మెల్యేలు మాత్రం సీజన్ కన్నా ముందుగానే స్పందించి ఇరిగేషన్ శాఖ ద్వారా అంచనాలు తయారు చేయించారు. మొత్తంగా రూ.110 కోట్లు అవసరమని అంచనా వేయగా, ఓ ఈఈ స్థాయి అధికారి నిర్వాకంతో ఈ ప్రతిపాదనలను రూ.40 కోట్లకు కుదిస్తూ రాష్ట్ర ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రభావం ఇప్పుడు ఎమ్మెల్యేలకు తిప్పలు తెచ్చిపెట్టింది.

రూ.110 కోట్ల ప్రతిపాదనలు

40 కోట్లకు కుదింపు



సంగం : గడ్డి, తుంగతో పూడిపోయిన పడమటిపాళెం బ్రాంచి కాలువ



- 'ఇరిగేషన్'లో ఓ అధికారి నిర్వాకం
- జిల్లాలో వాస్తవ పరిస్థితులను పక్కన పెట్టిన వైనం
- ఆయన మూలంగా ఎమ్మెల్యేలకు తిప్పలు
- మూడేళ్లుగా పంట కాలువలను పట్టించుకోని వైసీపీ సర్కారు
- ఇప్పుడు చేద్దామంటే లేనిపోని కొర్రీలు



నెల్లూరు : గుర్రపుడెక్క, చెత్తతో నిండి ఉన్న గచ్చు కాలువ

నెల్లూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : పంట కాలువల్లో నీరు సజావుగా పారాలన్నా, చివరి ఆయకట్టు వరకు నీరు అందాలన్నా ఏ సీజన్‌కు ఆ సీజన్‌లో పూడిక తీయాలి. అంతేగాక గుర్రపుడెక్క, గడ్డి తొలగించాలి. సాగులో ఇది కీలకం. సాధారణంగా సెప్టెంబరులో ఇరిగేషన్ అధికారులు కాలువల నిర్వహణ, మరమ్మతులు చేపట్టేవారు. అక్టోబరు నుంచి మొదలయ్యే దుక్కులకు ఇబ్బంది లేకుండా చూసేవారు. కానీ గత మూడేళ్ల నుంచి కాలువల ఓఅండ్‌ఎం పనులను వైసీపీ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోలేదు. దీంతో పూడిక తీయకుండానే మూడేళ్ల నుంచి పంటల సాగవుతున్నాయి. ప్రతీ ఏటా ఇరిగేషన్ శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపినా వాటిని ప్రభుత్వం తిరస్కరించింది. పూడిక తీయండంటూ రైతులు అప్పటి ఎమ్మెల్యేలను వేడుకున్నా ఫలితం దక్కలేదు. దీంతో కొన్నిచోట్ల చివరి ఆయకట్టుకు నీరు అందక ఇబ్బందులు పడ్డ రైతులు.. వారే సొంత డబ్బుతో కాలువల్లో పూడిక తీసుకున్నారు.

● నీటి వృథా

కాలువల్లో పూడికతీయని కారణంగా గతేడాది సోమశిలలోని పది టీఎంసీల నీరు వృథా జరిగింది. ఏటా ఈ కాలువల్లో పూడిక తీతకు గట్టిగా అంటే రూ.15 కోట్ల నుంచి 20 కోట్లకు మించి ఖర్చు కాదు. కానీ మూడేళ్ల నుంచి అసలు కాలువలను పట్టించుకోలేదు. ఇప్పుడు ఇందుకోసం భారీగా ఖర్చవుతుందని అధికారులు అంచనా వేశారు. పరిస్థితిని గమనించిన ప్రస్తుత ఎమ్మెల్యేలు ఇరిగేషన్ శాఖ అధికారులతో ఇప్పటికే సమీక్షించారు. ఏటా సెప్టెంబరులో పంపే ప్రతిపాదనలను ఇప్పటికే సిద్ధం చేశారు. కాలువలు, చెరువుల నిర్వహణకు ఓఅండ్‌ఎం కింద జిల్లా మొత్తం రూ.110 కోట్లు అవసరమవుతుందని అధికారులు ప్రాథమిక అంచనాలు రూపొందించారు.

● ఆ అధికారి మూలంగా కుదింపు

ఒక్క సెంట్రల్ డివిజన్ పరిధిలోనే రూ.60 కోట్లు అవసరమని ప్రతిపాదించారు. మిగిలిన డివిజన్లకు మరో రూ.50 కోట్లను ప్రతిపాదిస్తూ రాష్ట్ర ఉన్నతాధికారులకు పంపారు. కానీ ఇరిగేషన్ అధికారుల్లో సమన్వయ లోపమో.. లేదా అంతర్గత పోరో..? తెలియదు గానీ ఆ ప్రభావం ఈ ప్రతిపాదనలపై పడింది. వారం క్రితం రాష్ట్ర జలవనరుల శాఖ ఉన్నతాధికారులు ఓఅండ్‌ఎం ప్రతిపాదనలపై చర్చించేందుకు జిల్లాకు చెందిన ముగ్గురు ఎస్‌ఈలు, ఈఈలను విజయవాడకు పిలిచారు. అయితే ఆత్మకూరు ప్రాంతంలో పనిచేస్తున్న ఓ ఈఈ స్థాయి అధికారి అప్పటికే ఉన్నతాధికారుల వద్ద ఉన్నారు. జిల్లాకు రూ.110 కోట్లు అవసరం లేదని, పనులు చేయకుండా డబ్బులు తినేసేందుకు ఇంత భారీ మొత్తంలో ప్రతిపాదనలు పంపారం టూ జిల్లా అధికారులపై ఫిర్యాదు చేశారు. అయితే జిల్లాలో వాస్తవ పరిస్థితులను మాత్రం ఆయన వివరించలేదని సమాచారం. గత ప్రభుత్వంలో జరిగింది కూడా ఇదే కావడంతో ఉన్నతాధికారులు కూడా ఆలోచనలో పడినట్లు ఇరిగేషన్‌శాఖలో చెప్పుకుంటున్నారు. ఆ క్రమంలోనే రూ.110 కోట్ల ప్రతిపాదనలను వెనక్కు పంపి, ఆ మొత్తాన్ని రూ.40 కోట్లకు కుదించినట్లు తెలిసింది. దీంతో మళ్లీ ఇరిగేషన్ శాఖ అధికారులు ప్రతిపాదనలు తయారు చేస్తున్నారు. దీని మూలంగా అన్ని నియోజక వర్గాల్లోనూ పూర్తిస్థాయిలో కాలువలను బాగు చేయడం సాధ్యపడదని ఇంజనీర్లు చెబుతున్నారు.

● ఎమ్మెల్యేల అసహనం

పంపిన ప్రతిపాదనలు తగ్గించడంపై ఎమ్మెల్యేలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. సదరు ఈఈ ఫిర్యాదుతో ఇదంతా జరగడంతో ఆయనపై ఎమ్మెల్యేలంతా ఆగ్రహంగా ఉన్నారు. తగ్గించిన వర్కులన్నింటి వివరాలను తమకు అందజేయాలని ఇప్పటికే ఎమ్మెల్యేలంతా ఇరిగేషన్ అధికారులకు సూచించారు.

ప్రతిపాదనలు సిద్ధం

రానున్న వ్యవసాయ సీజన్‌కు సంబంధించి కాలువల్లో ఓఅండ్‌ఎం పనులకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. తొలుత రూ.110 కోట్లకు అంచనాలు తయారు చేశాం. అయితే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాటిని రూ.40 కోట్లకు తగ్గించి ఎస్టిమేషన్లు తయారు చేశాం. ఈ వివరాలన్నింటినీ ఎమ్మెల్యేలకు అందజేశాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే వెంటనే పనులు ప్రారంభిస్తాం.

- పీ కృష్ణమోహన్, ఇరిగేషన్ శాఖ ఎస్ఈ

చరిత్రలో నిలిచేలా రొట్టెల పండుగ

- 20 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా
- అన్ని శాఖలు సమర్థవంతంగా పని చేయాలి
- అధికారుల సమీక్షలో మంత్రి నారాయణ

నెల్లూరు (సాంస్కృతికం) : మత సామరస్యానికి ప్రతీక అయిన రొట్టెల పండుగను ఈసారి చరిత్రలో నిలిచిపోయేలా నిర్వహించనున్నట్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో శాఖలు వారీగా నిర్వహించాల్సిన విధులపై మంత్రి దిశా నిర్దేశం చేశారు. 17 నుంచి 21వ తేదీ వరకు జరిగే రొట్టెల పండుగకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ ఏడాది రొట్టెల పండుగకు దేశం నలుమూల నుంచి 20లక్షల మంది భక్తులు వస్తారని, ఆ మేరకు ఏర్పాట్లు, వసతులు కల్పించాలని నారాయణ సూచించారు. పార్కింగ్ ప్రదేశాలలోనూ మంచినీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. సమీక్ష అనంతరం మంత్రి నారాయణ మాట్లాడుతూ దర్గా ఆవరణలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ 5వేల మంది పారిశుధ్య కార్మికులను నియమించినట్లు తెలిపారు. దర్గా ప్రాంతాన్ని జోన్లుగా విభజించి పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే, 2వేల మంది పోలీసులతో బందోబస్తు, స్వర్ణాల చెరువులో 45 మందితో గజ ఈతగాళ్లతో గస్తీ ఏర్పాటు చేశామన్నారు. 24/7 విద్యుత్ అంతరాయం లేకుండా సరఫరా, జనరేటర్లు ఏర్పాటు చేశామన్నారు. సీసీ కెమెరాలతో గట్టి నిఘా ఉంటుందని, అగ్నిమాపక దళం 10 పంపుల ద్వారా స్వర్ణాల చెరువు నీటిని శుద్ధి చేయడం జరుగుతున్నారు. భక్తుల సౌకర్యార్థం 12 సురక్షిత తాగునీటి స్టాళ్లు, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు, తరలివచ్చే భక్తులకు అన్నదానం చేసేందుకు ముందుకు వచ్చిన స్వచ్ఛంద సంస్థలకు వసతులు కల్పిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో కలెక్టర్ ఆనంద్, అదనపు ఎస్పీలు సౌజన్య, గాదె శ్రీనివాసరావు, కార్పొరేషన్ అదనపు కమిషనర్ శర్మద, ఎస్ఈ సంపత్‌కుమార్, సిటీ ప్లానర్ దేవకుమార్, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్, మత్స్య శాఖ ఏడీ నాగేశ్వరరావు, ఆర్డీవో మాలోలా, తహసీల్దారు సుబ్బారెడ్డిలతోపాటు టీడీపీ నేతలు అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రొట్టెల పండుగ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి నారాయణ



విద్యుద్దీప వెలుగుల్లో దర్గా



స్వర్ణాల చెరువు ఘాట్‌లో ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్

● ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

నెల్లూరు (స్టోన్‌హౌస్ పేట) : రొట్టెల పండుగకు తరలివచ్చే భక్తుల కోసం ఆర్టీసీ సంస్థ 42 ప్రత్యేక సర్వీసులను నడపనున్నది. ఈ బస్సుల్లో సాధారణ చార్జీలనే వసూలు చేయనున్నట్లు ఆర్ఎం జి విజయరత్నం తెలిపారు. కాగా, నగరంలోని ప్రధాన రైల్వే స్టేషన్ నుంచి షాహీద్ దర్గా పరిసర ప్రాంతాల వరకు పోలీసుల అనుమతుల ప్రకారం బస్సులను నడపనున్నారు. అలాగే ఏఎస్‌పేట, కసుమూరు దర్గాలకు కూడా బస్సులు తిప్పనున్నారు.

భక్తుల సందడి

రొట్టెలపండుగకు ముందుగానే బారాషహీద్ దర్గాకు భక్తులు తరలివస్తున్నారు. బుధవారం నుంచి పండుగ ఆరంభం కానుండగా రెండు రోజుల ముందే దూరప్రాంతాల నుంచి భక్తులు వస్తున్నారు. దర్గా ప్రాంగణంలో ఉన్న స్వర్ణాల చెరువులో స్నానమాచరించి, వరాల రొట్టెలను మార్చుకుంటున్నారు. అనంతరం బారా షహీద్‌లను దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణమవుతున్నారు. కాగా, పండుగ జరిగే ఐదు రోజుల్లో 17వ తేదీన సందల్‌మాల్, 18న బారాషహీద్ దర్గా గంథ మహోత్సవం, 19న రొట్టెల పండుగ, 20వతేదీ తలీఫాతేహా, 21న ముగింపు సభ జరగనుంది.

- నెల్లూరు (సాంస్కృతికం)



● నిరంతర విద్యుత్ సరఫరా : ఎస్ఈ

నెల్లూరు (జడ్పీ) : దర్గాలో నిరంతర విద్యుత్ సరఫరాకు పటిష్ఠ ఏర్పాట్లు చేశామని ఆ శాఖ ఎస్ఈ విజయన్ తెలిపారు. సోమవారం దర్గాను సందర్శించిన ఆయన అధికార సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. దర్గాలో 315కేవీ, 250, 160కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను అదనంగా ఏర్పా టు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే 125 కేవీ జనరేటర్‌ను అందుబాటులో ఉంచుతామన్నారు. 5రోజుల పాటు జరిగే పండుగకు అధికారులను, సిబ్బందిని మూడు విడతలుగా ఏర్పాటు చేశామన్నారు. ఆయన వెంట డీఈ శ్రీధర్, ఏఈ లక్ష్మీనారాయణ ఉన్నారు.

● ఏర్పాట్ల పరిశీలన

నెల్లూరు (హరనాథపురం) : బారాషహీద్ దర్గాలో ఏర్పాట్లను కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్‌లు సోమవారం పరిశీలించారు. పోలీసు కంట్రోల్‌రూం, స్వర్ణాలచెరువు ఘాట్, అన్నదాన కేంద్రాలను, వైద్యశిబిరాలు, రిసెప్షన్, మానిటరింగ్ సెంటర్‌లను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్నీ ఏర్పాట్లను పక్కాగా చేపడుతున్నట్లు చెప్పారు.



స్వర్ణాల చెరువు ఘాట్‌లో రొట్టెలు మార్చుకుంటున్న భక్తులు

అందరి సహకారంతో శాంతిభద్రతలు నెలకొల్పుతాం

- గంజాయి నిర్మూలనకు ప్రత్యేక ప్రణాళికలు
- ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటా : బాధ్యతల స్వీకరణలో ఎస్పీ

నెల్లూరు (క్రైం), జూలై 15 : జిల్లాలోని అందరినీ సమన్వయం చేసుకుంటూ శాంతిభద్రత పరిరక్షణ, నేర నియంత్రణ, ట్రాఫిక్ తదితర సమస్యల పరిష్కారం వైపు అడుగులు వేస్తామని జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్పీ) జి కృష్ణకాంత్ స్పష్టం చేశారు. నెల్లూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్పీగా ఆయన బాధ్యతలు స్వీకరించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 100 రోజుల గంజాయి నిర్మూలన విధానంలో భాగంగా జిల్లాలో పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యేక ప్రణాళికలను రూపకల్పన చేస్తామన్నారు. మహిళలపై జరిగే నేర నిర్మూలన, వారి సమస్యల పరిష్కారానికి అధికంగా ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు చేపడుతామని, సంఘ విద్రోహ శక్తులపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. పోలీసులు వారి కుటుంబాల సంక్షేమం కోసం ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. అనంతరం సబ్ డివిజన్, సర్కిల్ పోలీసు అధికారులు, ఎస్బీ, డీసీఆర్‌బి, పోలీసు కార్యాలయం సిబ్బంది, అన్ని విభాగాల సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



మంత్రి ఆనంకు మొక్క అందజేస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

● మంత్రులను కలిసిన ఎస్పీ

నెల్లూరు (క్రైం) : ఎస్పీగా బాధ్యతలు తీసుకున్న జి కృష్ణకాంత్ రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణలను వారివారి క్యాంపు కార్యాలయాల్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో శాంతి భద్రతలపై చర్చించారు. అనంతరం కలెక్టర్ ఆనంద్‌ను, జిల్లా జడ్జి యామినిని కూడా ఎస్పీ కలిశారు.

నిరుపయోగంగా గోదాములు

ఉదయగిరి రూరల్, జూలై 15: నియోజకవర్గంలోని అన్నిమండల కేంద్రాల్లో గత వైసీపీ ప్రభుత్వం రైతుల ప్రయోజనం కోసం సహకారశాఖ ఆధ్వర్యంలో నిర్మించిన వ్యవసాయ గోదాంలు నిరుపయోగంగా మారాయి. రైతులు పండించిన పంట ఉత్పత్తుల నిల్వ కోసం రూ.లక్షలు ఖర్చు చేసి నిర్మించారు. ఇప్పటివరకు భవనాన్ని అందుబాటులోకి తీసుకురాలేదు. ఉదయగిరి మండలం గంగిరెడ్డిపల్లి, దుత్తలూరు తహసీల్దారు కార్యాలయ ఆవరణలో, వరికుంటపాడు, వింజమూరు, సీతారామపురం, జలదంకి, కొండాపురం, కలిగిరి మండలాల్లో 500మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాములను రూ.40లక్షల వ్యయంతో నిర్మించారు. కొన్నిమండలాల్లో గోదాంల నిర్మాణ బిల్లులు సక్రమంగా చెల్లించకపోవడంతో పూర్తిస్థాయిలో నిర్మాణాలు పూర్తికాలేదు. మరికొన్ని ప్రాంతాల్లో నిర్మాణం పూర్తయి నిరుయోగంగా ఉన్నాయి. అధికారులు స్పందించి గోదాంలు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రయోజనం చేకూరేనా..

గ్రామాల్లో నిర్మించిన వ్యవసాయ గోదాములతో రైతులకు ప్రయోజనం చేకూరుతుందా అన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లేనప్పుడు రైతులు తమ ఉత్పత్తులను అక్కడ అద్దె రూపంలో నిల్వ ఉంచుకునేలా విధివిధానాలు ఉన్నాయి. ఈ భవనాల సౌమర్థ్యం 500మెట్రిక్ టన్నులే కావడంతో ఎక్కువ మంది రైతులకు అది ఉపయోగపడటం లేదు. మెట్ట ప్రాంతమైన ఉదయగిరిలో అధికంగా ఆరుతడి పంటలు సాగుచేస్తారు. దిగుబడిని రైతులు ఎప్పటికప్పుడు విక్రయిస్తుంటారు. ఈ గోదాములు రైతులకు ఎంతమాత్రం ఉపయోగపడతాయో వేచి చూడాల్సిందే మరి.



గంగిరెడ్డిపల్లిలో నిరుపయోగంగా ఉన్న గోదాము

తప్పిన ప్రమాదం

వింజమూరు, జూలై 15: నెల్లూరు నుంచి పామూరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వింజమూరు చెరువు కట్ట మరో బస్సుని క్రాస్ చేయబోయి వేగంగా రోడ్డు దిగింది. డ్రైవర్ చాకచక్యంగా బస్సును కంట్రోల్ చేయడంతో ఒక పక్కకు ఒరిగి నిలిచిపోయింది. ఈ సంఘటనలో ప్రయాణి కులంతా భయాందోళన చెందారు.

మొక్కజొన్న విత్తనాల పంపిణీ

వింజమూరు, జూలై 15: కాటేపల్లి రైతుసేవాకేంద్రంలో సోమవారం రైతులకు పశుసంవర్ధక శాఖ వారి ఆధ్వర్యంలో జొన్న, మొక్కజొన్న విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కొమ్మి కోటేశ్వరరావు పాల్గొని రైతులకు పలు సలహాలు, సూచనలను అందించారు. పాల దిగుబడిని ఈ పశుగ్రాసం ద్వారా పెంచుకో వచ్చని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జూలై 15: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే అంటు వ్యాధులు దరిచేరవని నర్రవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి హరీష్ తెలిపారు. డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాల్లో సోమవారం నర్రవాడ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. ఇంటి పరిసరాలు, టైర్లు, పూలకుండీలు, ప్లాస్టిక్ వస్తువుల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు చేపడితే కీటక జనిత వ్యాధులు (మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా) వంటి జ్వరాల బారి నపడకుండా ఉండవచ్చన్నారు. దోమలు కుట్టకుండా దోమ తెరలను వాడాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి వ్యాధులకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఉదయగిరి మలేరియా సబ్ యూనిట్అధికారి నౌషాద్‌బాబు, ఆరోగ్య పర్యవేక్షకులు రియాజ్, షఫీ, హెచ్ఎం సుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కార్డులకు దరఖాస్తు చేసుకోండి

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జూలై 15: భూయజమానులకు నష్టం కలుగకుండా ప్రభుత్వం అందజేసే కౌలురైతు గుర్తింపు కార్డులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఉదయగిరి వ్యవసాయ సహాయ సంచాలకులు పీ.చెన్నారెడ్డి తెలిపారు. సోమవారం వెంకటంపేట రైతు సేవాకేంద్రంలో అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. 11నెలల కాలపరిమితి కలిగిన కౌలురైతు గుర్తింపుకార్డుతో అనేక ప్రయోజనాలు పొందవచ్చన్నారు. విపత్తుల్లో పంట నష్టపోతే పరిహారం, పంట రుణాలు, బీమాతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీవర్గాల ప్రభుత్వం అందజేసే రైతు భరోసా పథకానికి అర్హులవుతారన్నారు. కార్యక్రమంలో ఏవో వెంకటసుబ్బారెడ్డి, ఏఈవో భోగ్యం సుధీర్‌కుమార్, వీఏఏ సుజాత, రైతులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి సహకరించండి

ఉదయగిరి రూరల్, జూలై 15: పట్టణంలోని చెరువు ఆనకట్ట సమీపంలోని గంగమ్మ ఆలయ నిర్మాణానికి సహకరించాలని సోమవారం ఆలయ కమిటీ సభ్యులు సోమవారం తహసీల్దారు నెహ్రూబాబుకు విన్నవించారు. ఆలయం శిథిలావస్థకు చేరడంతో గతేడాది దాతల సహకారంతో నూతన నిర్మాణానికి చర్యలు చేపట్టామన్నారు. అయితే అధికారులు ఆలయ నిర్మాణ స్థలం పర్యాటకశాఖకు చెందినదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. స్థలాన్ని పూర్తిస్థాయిలో పరిశీలించి న్యాయం చేసేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బయ్యన్న, ఆలయ కమిటీ సభ్యులు బొజ్జా నర సింహులు, శ్రీనివాసులు, పెదవెంకటయ్య, మేస్త్రీ వెంకటేశ్వర్లు, నాగయ్య పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదెల మృతి

ఉదయగిరి రూరల్, జూలై 15: గంగిరెడ్డిపల్లికి చెందిన కలమకూరి మల్లేశ్వరి, శ్రీనివాసులు, శేషారెడ్డికి చెందిన ఒక గేదె, మూడు దూడలు విద్యుదాఘాతంతో మృతి చెందిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. మూడురోజుల క్రితం అటవీ ప్రాంతానికి మేతకెళ్లాయి. గుర్తుతెలియని వ్యక్తులు వన్యప్రాణుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ కంచె తగిలి గేదెలు మృతి చెందాయని బాధితులు వాపోయారు. వీటి విలువ రూ.లక్ష ఉంటుందన్నారు.

ఉర్దూ పాఠశాల ఆకస్మిక తనిఖీ

సీతారామపురం, జూలై 15: రంగనాయుడుపల్లిలోని ఉర్దూ పాఠశాలను సోమవారం ఉప తనిఖీ అధికారి షేక్ ఖాజామొహిద్దీన్ సోమవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. పాఠశాలకు ప్రార్థనా సమయానికి హాజరై విద్యార్థులకు సూచనలిచ్చారు. పేదరికం పోవాలంటే విద్యార్థులు బాగా చదువుకొని 100శాతం మార్కులు సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్స్‌ను అందజేశారు. ప్రాథమిక మెయిన్ పాఠశాలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యం, ఉర్దూ నోట్స్, మధ్యాహ్న భోజనం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తురకపాలెంలోని ఉర్దూ ప్రాథమిక పాఠశాలను సందర్శించి బ్యాగులను అందచేశారు. ఆయన సీఆర్పీ ఆవుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పేరు మార్చిన అధికారులు



రైతు సేవా కేంద్రంగా బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు

ఉదయగిరి రూరల్, జూలై 15: పట్టణంలోని రైతు భరోసా కేంద్రం-1ను అధికారులు సోమవారం రైతు సేవా కేంద్రంగా పేరు మార్చి బోర్డు ఏర్పాటు చేశారు. ఆదివారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'ప్రభుత్వ ఉత్తర్వులు వీరికి పట్టవా' అనే కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఉదయగిరి వ్యవసాయ సహాయ సంచాలకులు పీ.చెన్నారెడ్డి సిబ్బందిచే రైతు సేవా కేంద్రంగా బోర్డు ఏర్పాటు చేయించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఉదయగిరి సబ్ డివిజన్ పరిధిలోని అన్ని ఆర్‌బీకేలను రైతు సేవా కేంద్రాలుగా మారుస్తూ బోర్డులు ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు.

ఘనంగా మొహర్రం వేడుకలు

ఆత్మకూరు, జూలై 15: ఎల్ఆర్‌పల్లి పీర్ల చావిడి వద్ద సోమవారం మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. పీర్ల పండగ సందర్భంగా మూడవరోజు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం అన్నదానాన్ని మున్సిపల్ కౌన్సిలర్ షేక్ గౌసబాష ప్రారంభించారు.



ఆత్మకూరు : అన్నదానం చేస్తున్న మున్సిపల్ కౌన్సిలర్ షేక్ గౌసబాష

అనంతసాగరం: మండలంలోని సోమశిల, ఉప్పలపాడు, అనంతసాగరం, ముస్తాపురం, పీడీపల్లి, ఆమనిచిరివెళ్ల, కేడీపల్లి గ్రామాల్లో సోమవారం మొహర్రం వేడుకలు ప్రారంభమయ్యాయి. పీర్లచావిడి వద్ద పీర్లను ఏర్పాటు చేసి ప్రత్యేక పతేహా నిర్వహించారు.

అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్



ఉదయగిరిలోని పంచాయతీ బస్టాండ్‌లో స్తంభించిన ట్రాఫిక్

ఉదయగిరి రూరల్, జూలై 15: పట్టణంలోని పంచాయతీ బస్టాండ్, మెయిన్‌బజార్, గండిపాళెం మార్గంలో వాహనదారులు తమ వాహనాలను అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తుండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. సోమవారం పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో యజమాని కారును రోడ్డుపైనే నిలిపి వెళ్లడంతో ట్రాఫిక్ స్తంభించింది. ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు రోడ్డు మీద అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తుండడంతో ప్రజలు, వాహనదారులు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో బస్టాండ్ ప్రాంతంలో ట్రాఫిక్ అధికంగా ఉంటుంది. ఆ సమయంలో పోలీసులు రోడ్లపై వాహనాలను పార్కింగ్ చేయకుండా చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

స్థలం ఆక్రమణపై చర్యలు తీసుకుంటాం

చేజర్ల, జూలై15 : మండలంలోని అదురుపల్లిలో కాలనీ భూమి అక్రమణపై చర్యలు తీసుకుంటామని తహసీల్దారు కే. గోపికృష్ణ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అదురుపల్లిలోని అదూరమ్మ ఆలయానికి దక్షిణవైపున ఉన్న 2.20 ఎకరాలను పేదల ఇళ్ల కోసం ప్రభుత్వ కొనుగోలు చేసిందని, ఈ నేపథ్యంలో అక్క డ కొంత స్థలంలో కాలనీ కూడా నిర్మాణం చేశారని తెలిపారు. అయితే ఖాళీగా ఉన్న స్థలాన్ని గ్రామానికి చెందిన కొంతమంది వైసీపీ నేతలు సేద్యం చేయించి వంగ చెట్లు నాటించారని మంత్రి ఆనంకు పలువురు ఫిర్యాదు చేశారన్నారు. మంత్రి అదేశాల మేరకు అక్రమణలపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



నేతలు ఆక్రమించిన పేదల ఇళ్లస్థలం

ఉత్తమ విద్యార్థులకు నగదు బహుమతి

ఏఎస్‌పేట, జూలై 15: స్థానిక ఠాగూర్ పాఠశాల పూర్వ విద్యార్థులు మధుసూదన్‌రెడ్డి, మహేష్‌రెడ్డి ప్రతి ఏటా పాఠశాలలో 10వ తరగతిలో మొదటి స్థానం సాధించిన వారికి నగదు బహుమతి అందచేస్తున్నారు. అలాగే 2023-04 విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో మొదటి స్థానం సాధించిన వీ యశితకు సోమవారం రూ. 10వేల నగదు బహుమతిని, షీల్డ్‌ను అందచేశారు. ఇంగ్లీషు ఉపాధ్యాయుడు నాగభూషణం తన సతీమణి సత్యవతమ్మ జ్ఞాపకార్థం నియోజకవర్గ, జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన పాఠశాల విద్యార్థి కే మోహన్ నరేంద్రకు రూ. 10వేల నగదు,షీల్డ్ అందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రమణారెడ్డి, హెచ్ఎం దొరస్వామిరెడ్డి, ఉపాధ్యాయు లు,విద్యార్థులు పాల్గొన్నారు.



నగదు ఇస్తున్న పూర్వ విద్యార్థులు

పెయింటింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

ఉదయగిరి, జూలై 15: నిరుద్యోగ యువతీ, యువకులకు న్యాక్ ఆధ్వర్యంలో పెయింటింగ్ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు నిర్వాహకులు లక్కినేని ప్రకాష్‌రావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పెయింటింగ్, డ్రాయింగ్, లెటర్ రైటింగ్, ఫిగర్ వర్కులో శిక్షణ ఇవ్వబడుతుందని, శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు సెల్:91773 27797 అనే నెంబర్‌ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

సహజ సంపదలను దోచుకుంది వైసీపీ నేతలే..

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జూలై 15: వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో సహజ సంపదలు (ఇసుక, మట్టి, తెల్లరాయి)ని అక్రమంగా రవాణా చేసి వైసీపీ నేతలు కోట్లకు పడగలెత్తారని దుత్తలూరు మాజీ ఎంపీపీ శ్రీకుర్తి రవీంద్రబాబు తెలిపారు. సోమవారం దుత్తలూరులో టీడీపీ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సహజ సంపదలను దోచేసి రాష్ట్ర ఖజానాకు తీవ్రనష్టం కలిగిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అందుకే ఈ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు వైసీపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పారన్నారు. అక్రమ రవాణాకు పాల్పడి డబ్బు సంపాదించాలనే ఆలోచన టీడీపీ నాయకులది కాదన్నారు. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గత వైసీపీ పాలనలో అక్రమాలను ఒక్కొక్కటిగా వెలుగులోకి తీసుకొస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చీదర్ల మల్లికార్జున, కాకర్ల మధు, అన్నపురెడ్డి చినవెంగళరెడ్డి, సింగవరపు వెంకటేశ్వరరెడ్డి, చిన్నపురెడ్డి పాల్గొన్నారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

కౌలురైతులకు అవగాహన సదస్సు

జలదంకి, జూలై 15: కౌలురైతులకు మండల వ్యవసాయాధికారిణి శైలజ సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కౌలురైతులు ఈ-గుర్తింపుకార్డులు పొందేందుకు కావాల్సిన అర్హతలపై వివరించారు. కార్యక్రమంలో పలువురు రైతు లు, వీఆర్వోలు, వీఏఏలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఎవరినీ వదిలం

కావలి, జూలై15: ప్రభుత్వ భూములు ఆక్రమించి లేఅవుట్లు వేసినా, ఇళ్ల నిర్మాణాలు చేపట్టినా ఎవరినీ వదిలేదిలేదని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. ఆర్డీవో కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కారవేదికలో ఆయన పాల్గొన్నారు. వివిధ సమస్యలపై వచ్చిన ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు త్వరగా పరిష్కరించమని ఆర్డీవోకి చెప్పారు. కావలి పాతూరుకు చెందిన రైతులు తమ పొలాల్లో ఉన్న పంట కాలువలు, గుంటలు ఆక్రమణలకు గురయ్యాయని, వాటిని కాపాడాలంటూ ప్రదర్శనగా ఆర్డీవో కార్యాల యానికి వచ్చారు. వారి సమస్యలు తెలుపుతూ ఆర్డీవోకు, ఎమ్మెల్యేకు వేర్వేరుగా అర్జీలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ భూములు ఆక్రమణలన్నీ కిందిస్థాయి నుంచి పై సాయి వరకు అధికారులకు తెలిసే జరిగినందున, వాటిని కాపాడుకునేందుకు వారు వెనుకాడుతున్నారన్నారు. వారు కాక పోయినా, రేపు కొత్త అధికారులు వస్తారని అప్పుడు ఆక్రమణల బాగోతమంతా వెలికి తీస్తామన్నారు. జగనన్న కాలనీల్లో వైసీపీ నేతలు మైనర్ పిల్లల పేరుపై కూడా నివేశనస్థలాల పట్టాలు పొంది ఉన్నారన్నారు. వాటిపై విచారణ జరిపిస్తామని పేర్కొన్నారు.



రైతులతో కలిసి ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

● మొహర్రం ప్రార్థనల్లో ఎమ్మెల్యే కావ్య

కావలి టౌన్: పట్టణంలోని జెండాచెట్టు పీర్ల చావిడి వద్ద సోమవారం జరిగిన పీర్ల ఉత్సవాల్లో ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా ప్రార్థనలు చేసి, అనంతరం అన్నసంతర్పణను ప్రారంభించారు. దర్గా అధ్యక్షుడు ముస్తఫా అధ్యక్షతన ఉత్సవాలు జరుగుతున్నాయి. కార్యక్రమంలో మైనార్టీ నేతలు అర్షియా, ఖాదర్‌బాషా, రఫీ, రహీం, టీడీపీ నేతలు మలిశెట్టి వెంకటేశ్వర్లు, గుత్తికొండ కిషోర్, పొట్లూరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

● రామానాయుడు మృతికి ఎమ్మెల్యే కావ్య సంతాపం

జలదంకి : బీకే అగ్రహారం టీడీపీ సీనియర్ నాయకుడు కంచర్ల రామానాయుడు అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి సోమవారం గ్రామానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. నివాళులు అర్పించిన వారిలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వంటేరు జయచంద్రారెడ్డి, బ్రాహ్మణక్రాక ఉపసర్పంచి దగుమాటి మాల్యాద్రిరెడ్డి ఉన్నారు.

అల్లూరు అల్లుడిగా రుణం తీర్చుకుంటా..!

అల్లూరు, జూలై 15: ఈ ఊరి అల్లుడిగా తనను ఆదరించి గెలిపించిన అల్లూరు గ్రామస్థుల రుణం తీర్చుకుంటానని కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో సోమవారం సాయంత్రం నిర్వహించిన స్వచ్ఛ సంకల్ప కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అల్లూరు మండల ప్రజలు అత్యధిక మెజార్టీతో గెలిపించారని, ఇందుకు అల్లూరు అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, ఎంపీపీ దర్శిగుంట శశిరేఖ, ఎంపీడీవో జ్యోతి, తహసీల్దారు దుర్గేశ్వరరావు, నాయకులు బండి అమర్‌రెడ్డి, నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, మేడా కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ప్రజలకు అందుబాటులో ఉండి పనిచేయాలి

ఎమ్మెల్యేగా గెలుపొందిన తరువాత తొలిసారిగా అల్లూరుకు వచ్చిన కావ్య కృష్ణారెడ్డి సోమవారం సాయంత్రం అధికారులతో పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ అధికారి ప్రజలతో మంచి సంబంధాలు కలిగి ఉండి పనులు చేసిపెట్టాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

సహకార బ్యాంకు గోదాము స్థలం కబ్జాకు యత్నం

అల్లూరు, జూలై 15: స్థానిక డీసీసీబీ శాఖకు చెందిన గోదాము స్థలాన్ని అలూరుకు చెందిన ఓ వ్యక్తి కబ్జాకు యత్నించారు. దీంతో ఆ బ్యాంకు డీజీఎంలు మధుఎసూదనరావు, దయాకర్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ బ్యాంకు గోదాము స్థలాన్ని ఇతరులు ఆక్రమించేందుకు శుభ్రం చేశారని సమాచారం అందడంతో పరిశీలించేందుకు తాము వచ్చామన్నారు. ఎవరైనా కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక మేనేజరు స్వప్న, అల్లూరు పీఏసీఎస్ సీఈవో రాధయ్య పాల్గొన్నారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఎమ్మెల్యే ఇంటూరికి పాస్టర్ల సత్కారం

కందుకూరు, జూలై 15: ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును సోమవారం నియో జకవర్గంలోని పాస్టర్లు ఘనంగా సత్కరించారు. ఐదు మండలాలకు సంబంధించిన పాస్టర్లు ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లి ఆయన్ను ఘనంగా సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఆశీర్వదించారు. ఎమ్మెల్యేగా విజయం సాధించిన మీరు పాలనలోనూ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాస్టర్లు గోనుగుంట వెంకటేశ్వర్లు (తిమోతి), జడ ఆంతోని బాబు, శ్యామ్, జోషఫ్‌కుమార్, కాలేబు, యాకోబు, దేవకుమార్, లాబాను, యేసుదాస్, సామ్యేలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును సత్కరిస్తున్న పాస్టర్లు

వైద్యసేవల్లో లింగసముద్రం పీహెచ్‌సీకి ప్రథమస్థానం

లింగసముద్రం,జూలై 15: రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ ఇటీవల ప్రకటించిన గ్రేడ్లలో లింగసముద్రం పీహెచ్‌సీ జిల్లాలో మొదటిస్థానం, రాష్ట్రంలో 285వ స్థానం పొందింది. దీంతో పలువురు జిల్లా ఉన్నతాధికారులు, స్థానిక అధికారులు, పీహెచ్‌సీ వైద్యులు డాక్టరు పీ రమేష్, డాక్టర్ ఏ అనూరాధ, సీహెచ్‌వో జీ శ్రీనివాసులు, ఆరోగ్య సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా సోమవారం డాక్టర్ రమేష్ మాట్లాడుతూ, పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయడం వల్లే ఈ గుర్తింపు లభించిందన్నారు.

చెట్లలోకి దూసుకెళ్లిన బస్సు : తప్పిన ప్రమాదం



మోచర్ల వద్ద చెట్లలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

గుడ్లూరు, జూలై 15: మండలంలోని మోచర్ల దగ్గర జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున ప్రయాణికులతో వెళుతున్న ఆర్టీసీ బస్సు ప్రమాదవశాత్తు చెట్లల్లోకి దూసుకువెళ్లింది. విజయవాడ నుంచి తిరుపతికి 36 మంది ప్రయాణికులతో వెళుతున్న ఆర్టీసీ బస్సు మోచర్ల దగ్గరకు రాగానే, కురుస్తున్న వర్షంతో రోడ్డు కనిపించక చెట్లల్లోకి దూసు కెళ్లింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగ్గపోవడంతో ప్రయాణికులంతా ఊపిరి పీల్చుకున్నారు. కాగా ఇతర బస్సుల్లో ప్రయాణికులను వారివారి గమ్యస్థానాలకు చేర్చారు.

హెల్మెట్ లేకుండా వాహనం నడపడం నేరం

కావలిటౌన్, జూలై 15: హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడపడం నేరమని లోక్ అదాలత్ చైర్మన్ ఎం. శోభ పేర్కొన్నారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం న్యాయవాదుల గుమాస్తాల సంఘం హాలులో న్యాయవిజ్ఞాన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించి, వాహనాలు నడపాలన్నారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపిన వారికి జరిమానా తప్పదన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ న్యాయాధికారి ఈ సుధాకర్, ప్రత్యేక న్యాయాధికారి పరుశురామ్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, లీగల్ ఎయిడ్ మెంబర్ సాయిప్రసాద్, లోక్‌అదాలత్ సభ్యుడు మాలకొండారెడ్డి, న్యాయవాదుల గుమాస్తాల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రణీత్‌కు జాతీయ అవార్డు

కావలి, జూలై 15: పట్టణానికి చెందిన స్వచ్ఛంద సేవా సంస్థ టీంసేవియర్స్ వలంటరీ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు నల్లిపోగు ప్రణీత్ జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. భారతీయ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ వ్యవస్థాపక దినం సందర్భంగా సోమవారం తమిళనాడు రాష్ట్రంలోని ఊటీలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును ఆయనకు అందచేశారు. ఈ అవార్డుకు దేశవ్యాప్తంగా నలుగురిని ఎంపిక చేయగా, వారిలో ప్రణీత్ ఒకరు. ఈ పురస్కారాన్ని స్ప్రింగ్‌డే యూనివర్శిటీ ఆచార్యులు డాక్టర్ జేమ్స్, ప్రొఫెసర్ పార్థసారధి చేతుల మీదుగా అందుకున్నారు.



జాతీయ అవార్డును అందుకుంటున్న ప్రణీత్

పాఠశాలకు బల్లల అందచేత



పాఠశాలకు బల్లలు అందచేసిన గ్రామస్థులు

ఉలవపాడు, జూలై 15: పెద్దపట్టపు పాలెం జడ్పీ ఉన్నత పాఠశాలకు అవసరమైన బల్లలను సోమవారం గ్రామస్థులు ప్రధానోపాధ్యాయుడు ఎస్‌కే సలీంబాషాకు అందచేశారు. గ్రామానికి చెందిన ఆవల వాసు, తూపిలి రమేష్, ఊటుకూరి రాంబాబు, వాయల తిరుపతిరావు, లూపిలి శ్రీనివాసులు, గణిత ఉపాధ్యాయిని నీరజ తదితరులు కలిసి బల్లలు అందచేసినట్లు హెచ్ఎం తెలిపారు. పాఠశాలలో సమావేశ మందిరం నిర్మాణానికి గ్రామ పెద్దలు ఆవల రఘురామయ్య, ఏడుకొండలు, వెకంటేశ్వర్లు, నరసింహ, అంకయ్య భరోసా ఇచ్చారని ఆయన తెలిపారు.

నేటి నుంచి ఆధార్ స్పెషల్ డ్రైవ్

కందుకూరు, జూలై 15: పట్టణంలోని ఏకలవ్యనగర్ ప్రాంతంలో నివసిస్తున్న పేదల్లో అనేకమందికి ఆధార్‌కార్డులు లేవు. ఈ సమాచారంతో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మంగళవారం ఉదయం పదిన్నర నుంచి ఆ ప్రాంతంలో ఆధార్‌కోసం స్పెషల్ డ్రైవ్‌ను ఏర్పాటు చేయించినట్లు ఎమ్మెల్యే కార్యాలయం ఒక ప్రకటనలో తెలిసింది. నియోజకవర్గంలో ఆధార్ లేనివారంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నేతలు పేర్కొన్నారు.

కలిగిరమ్మకు ప్రత్యేక పూజలు

కలిగిరి, జూలై 15: కలిగిరి గ్రామదేవత తిరునాళ్లలో రెండోరోజు సోమవారం పాపనముసిలిపాలెంలో గ్రామోత్సవం నిర్వహించారు. ముందుగా పట్టణంలోని కలిగిరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పాపన వంశస్థులు వీరతాళ్లకు ప్రత్యేక పూజలు చేసి, పాపనముసిలిపాలెంలో గ్రామోత్సవం నిర్వహించారు.

ముళ్ల చెట్ల తొలగింపు



ముళ్లచెట్లను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

బిట్రగుంట, జూలై 15: బోగోలు మండలం జక్కేపల్లిగూడూరు విద్యుత్ సబ్‌స్టేషన్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్ళచెట్ల తొలగింపును సోమవారం చేపట్టారు. మండల తెలుగు రైతు అధ్యక్షుడు కరిపిరెడ్డి సుబ్బారెడ్డి సొంత నిధులతో ఈ కార్యకమాన్ని నిర్వహించారు. అంతేకాక రోడ్డుపై ఉన్న గుంతల్లో గ్రావెల్ కూడా వేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు తలకాయల క్రిష్ణయ్య, కే.కృష్ణారెడ్డి పేరం క్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంగపెట్టె ఊరేగింపు

బిట్రగుంట, జూలై 15: బోగోలు యాదవపాలెంలో పోలేరమ్మ, గంగమ్మ తిరునాళ్లు ముగిసి నెల పూర్తి కావడంతో స్థానికులు సోమవారం రాత్రి బొల్లిఆవులు, గంగపెట్టె ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. మేళతాళాలు, తప్పెట్ల మోత, యువత వీరతాళ్ల నృత్యాల మధ్య గ్రామంలో ఊరేగింపు జరిగింది.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసు

ఆత్మకూరు, జూలై 15 : గురుపౌర్ణమి సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ఆత్మకూరు నుంచి అరుణాచలంకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ షేక్ కరీమున్నీసా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20వతేదీ ఉదయం ఆత్మకూరు నుంచి బస్సు బయలుదేరుతుందన్నారు. మార్గమధ్యంలో కాణిపాకం, సిరిపురం గోల్డెన్ టెంపుల్ దర్శించుకుని భక్తులు అరుణాచలంకు చేరుకోవచ్చని పేర్కొన్నారు. టికెట్ ధర రాను పోను రూ.1400 నిర్ణయించినట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 99592 25645, 99660 09395, 85559 29504 నెంబర్లను సంప్రదించాలన్నారు. టికెట్‌ను ఆన్‌లైన్‌లో కూడా బుక్ చేసుకోవచ్చన్నారు.

హెచ్‌పీసీఎల్‌కి యాభై ఏళ్లు

కలువాయి, జూలై 15: హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) ఏర్పడి జూలై 15వతేదీ నాటికి 50 ఏళ్లు పూర్తయింది.ఈ సందర్భంగా స్థానిక హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో సోమవారం వెరుబొట్లపల్లిలో ఎల్‌పీజీ పంచాయతీ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు మేకపాటి వెంకటనరసారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బోగోలులో మొహర్రం వేడుకలు

బిట్రగుంట, జూలై 15: బోగోలు మండలంలో మొహర్రం సందర్భంగా సోమవారం పీర్లచావిడిల వద్ద ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. పీర్లచావిడి వద్ద రాత్రికి గుండం తొక్కేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గుర్రంపై పీర్లను తీసుకుని ఇబ్రహీంపేట, రాజావీధిలో ఊరేగించారు.